


ఆంధ్ర సచిత్ర వార పత్రిక
30-7-82
150 పైసలు


TANTEX + TANTEX + TANTEX + TAN


TANTEX
THE SEAL OF
TANTEX
QUALITY

నటుల ముఖచిత్రాలు

హేమమాలిని ముఖచిత్రం అంత బాగాలేదు. ఈ మధ్య చాల వారములనుండి నటీమణుల ముఖచిత్రములనే ప్రచురించుచున్నారు. నటుల చిత్రాలను కూడా ముద్రించాలని మా మనవి.

ఎస్. మాధవరావు మిత్ర బృందం (విలస)

ప్రొ ఫె స ర్

ప్రొఫెసర్ కథ చాల బావుంది. నేటి విద్యార్ధులకు కనువిప్పు కలిగించేదిలా ఉన్నది. కాలం కరిచాక సీరియల్‌లో మీనాక్షిని చంపటం పాటకులకు కొంత నిరుత్సాహాన్ని కలిగించింది. ముఖచిత్రం, నటి హేమమాలిని అని, చూచిన వెంటనే అనిపించలేదు.

బి. సుబ్బారావు (మార్కాపురం)

హేమమాలిని

ముఖచిత్రం హిందీ నటి హేమామాలిని చెప్పలేనంత అందంగా ఉంది. ఉమెన్ కార్టూన్లు, ధర్మపథంలో రేపెలా ఉంటుందో చాలాబావున్నాయి.

తోట శోభన్‌బాబు, పి.శేఖర్‌బాబు (ఖర్గపూర్)

ర స ప ట్టు

"ప్రేమ దేవత" మంచి రసపట్టుతో సాగుచున్నది.

పులపర్తి శ్రీరంగ (మొగల్తూరు)

ముగ్ధ మనోహరం

నటి సత్యకళ ముఖ చిత్రంతో ముగ్ధ మనోహరంగా, ఉంది. ఆంధ్రుల ఆడపడుచును చూసినట్లయింది.

కడియాల చంద్రుడు (మహబూబ్‌నగర్)

ఆకర్షణీయంగా లేదు

9.7.82 సంచిక ముఖచిత్రం అంత ఆకర్షణీయంగా లేదు. "నీవు నేర్పిన విద్యయే నీలకంటం" "కామా" రెండు కథలు చాలా బాగున్నాయి.

గీతశ్రీ మణిపాత్రో (ఇచ్ఛాపురం)



చెప్పలేని ఆనందం

డ్రీమ్ గర్ల్ హేమమాలిని ముఖచిత్రంతో ఆంధ్రపత్రిక ఎంతో ముగ్ధమనోహరంగా ఉంది. ఈ వారం అధిక సంఖ్యలో కథలు ప్రచురించడం ఒక విశేషం. కథల సంఖ్య చాల అయ్యేసరికి ఏది ముందు చదివాలో అనే సందిగ్ధావస్థలో పడిపోయాను. అయినా కథలన్ని వరుసక్రమంలో చదివాను. అన్నికథలకన్నా లవ్‌లేబర్స్ లాస్ట్ కథ చదివి నేను పొందిన ఆనందం చెప్పలేనిదని చెప్పకోక తప్పదు. ఈ వారంతో ప్రారంభమయిన ప్రేమదేవత సీరియల్ పాటకలోకానికే మరొక ఆణిముత్యం.

కందిగట్ల ప్రభాకర్ (జనగామ)

సం దే హం

నటి సత్యకళ ముఖచిత్రంతో వెలువడిన (9.7.82) పత్రికలో "ధర్మపథం" శీర్షికలో శ్రీ బులుసు వేంకటరమణయ్యగారు రాసిన బుల్లి కథ చదివేను. కథ బాగానే వుంది. గాని నాదొక సందేహం. గొప్పింటి పిల్ల దరిద్రుణ్ణి ఎంచుకుని పెళ్లాడి భగవంతుని యందు విశ్వాసము లేనివాడనే నెపముతో అతనితో పొత్తు కుదరదని పుట్టింటికి పరుగెత్తిందా యిల్లాలు.గాని హిందూ సాంప్రదాయంప్రకారం పతియేదైవమనుకొని భగవంతుని యందు విశ్వాసముంచి భర్తను కూడా మార్చవచ్చు అని నా అభిప్రాయం. భర్తను తూలనాడిన స్త్రీ "పతివ్రత" అనిపించుకోదు.

మరువాడ సూర్యప్రకాశం (కాశీబుగ్గ)

సమస్యల ప్రతిబింబాలు

మన దేశంలో వున్న సమస్యల్లో స్త్రీ పునర్ వివాహం, నిరుద్యోగం ఈ రెండూ సమస్యల ప్రతిబింబాలు. 'మళ్లీపెళ్లి' "నీవు నేర్పిన విద్యయే నీలకంటం" కథలు, పురుషుడు మళ్లీ వివాహం చేసుకుంటే హర్షిస్తుంది లోకం అదే స్త్రీ. చేసుకుంటే హర్షించదు. మారుతున్న సమాజంలో పురుషుడు మారినంతగా స్త్రీ ఇంకా మారలేదు. అనిపించింది నాకు ఈ కథ చదివాక. రికమెండేషన్ లేనిదే ఉద్యోగంరాదు. డొనేషన్ కట్టనిదే కాలేజీలో సీటు రాదు. భూమి సూర్యుడు చుట్టు తిరుగుతుంది. మనిషి మాత్రం డబ్బు చుట్టు తిరుగుచున్నాడు. ఇటువంటి సమాజంలో శేఖర్ లాంటి వ్యక్తి నూటికి ఒక్కరు వుంటేచాలు దేశం బాగుపడుతుంది.

కుమారి కొవ్వూరి గౌరివిజయలక్ష్మిరెడ్డి (కొత్తపేట)

అందరికి నచ్చదు

"మళ్లీ పెళ్లి" కథ చదివాను. నేను ఆశించినంత తృప్తి నివ్వలేదు. విజయ్ భర్తను కోల్పోయిన ఒక స్త్రీని మళ్లీ పెళ్లి చేసుకోవడానికి ముందుకు రావడం అతని దృష్టిలో మంచి అయినా అది అందరికి నచ్చదు. తగని పని చేస్తే అందరు చిన్న చూపుతో చూడడం సహజం !

కందిగట్ల ప్రభాకర్ (జనగామ్)

ధన్యవాదాలు

కేవలం కథలు, సీరియల్స్ కాకుండా ఎన్నో ఆశ్చర్యకరమైన విషయాలు తెల్పుతున్నారు.

పురుషోత్తం, రమణ (వనస్థలిపురం)

భావయుక్తం

వసుంధరగారి'ఆవు—పులికథ' బావుంది. ఉమెన్ గారి 'లోకం పోకడ' భావయుక్తంగా వుంది.

ఎల్. శ్రీనివాస్ (భువనేశ్వర్)

ఆకర్షణీయం

"సత్యకళ" ముఖ చిత్రంలో వెలువడ్డపత్రిక ఆకర్షనీయంగా వుంది. మీారు ప్రచురిస్తున్న మూడు సీరియల్స్ ఒకదానితో ఒకటి పోటీగ ముందుకు సాగుతున్నాయి. "మళ్లీ పెళ్లి" కథ వాస్తవానికి దగ్గరగావుండి మమ్మల్ని ఆకట్టుకుంది.

ఎం. నాగేశ్వరరావు, ఎం. బాబూరావు (బైపల్లి

మలుపులు

ఎన్నెన్నో మలుపులు తిరిగి చివరకు మేము అనమానించినట్లే సుజాతకు మతి స్థిమితం లేదని ఈ వారం 'మనసు కథ'లో తెలిసింది. ఏమైనా వాసిరెడ్డి సీతాదేవిగారు గొప్పగా సస్పెన్స్‌తో పాటకులను వుర్రూతలూగిస్తున్నారు.

ఎస్. ఇందుముఖి (హైదరాబాద్

పూలవర్షం

2.7.82 నాటి ఆంధ్ర పత్రిక మా ఇంటిలోకి రాగానే మా ఇంటిలో పూలవర్షం కురిసినట్టయింది. ఈ సంచికలో వసుంధరగారు రచించిన "ఆవూ—పులి కథ" చాలా బాగుంది.

పి. రామమోహన్ (సిద్దిపేట)


ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938—1972]
శుక్రవారం : 30—7'—82
దుందుభినామ సం. శ్రావణ శు. దశమి
సంపుటము 75 : సంచిక 47
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
*
పోస్ట్‌లో ఏడాది చందా రు. 85—80
ఆరు మాసాల చందా రు. 42—90
విడి ప్రతి వెల రు. 1—50
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం. విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
(ఫోటో :

లోకంపోకడ ✳ డూశిమెన్



సీరియల్

ప్రేమదేవత

భీశెట్టి శారదాలక్ష్మీరావ్

ఆ రాత్రి –

బాల – కరుణాకర్‌ల మధురమైన మొదటి రాత్రికి శోభనం గదిని శృంగార మందిరంగా అలంకరింప జేసింది – భారతీ దేవి.

బాల గదిలోకి కరుణాకర్ వచ్చాడు. గది తలుపులు మూసుకున్నాయ్.

పాలరాతి బొమ్మలా నిలబడి శూన్యంలోకి చూస్తున్న బాలను చూశాడు కరుణాకర్.

'తన అనురాగానికి, అమ్మ ఆదరణకు – బాల ఎంతో ఆనందిస్తుంది. తన అదృష్టానికి ఉప్పొంగిపోతుంది. దైవికంగా లభ్యమైన బాల తన జీవితానికొక అపూర్వ వరం. బాలను కూడిన సుఖం స్వర్గాన్ని మరిపిస్తుంది' అని ఎన్నెన్నో ఆలోచిస్తూ ఊహల శిఖరాలపై ...ఆశల హర్మ్యం కట్టుకుంటూ బాలను చేరాడు– కరుణాకర్ ! పొంగి పొరలే కన్నీటితో కరుణాకర్ పాదాల మీద వాలి పోయిన బాలను చూసి, కరుణాకర్‌కి అర్థం కాలేదు.

"ఏమిటి త్రిపురా!" లేవనెత్తి అనునయంగాకన్నీరుతుడిచాడు–"ఆనందంతో ఓలలాడవలసిన ఈ క్షణంలో నీ కంట కన్నీరా... !" ఆశ్చర్యంగా అడిగాడు–కరుణాకర్.

"నన్ను క్షమించండి ! నా మనో మందిరంలో ఒక దేవుని ప్రతిష్ఠ ఏ నాడో జరిగి పోయింది నా హృదయ ఫలకంపై ఆ దేవుని రూపు చెరపలేను. స్మృతిని మరువ లేను. మిమ్మల్ని భర్తగా స్వీకరించలేను. ఆ రోజు ఆ దుర్మార్గుల బారి నుండి తప్పించు కోవడం కోసమే–తల వంచాను. అంతే ... ! కాని...యీ మనస్సు ఏనాడో ఒకరికి అంకితమై పోయింది" అంటూ గోడకు తల

(గత సంచిక తరువాయి)

బాదుకోసాగింది బాల.

షాక్ తిన్నాడు కరుణాకర్.

ఊహల శిఖరాలు విరిగి, ఆశల హర్మ్యం నేల కూలి పోయింది.

బాలను నివారించాడు.

జరిగిన కథ 4– :మేనత్త మేనమామ బిడ్డలు శివ – బాలలు. శివ చక్కటి చిత్రకారుడు. బాల నాట్య మయూరి. ఒకరంటే మరొకరికి ఎనలేని ప్రేమ. ఆ కొండల్లో, కోనల్లో ఆడుతూ, పాడుతూ ఏ అదుపూ అడ్డూ లేకుండా సంచరిస్తుంటారు ఆ ప్రేమికులు. బాల అన్న సత్యం కొనితెచ్చిన జడకుచ్చుల్ని వదిన కనకం మంటల్లోకి విసురుతుంది. అది చూచిన శివ యిల్లువదలి పట్నంలో సుధా పబ్లిసిటీలో చేరి కష్టపడి బంగారు జడ కుచ్చులు కొంటాడు. ఇంతలో విప్లవమీద నుండి జారి పడిన శివ డా. కరుణాకర్ ఆస్పత్రిలో చేరతాడు. తుపాను భీబత్సంలో పడి మరణించిందనుకొన్న బాల డాక్టర్ కరుణాకర్ భార్యగా కన్పిస్తుంది శివకి. ఇలా ఎందుకు జరిగిందో వెనుక జరిగిన సంఘటనలు చెప్తుంటుంది బాల శివకి. పెనుతుపాను కారణంగా 'నా' అన్న వాళ్లందరిని పోగొట్టుకున్న బాల డాక్టర్ కరుణాకర్ సేవతో కోలుకుంటుంది.బాలను తనకప్పగించమని బలరామ్ వత్తిడిచేయగా తప్పని పరిస్థితులలో కరుణాకర్ బాల మెడలో తాళి కడతాడు. కొడుకు చేసిన మంచిపనిని భారతీదేవి మెచ్చుకొని, నిండు మనసుతో దంపతులను ఆశీర్వదిస్తుంది.

"మీరూ, మీ అమ్మగారూ నా పాలిట దేవతామూర్తులు. నా మీద దయవుంచి – నన్నిలా వదిలెయ్యండి. భయపెట్టి ... బాధ పెట్టి–ప్రశ్నిస్తే మాత్రం యిక్కడే ... ప్రాణాలు వదుల్తాను."

కరుణాకర్ కాళ్లకింద భూమి కంపించింది. నోటమాట పెగల్లేదు. ప్రపంచమంతా గిర్రున తిరిగినట్లయింది.

ఎంత పొరపాటు జరిగిపోయింది.

పెళ్లి కాకముందు త్రిపుర మరొకరికి మనసిచ్చిందా !

ఆమె మనస్సు తెలుసుకోకుండా తాను తాళి కట్టాడా ? ఎంత ఘోరం?

ఇప్పుడు ఏం చేయడం ?

తన కోడలి ఆంక్షలు – ఆకాంక్షలు తెలిస్తే అమ్మ ఎంతగా కుమిలిపోతుంది !

నిర్మలమై, నిశ్చలమైన తటాకంలాంటి తన మనస్సులో బాల రాయి విసిరింది. అంతులేని ఆలోచనల మధ్య చక్రబంధితుడయ్యాడు కరుణాకర్. చివరకు ఓ నిర్ణయం తీసుకున్నాడు. గబగబా బాల దగ్గరకు వచ్చాడు.

"చూడు బాలా ! నీవు నా పరంగా గానీ, అమ్మ పరంగా గానీ ఏ నిర్బంధమూ రాదు. పరాధీనమైన నీ మనస్సు బలవంతంగా నాకు స్వంతం కావాలనుకునే మూర్ఖుడ్ని కాదు. నిరభ్యంతరంగా, యిక్కడే వుండవచ్చు. ఈ యింటి ఆడపడుచుగా నా దృష్టిలో ఎప్పుడూ నీకు గౌరవమైన స్థానం ఉంటుంది. అయితే చిన్న అభ్యర్థన" దీనంగా అడిగాడు కరుణాకర్.

'ఏమిటన్నట్టు' కళ్లెత్తి చూసింది బాల.

"నా పెళ్లి గురించి అమ్మ ఎన్నెన్నో కలలు కంది. అనుకోని పరిస్థితుల్లో నీకు తాళి గట్టినా...అమృత హృదయంతో

మన్నించింది ఇప్పుడు ఇలా అని తెలిస్తే ... చాల బాధ పడుతుంది. అందుకని ఒకలా చేద్దాం. అమ్మ దృష్టిలోనూ – బయటి ప్రపంచానికీ మనం భార్యా భర్తలుగానే ప్రవర్తిద్దాం. కాని...యిక్కడ... ఈ గదిలో నీకు ఏ అపవాదూ రాకుండా నేను కాపాడుతాను'' అంటూ బాల తల మీద చేయివేసి ప్రమాణం చేసాడు కరుణాకర్.

శివ పార్వతుల నొక్కసారి మనసులో తలచుకొని— తృప్తిగా కళ్లు మూసుకుంది బాల.

*   *   *

"నా కూతురి ఆశల్ని, నా ఆశల్ని నీ ఆశయాల పేరిట యిలా అడుగంటింపజేస్తావని కలలో అనుకోలేదు కరుణాకర్ !'' బాధగా అన్నాడు త్రిపురను పెళ్లి చేసుకొని వచ్చిన వార్త విని – కరుణాకర్ దగ్గరకు హుటా హుటిన వచ్చిన పరంధామయ్య.

కరుణాకర్ జరిగింది సాకల్యంగా వివరించాడు. అయినా పరంధామయ్య శాంతించలేదు భారతీదేవి ఎటూ చెప్పలేక, ఏమీ అనలేక మౌనంగా వుండిపోయింది.

అదే సమయంలో—

సుధ వచ్చింది. అంతా వింది ఒక్కసారి తండ్రివేపు తిరిగింది.

ఇందులో కరుణను నిందించవలసిన కారణం కపిపించదు నాన్న ! మనిషి పరిస్థితులకు బానిస. అదే పరిస్థితిలో నే నుంటే ... యిలాంటి త్యాగం చెయ్యవద్దంటారా ! అన్యాయకమైన ఒక ఆడపిల్లను బలి పశువును చేసి, చూస్తూ కసాయి వాళ్ల కప్పగించ మంటారా ! 'తప్పు చేశావు' అని ఒక మనిషిని ఎత్తి చూపించే టప్పుడు ... ఆ తప్పు ఎందుకు చేశాడో అని కూడా ఆలోచించాలి. బాల స్థానంలో నేనే ఉన్నాననుకొని వాళ్లను ఆశర్వదించండి నాన్నా !'' అంది సుధ.

అంతా వింటున్న బాల— సుధ మం స్తత్వాన్ని అర్థం చేసుకుంది.

"మరి, నీభవిష్యత్తు మాటేమిటి తల్లీ!" సుధ కరుణాకర్‌ని సమర్థించడంతో—ప్రశ్నించాడు—పరంధామయ్య.

"అదే చెప్పాలనుకుంటున్నాను. ఇకపై ప్రజాసేవకు నాజీవితాన్ని అంకితం చేస్తాను. డాక్టరుగారి ఆస్పత్రిలో నర్సుగా చేరుతాను." అంటూ ఒకసారి ఎదురుగ్గా కన్పిస్తోన్న బాల వేపు చూచి, గబగబా వెళ్ళి, బయట నున్న కారెక్కింది—సుధ

*   *   *

—చెప్పడం పూర్తిచేసిన బాల ఒక్కసారి కళ్ళొత్తుకుంది.

ఇలాంటి మంచి మనుష్యుల మధ్యా— త్యాగమయుల మధ్యా నీబాల— నీకోసం తపించీ, కృశించీ జీవిస్తోంది బావా! అంటూ శివ చేతుల్లో ముఖం వుంచుకొని కన్నీరు కార్చింది.

శివ బరువుగా నిట్టూర్చాడు. చెక్కిళ్ల మీద జాలువారు తూన్న కన్నీటిని తుడుచుకున్నాడు.

"ఎంత గొప్పవారు డాక్టరుగారూ !" మనసులోనే కృతజ్ఞతలు అర్పించుకొన్నాడు. వెంటనే—" మరి సుధ ఏమైంది ?" ఆశ్చర్యంగా అడిగాడు—శివ.

"నర్సు ట్రైనింగ్‌కు వెళ్లింది. త్వరలోనే ఇక్కడికి రావచ్చు......" జవాబిచ్చింది —బాల.

—అంతవరకూ కిటికీ ప్రక్కగా నిలబడి బాల-శివల సంభాషణ మొత్తం విన్న డాక్టర్



కరుణాకర్, ఒక్కసారి చెమ్మగిల్లిన కళ్ళొత్తుకున్నాడు.

అప్పుడే వస్తున్న వాడిలా గబగబా లోనికి వచ్చాడు.

బాల పైకి లేచింది.

"కంగ్రాచ్యులేషన్స్ శివా! పెద్ద డాక్టరుతో కన్సల్టేషన్ చేశాను. ఆపరేషన్ చేస్తే నీకు తప్పకుండా కళ్ళొస్తాయన్నారు" అన్నాడు చిరునవ్వుతో ఏమీ తెలియనట్టు.

శివ రెండు చేతులా జోడించి కరుణాకర్‌కి నమస్కరించాడు.

"డాక్టర్...! మీరు... మీరు... దేవుళ్ళు డాక్టర్... దేవుళ్ళు...! ఇంతవరకూ మీలోని మంచితనాన్ని చూశాను. కానీ... ఈ క్షణం నుండీ... మీలోని సంస్కారానికి, అమృత హృదయానికీ జోహారు చేయకుండా వుండలేక పోతున్నాను" అన్నాడు కృతజ్ఞతనంతా కళ్ళలో చూపిస్తూ.

"ఇంతవరకూ నీలోని కళామూర్తినే చూశాను కాని... ఇప్పుడు నీలోని కవినికూడా చూడగల్గుతున్నాను" అని నవ్వుతూ... "అంతంత పెద్ద మాటలు వద్దు: బి హేపీ..." అంటూ శివ భుజం తట్టాడు హుషారుగా.

"త్రిపురా! చూశావా! కళ్ళు ఆపరేషన్ చేస్తే ఫలితం వుంటుందనేసరికి శివలో వింత మానోత్సాహం వచ్చిందో!" అని— "అమ్మ ఎదురు చూస్తుంది. ఇంటికి వెళ్ళ త్రిపురా!" అన్నాడు బాలతో.

బాల బయల్దేరింది.

* * *

సుధ—

నర్సు ట్రైనింగ్ పూర్తి చేసుకొని— డాక్టర్ కరుణాకర్ ఆస్పత్రిలో చేరింది. దివా రాత్రులు— రోగులకు సేవ చేయడంలో నిమగ్నమైంది. రౌండ్స్‌లో కరుణాకర్‌కి తారసపడినా— ఒక డాక్టర్‌గానే ఆతనిని పరిగణించేది.

"సుధా! ఉన్నతాధికారి బిడ్డవు. ఎందుకు ఇలా నిన్ను నువ్వు చిత్రవధ చేసుకుంటావ్?" అని బాధగా ఒకటి రెండుసార్లు కరుణాకర్ అడిగినా— సుధ చిరునవ్వే... అతీతమైన జవాబుగా కనిపించేది తప్ప— సరియైన సమాధానం చెప్పేది కాదు.

ఆమెది వ్యధిత హృదయం!

కరుణాకర్‌కి సమాధానం దొరకని ప్రశ్న.

* * *

ఒకవేపు డాక్టర్ కరుణాకర్...

మరోవేపు— బాల...

ఇంకోవేపు— సుధ...

బెడ్‌మీద శివ—...

ఇలా—

—ఒకరిగురించొకరు మానసిక క్షోభతో పరిష్కారంలేని... సమస్యలతో సతమతమయ్యే సమయంలో—

* * *

బలరామ్— జగ్గూలు జైలు నుండి విడుదలయ్యారు—

హోటల్ మూన్‌లైట్‌లో బలరామ్ రాకపట్ల హర్షాతిరేకంతో— అతని అనుయాయులు బ్రహ్మాండమైన—పార్టీ ఏర్పాటు చేశారు. ఆట— పాట— మధువు—మగువలతో ఆ రాత్రి గడిచిపోయింది.

కాని—

బలరామ్ మనస్సు మాత్రం 'బాల' గురించే ఆలోచిస్తోంది.

* * *

"ఆపరేషన్ సక్సెస్ - నీకు చూపు తప్పకుండా వస్తుంది!"

శివకి ఆపరేషన్ దిగ్విజయంగా ముగించి సంతృప్తికరంగా అన్నాడు డాక్టర్ కరుణాకర్.

సుధ కరుణాకర్‌కి సహకరించింది.

* * *

"జగ్గూ! బాలను నాకు కాకుండా ఆ డాక్టరు పెళ్లి చేసుకున్నాడు. వెంటనే బయలుదేరు. బాలను ఎత్తుకురా..." ఆజ్ఞాపించాడు బలరామ్.

జగ్గూ— ముఠాతో బయల్దేరాడు.

* * *

"అమ్మా!"

కొడుకు పిలుపుకి భారతీదేవి తలెత్తింది.

"ఏమిటి కరుణా!"

"... ... ..."

"ఏమిటి కరుణా సంశయిస్తున్నావ్?"

"ఏం లేదమ్మా! నువ్వు క్షమిస్తే ఒక మాట చెప్పాలని..."

"నా దగ్గర సంశయమా! చెప్పుబాబూ!"


"త్రిపురకు తాళి కట్టాను... గాని... ఆమె అంత క్రితమే— 'శివ' అనే తన బావకు మనసిచ్చిందమ్మా!"

"ఆఁ!"

"అవును. ఆ 'శివ' రెండు కళ్ళూ పోగొట్టుకొని ఆస్పత్రిలో వున్నాడు. అతనికి నేనే ఆపరేషన్ చేశాను. తప్పకుండా చూపొస్తుంది..."

"అంటే?"

"ఏం లేదమ్మా! నీతో ఏ కొడుకూ చెప్పని రహస్యం చెప్పాలనుకుంటున్నాను. త్రిపురకు బావమీదున్న మమకారం ఎటువంటిదో మా మొదటి రాత్రే తెల్సుకున్నాను. అప్పట్నుంచీ ఆమెను ఒక నిప్పుగా భావించి, దూరంగా, వుంటున్నాను. నీ దృష్టిలోనూ, ప్రజల



అబ్బాయిని నేనంత విశాలమైన కళ్ళని మురిస్తూ పోయేదానివిగా... చూడు - ఎట్లా బిట్లించుకుని చూస్తున్నాడో... వెధవని అమెరికా పంపటం బుద్ధి తక్కువైంది!

దృష్టిలోనూ మాత్రమే మేము భార్యాభర్తల్లా మసులు కుంటున్నాం. రేపు 'శివ'కి చూపాస్తుంది 'త్రిపుర—శివ'లను నీ చేతుల మీదుగా దంపతులను చేస్తే...'' కరుణాకర్ గొప్ప మనస్సుకీ— ఔన్నత్యానికి మురిసి పోయింది భారతీదేవి. ఎంతటి ఉన్నతుడు తన కొడుకు!

''త్రిపురకు తాళి కట్టిన సంగతి మర్చి పోతున్నావు. చట్టరీత్యా ఆమె నీకు భార్య. లోకానికేం సమాధానం చెప్తావు?'' ఆలోచన ల్లోంచి తేరుకుని అడిగింది భారతీదేవి.

''మనసు లేకపోయినాక, కట్టిన మూడు ముళ్ల పసుపు తాడుకి అర్థంలేదమ్మా. ఇరువురి మనసులు ఏకమై... పాలూ తేనెలా కల్సిపోవడానికి మాంగల్యం లేకపోయినా ఫర్వాలేదు. ఒక పనిచేసి... పదుగుర్ని కలత పెట్టే కంటే... పదుగురి సంతోషం కోసం లోకాన్ని ఎదిరించినా బాధలేదు, తప్పు అంతకంటే కాదు త్రిపురను ఈ యింటి ఆడపడుచుగా తలంచి నీ చేతులమీదుగా శివ — త్రిపురలను ఒకటిగా చేస్తే ముకుళించిన వాళ్ల జీవితాలు మళ్లీ వికశిస్తాయి. నేనన్న మాటను అర్థం చేసుకొని, కాదనవనే విశ్వాసంతో నానమస్యను నీ ముందుంచాను, పరిష్కార నిర్ణయం నీ మీదే ఆధారపడి వుంది'' అని తల్లికేసి చూసి తల దించుకున్నాడు— కరుణాకర్.

''కరుణా! పసితనంలోనే నీ మనసెరిగి నీకా పేరు పెట్టానో... పెట్టిన నీ పేరే నీలో ఆ కరుణత్వాన్ని ప్రబలింప చేసిందో... నాకు అంతు చిక్కకుండా వుంది.'' భారతీదేవి కొడుకు మానవతావాదానికి—మహోన్నత త్యాగానికి జోహార్లు అర్పించకుండా ఉండలేక పోయింది.

''తాను బాధ పడినా ఎదుటివారిఆనందం కోసం పాటుపడినప్పుడే భగవంతుడు కరుణిస్తాడు. నువ్వు చేస్తున్న ప్రతి పనికీ, నీ తల్లి దీవెన శ్రీరామ రక్షగా ఉంటుంది'' అని ఆశీర్వదించింది— భారతిదేవి.

కరుణాకర్ కళ్లలో కోటి సూర్యులు ఒక్కసారి ఉదయించిన కాంతి గోచరించింది.

''ఉండమ్మా! త్రిపుర కీ వార్త చెప్పి వస్తాను'' అంటూ అక్కడ్నుంచి గబ గబా మేడమీదికి పరుగెత్తాడు డాక్టర్ కరుణాకర్.

* * *

అదే సమయంలో—

రెండు ముసుగు ఆకారాలు 'బాల' గది లోకి ప్రవేసించి, ఆమెకు మత్తు మందిచ్చి— తమ కూడా తీసుపోయాయి.

హుషారుగా పైకి వచ్చిన కరుణాకర్‌కి ఆ గదిలో బాల కన్పించలేదు.

అనుమానం కూడా కలగలేదు.

ఒకవేళ శివ దగ్గరకు వెళ్లిందేమో! అదే జరిగి వుండాలి!

కరుణాకర్ ఆస్పత్రికి బయల్దేరాడు.

* * *

ఆస్పత్రిలో —

శివ ఆలోచనల్లో మునిగి వున్నాడు.

దేవుడు లాంటి డాక్టరు తన బాలకు భర్త అయ్యాడు.

తనకు ప్రాణదానం, నేత్రదానం చేశాడు.

తన ప్రాణానికి ప్రాణమైన బాలను దుర్మార్గుల బారి నుండి రక్షించాడు.

ఇప్పుడు —

తన మీది ప్రేమతో బాల డాక్టరుతో కాపురం చెయ్యడం లేదు.

లేదు ...

అలా జరగడానికి వీల్లేదు.

బాల సుఖపడాలి.

డాక్టరుగారు ఆనందంగా వుండాలి.

అంటే తన కర్తవ్యమేమిటి ?

వాళ్లకు దూరంగా తన ఆచూకే తెలియనంత దూరంగా వెళ్లిపోవాలి.

అవసరమైతే ప్రాణత్యాగం చెయ్యాలి.

అప్పటికి గాని బాల మనసు తనను మర్చిపోదు.

అంతే!

ఒక్కాపున పైకి లేచాడు శివ.

''శివా! ఎక్కడికి వెళ్తున్నావ్ ?'' సుధ గదిలోనికి వస్తూ అడిగింది

శివకు నిజం చెప్పక తప్పింది కాదు.

శివ — బాలల అన్యోన్యతకు — ప్రేమానురాగాలకు మురిసి పోయింది సుధ.

''నువ్వెళ్లడానికి వీల్లేదు!'' ఆంక్ష పెట్టింది సుధ

కాని, శివ వినలేదు.

తన దృఢ నిశ్చయాన్ని వదులుకోలేదు.

చీకట్లో తడుముకుంటూ ఎక్కడికో ఏందుకో పయన మయ్యాడు. బంగారు జడకుచ్చులున్న పెట్టెను మాత్రం విడిచి పెట్టలేదు శివ.

* * *

శివ వెళ్లిపోతున్న విషయం చెప్పడానికి సుధ బయల్దేర బోతూండగా కరుణాకర్ వచ్చాడు.

అక్కడ బాల లేదు!

ప్రేమ దేవత

ఇక్కడ శివ లేడు !!

శివ వెళ్లిన ఉదంతాన్ని సుధ చెప్పింది.

బాల ఇంట్లోలేని విషయం కరుణాకర్ చెప్పాడు.

ఇద్దరూ బాల, శివల అన్వేషణకు బయల్దేరారు.

* * *

జగ్గూ ముఠా బాలను ఎత్తుకొచ్చి బలరామ్ ముందు వుంచింది.

బాలను చూడ్డంతోనే బలరామ్ వికటాట్ట హాసం చేశాడు.

బాల బ్రతిమలాడింది. పెనుగులాడింది. ఎదిరించింది.

లేడి కంటికి నీరు వస్తే మాత్రం వేట గాడికి బాధ ఏం తెలుస్తుంది?

బలరామ్ వినలేదు.

"ఆ నాడు డాక్టరు చేత తాళి కట్టించు కొని తప్పించుకున్నావ్ ! ఈ వేళ ఎలా తప్పించుకుంటావో చూస్తాను..." అంటూ అమాంతంగా బాలను పొదివి పట్టుకున్నాడు బలరామ్.

* * *

కరుణాకర్ సుధలు–శివ బాలల కోసం వెదికి వెదికి చివరకు పోలీస్ రిపోర్టిచ్చారు.

గాలింపు మొదలైంది.

* * *

చీకట్లో తడుముకుంటూ, తారాడుతూ శూన్యంలోకి దూసుకు పోతున్నాడు శివ. గమ్యం తెలీని మార్గం గుండా అతని కాళ్లు నడిచి పోతున్నాయ్. ఎక్కడ్నుంచో ఎవరిదో లీలగా ఆర్తనాదం విన్పించింది.

రక్కున ఆగిపోయాడు.

అది బాల స్వరం.

గిర్రున వెనుదిరిగాడు.

బాల గింజుకోవడం, గోల పెట్టడం శివకి మరింత చేరువయ్యాయ్.

సందేహం లేదు !

బాల !!

ఇక్కడి కెందుకొచ్చింది ! ఎలా వచ్చింది?

వెంటనే ఆ చీకట్లో వెదికి, "తాడు ఉట్టి" కట్టే దుండగులకు గురి పెట్టాడు శివ.

బాల బంధ విముక్తురాలైంది.

బలరామ్ అతని ముఠా శివ మీదకు లంఘించుకున్నారు.

మానవ ప్రవృత్తి

చంద్రుడు
స్వయం ప్రకాశకుడు కాకపోయినా
చల్లని వాడనీ
వెన్నెల నిచ్చువాడనీ
పరి పరి విధాల
చంద్రుడ్ని పొగుడుతాడు మానవుడు.
సంపెంగ
మకరందం లేనిదయినా
సురభిళాన్ని వెదజల్లుతుందనీ
మత్తెక్కిస్తుందనీ
మై మరచిపోయి
విన్నోరీతుల
సంపెంగకు జోహార్లు చేస్తాడు మానవుడు.
పొరుగువాడు
మంచివాడయినా
పచ్చగా ఉన్నాడనీ
వాడికి
నాలుగు వేళ్ళూ లోనికి పోతున్నాయనీ
ఈర్ష్యతో
అసూయతో
కుచించుకుపోయిన మనసుతో
పొరుగువాడి పతనాన్ని
కోరుకుంటాడు మానవుడు.

– భగ్వాన్

ఆ ముష్టి యుద్ధంలో శివ కళ్లకున్న బ్యాండేజీ వూడిపోయింది.

చీకటిని చీల్చుకుంటూ చూపు దూసుకు వచ్చింది.

అంతే !

బలరామ్‌ని అతని ముఠాను చీల్చి చెండాడాడు శివ.

అదే సమయంలో డాక్టర్ కరుణాకర్ సుధలు వచ్చారు. శివ, కరుణాకర్‌లు ఏకమై బలరామ్ ముఠాని బంధించారు. అంతలో పోలీస్ జీప్ వచ్చింది. బలరామ్, అతని ముఠాను అరెస్టు చేశారు.

* * *

శివకు చూపు రావడంతో బాల అమితానందం పొందింది. కరుణాకర్, సుధలు తమ కృషి ఫలించి, దృష్టి వచ్చినందుకు సంతోష పడ్డారు.

"డాక్టరుగారూ ! మీ ఋణం ఈ జన్మ తీర్చుకోలేను. ఇక నాకు సెల విప్పిస్తే వెళ్లొస్తాను" అని అక్కడ్నుండి కదలబోయాడు శివ. తను ఎంత తొందరగా అక్కడ్నుంచి వెళ్తే అంత మంచిదన్న ఉద్దేశంతో.

"అదేం లాభంలేదు" అని గబ గబా శివ దగ్గరకు వచ్చాడు కరుణాకర్.

"చూడు శివా ! నాకు నువ్వో మాట ివ్వాలి" కరుణాకర్ శివని అడిగాడు.

"ఇవ్వాలని అడగడంకాదు డాక్టరుగారూ ! ఆజ్ఞాపించండి. ఆ ఆజ్ఞకు కట్టుబడి నా ప్రాణమన్నా యిస్తాను" అన్నాడు శివ దృఢంగా.

"ఏ బాల కోసమైతే యిన్ని కష్టాలు పడి ఆ బంగారు జడకుచ్చులు సంపాదించావో ...అవి బాలకు యివ్వాలని లేదా...?' సూటిగా అడిగాడు కరుణాకర్.

జవాబు చెప్పలేదు శివ.

"ఎవరికోసమైతే వాటిని యింతకాలం ప్రాణపదంగా దాచుకుంటూ వచ్చావో ఆ వ్యక్తి నీ కళ్లెదుట ఉంది. ఆమె ఆశలు తీర్చవా !" రెట్టించి అడిగాడు కరుణాకర్.

"ఎన్ని జన్మల పుణ్యమో... బాలకు తమ లాంటి దేవతా మూర్తి భర్తగా లభించారు. తమరు తలంచు కోవాలేగాని ... పేదవాడి జడకుచ్చులేంటి ! ... ఏ కోరికైనా తీర్చ గలరు."

"నేను తీర్చగలిగేది ...ఒక అన్నగా తీర్చ గలనే కాని ... అనురాగమూర్తిగా కాదు. సంఘం దృష్టిలో భర్తను నే నుండగా బాల నువ్విచ్చిన ప్రేమ కానుకగా వాటిని స్వీకరించ లేదు. గనుక మనస్ఫూర్తిగా బాలను నీ కప్ప గిస్తున్నాను. మీ యిద్దరికీ పెళ్లి జరిపిస్తాము. అమ్మ కూడా అంగీకరించింది. కాదనకు" అన్నాడు కరుణాకర్.

నిరుత్తరుడయ్యాడు శివ.

* * *

"త్రిపురా ! నా కొడుకు మానవోత్తముడు. నేను కూడా, శివతో నీ పెళ్లికి మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను, కాదనకు" భారతీదేవి బాలకు శతవిధాలా చెప్పి ఒప్పించింది.

* * *

"మా ప్రేమను అర్థం చేసుకొని, ప్రేమించిన వారు విడిపోయి బాధ పడ కూడదని మహోన్నతమైన త్యాగం చేశారు మీరు. మిమ్మల్ని సుధ ఎంతగానో ప్రేమించి ఆరాధించింది. ఆమె బాధను కూడా అర్థం చేసుకోవాలి, నిండుమనసుతో సుధను స్వీకరించాలి!" శివ షరతు పెట్టాడు.

'కరుణాకర్ ఏం సమాధానం చెప్తాడా' అని పక్కనే వున్న సుధ వెయ్యి కళ్లతో ఎదురుచూస్తోంది.

కరుణాకర్ సుధ దగ్గరకు వచ్చాడు.

"మీ పెళ్లితోనే సుధ మెడలో తాళి కడ్తాను." శివ చేతిని తన చేతిలోకి తీసుకుని వాగ్దానం చేశాడు డాక్టర్.

సుధ మనసు దూదిపింజలా తేలిపోయింది.

* * *

'దివిసీమ' దివ్య సీమగా రూపుదాల్చింది.

శివ పార్వతుల ఆలయం దగ్గర పెళ్లి వాయిద్యాలు తారస్థాయి నందుకున్నాయి.

బాల పచ్చ పావడా కట్టుకొని, పూలజడ వేసుకొని, బంగారు జడకుచ్చులు పెట్టుకొని కొత్త పెళ్లికూతురిలా శివ దగ్గరకు వచ్చింది.

శివ కళ్లు కాంతిపుంజాలయ్యాయ్.

బాలను ఆపాదమస్తకం చూశాడు.

తన బాల...!

తన వరాల గారాల బాల...!

బంగారు జడకుచ్చులతో... బంగారు బొమ్మలా తన ముందు సాక్షాత్కరించింది.

బంగారు జడకుచ్చులు కావాలనే బాల కోరిక, బాలకు బంగారు జడకుచ్చులు కొని ప్రేమ కానుకగా యివ్వాలన్న తన కోరిక నెరవేరాయి. పూజారిగారి ఆశీర్వాదబలం, సాధుతాత దీవెనల ఫలితంగా తామిద్దరూ కొన్ని క్షణాల్లో దంపతులు కాబోతున్నారు. ఎటు చూసినా ఏడు రంగుల హరివిల్లు, హరివింటి ప్రతి రంగులోనూ తన బాల...!

ఎటు చూసినా చిగురించిన వసంతం... ఆ వసంతవనంలో లేచిగుళ్లు తింటూ గొంతెత్తి పాడే కోయిల తన బాల!!

శివ మనసు ఆనందపు ఐరావతం ఎక్కి



స్వర్గలోకాన్ని దాటుతోంది.

శివ బాల దగ్గరకు వచ్చాడు.

ఆమె రెండు చేతులు పట్టుకున్నాడు.

దేవాలయం గోడలమీదున్న ఒకనాడు శివ గీసిన బొమ్మలు ప్రాణం పోసుకుని పలకరిస్తున్నాయ్.

బాల ముఖంలో ఏ భావమూ కన్పించ లేదు. ఆమెకు ఏ మాటా విన్పించలేదు. దేవాలయం గోడలమీద శివ గీసిన బొమ్మలే కన్పిస్తున్నాయ్. చిన్ననాటి ఆ పాట లీలగా విన్పిస్తోంది. ఒక్కొక్క అడుగూ ముందుకు వేస్తూ ఒక్కొక్క బొమ్మనూ దాటుతోంది.

మాటల కందని మధుర భావనలో తేలిపోతూ శివ బాల అడుగులో అడుగు వేస్తూ దేవాలయంచుట్టూ తిరుగుతున్నాడు.

పెళ్లి వాయిద్యాలు మంగళకరంగా మార్మోగుతున్నాయ్. పెళ్లి మంత్రాలు వేద ఘోషలో ప్రతిధ్వనిస్తున్నాయ్.

పూల దండలతో సుధ కరుణాకర్‌లు వచ్చారు. పరంధామయ్య, భారతీదేవి అప్పటికే వచ్చి ఉన్నారు.

రెండు జంటల పెళ్లిళ్లు ఒకేసారి జరగడం ఎంతో ముచ్చటగా ఉంది.

శివ పెళ్లిపీట దగ్గరకు వచ్చాడు.

సుధ, కరుణాకర్‌లు నిలబడి వున్నారు.

బాల తన ఆరాధ్య దైవాలైన శివ పార్వతులకు దీపం వెలిగించి మనసారా నమస్కరించింది. భారతీదేవి పాదా లంటుకుంది. దేవుని లాంటి కరుణాకర్‌ని ఆశీర్వదించ మని అర్థించింది కనుల పండువుగా పెళ్లి ముచ్చట్లను చూడాలని వచ్చిన జన సందోహం వేపు ఒక్కసారి తేరిపార చూసింది.

తన ఊరు...!

తన బావ...!!

శివ పార్వతుల సన్నిధిలో పెళ్లి...!!!

తన జడలో బంగారు జడకుచ్చులు !!!!

అన్ని ఆశలూ —

అన్ని కోరికలూ —

ఆనందంగా తీరే సమయం—

— బాల సరాసరి పెళ్లి పీటల మీద నిలబడి వున్న శివ దగ్గరకు వచ్చింది.

అతని కళ్లల్లోనికి చూసింది.

ఇద్దరి కళ్ళూ కల్సుకున్నాయ్.

భాష కందని భావలు !

భావన కందని ఊసులు !!

ఆ ప్రేమైక జీవులు పర్యావస్నీ మరిచి పోయారు.

బాల శివ పాదాల మీదకు వాలింది. రెండు చేతులతో పాదాలను స్పృశించింది.

మంగళ వాయిద్యాలు మార్మోగాయ్ ...

"తాళి కట్టండి !" అంటూ బ్రాహ్మణులు హెచ్చరించారు.

సుధ మెడలో కరుణాకర్ తాళి కట్టాడు.

పాదాల నంటిన బాల మెడలో శివ తాళి కట్టడానికి ముందుకి వంగాడు.

అంతే !

ప్రకృతి స్తంభించి పోయింది.

పశు పక్ష్యాదులు చలనం కోల్పోయాయి:

సప్తసముద్రాలూ కల్లోలమయ్యాయి.

ఆకాశం ఎర్రబడింది.

మంగళ వాయిద్యాలు మూగవోయాయి.

శివ పార్వతుల ముందు బాల వెలిగించిన జ్యోతి ఆరిపోయింది.

బాల ప్రాణం అనంతాకాశంలో కలిసి పోయింది.

"బాలా !" అంటూ గావుకేక పెట్టాడు శివ.

ఈ హఠాత్పరిణామానికి అదిరిపోయారంతా !

అచేతనంగా పడిపోయింది బాల.

ఆమె చేతిలో ఉత్తరం ఉంది.

రుద్ధ కంఠంతో కరుణాకర్ చదివాడు:

"బావా ! తాళి భారత స్త్రీకి పవిత్రమైంది. అది కట్టిన వాడే భర్త. త్యాగధనుడైన డాక్టరుగారు— మన ప్రేమ ఫలింప జేయడానికి యీ పెళ్లి నిర్ణయించినా — ఏ స్త్రీ కూడా వారు మనువుకు ఒప్పుకోదు; ఒప్పుకోకూడదు. అదే హైందవ స్త్రీకి సాంప్రదాయం. అందుకే— నే నొక నిర్ణయానికి వచ్చాను. పుట్టేదు పసుపూ, పట్టేదు బొట్టూ కోసం స్త్రీ ఎన్నెన్నో పూజలూ, వ్రతాలు చేస్తుంది. ఆ పసుపు కుంకుమలోనే నేను 'పునీతగా' వెళ్లిపోతున్నాను. నేను నీ ఎదుట ఉన్నంత వరకూ నన్ను నీ ఊహలలో చూసావు. ఇప్పుడూ నీకా ఊహల్నే మిగిల్చి వెళ్తున్నాను. నీ పాదాల దగ్గర — మన ఆరాధ్య దేవతల సన్నిధిలో స్వచ్ఛంద మరణం పొందుతున్నాను. నా వియోగంతో బాధపడకు...బావా ! నీ ప్రాణంలో ప్రాణమై — నీ గళంలో గానమై, నీ చేతిలో గీతనై నేను నీ వెంటనే— నీ చెంతనే — నీ నీడలా వుంటాను. ఎన్నటికీ నిన్ను విడిచిపోని ... నీ ...బా...ల... !"

* * *

బాల శవం దహనమై—పంచ భూతాల్లో కలిసిపోయింది. పిడికెడు బూడిదగా మిగిలి పోయింది.

కాలిన బూడిదను శివ తన దోసిళ్లలోనికి తీసికున్నాడు.

చేతి వేళ్ల సందుల్లోంచి బూడిద జారి పోయింది. ధగ ధగ మెరిసే "బంగారు కుప్పె"లు ఒక్కసారి తళుక్కుమన్నాయ్. చెక్కుచెదరకుండా మిగిలి వున్నాయ్.

కట్టలు తెగిన కన్నీటితో శివ విస్తుపోతూ జంగా—విరోమయంగా ఆ జడకుచ్చుల వేపు చూస్తుంటే—అందులోంచి బాల పూబాలంగా దివ్యమంగళ రూపంతో, నాట్యమయూరిలా నర్తిస్తూ తనుండే సుందర నందన వనంలోకి ఆడుతూ పాడుతూ ఆహ్వానిస్తుంటే — శివ తన ప్రేమదేవత—బాల మధుర స్మృతులలోకి జారుకొని—ఆమె పాటకు ప్రాణ మయ్యాడు. దూరం నుండి వస్తున్న సుధ—కరుణాకర్‌లు శివని చూస్తూ నిలబడి పోయారు.

— వాళ్ల చేతుల్లో ఉన్న 'అఖండ జ్యోతి' బాల స్మృతికి చిహ్నంగా అక్కడే నిల్చిపోయింది.

(అయిపోయింది)



ఘాటాక్షుని డైరీ

పతిమంచ్ !

కాన్పూరులో వో చిత్రాతి చిత్రమైన సంఘం ఏర్పడిందట. దీని పేరు "పతి మంచ్" అట. ఇందులో అమాయకులైన, భార్యాపీడితులైన భర్తలు జేరుతారట. భార్యల చేత బాధలు పడే భర్తలు, భార్యల తలిదండ్రుల చేతా, తోబుట్టువుల చేతా బాధలు పడే భర్తలూ సభ్యులట. ఈ సంఘాన్ని త్వరలో రిజిస్టరు కూడా చేయబోతూన్నట్టు యీ సంఘ నిర్మాతలు వో రిటైర్డు జడ్జిగారు, డాక్టరుగారూ అన్నారట. ఆహా . . . వో పతిమంచీ . . . పదిమందికి నీవు పర్మిల్లు . . .

అప్పటి ధర ఎంత ? !


గత యిరవైయ్యేళ్ళుగా రష్యాలో బియ్యం, గోధుమలు, నూనెలు, పంచదార వంటి వాటి ధర ఎదగనే లేదట. 1962 నాడున్న ధరలే యీనాటికీ వున్నాయని రష్యా సగర్వంగా వో ప్రకటన చేసిందట—దీని అర్థం విడదీసిచూస్తే ఇరవై య్యేళ్ళ క్రితం రష్యాలో బియ్యం, పప్పులు, నూనెలు పంచదారల ధర చాల ఎక్కువగా వుండేవని తేలదూ . . . . . .యస్సర్!

కరుణానిధికి వెండి తులాభారం !

ద్రవిడ మున్నేట్ర కజగం (డి. యం. కె.) పార్టీ ప్రెసిడెంటు కరుణానిధి 59 వ జన్మ దినోత్సవ సందర్భంగానూ, 25 ఏళ్ళుగా రాజకీయ రంగంలోనూ రాష్ట్ర ఎసెంబ్లీలోనూ వున్న సందర్భంగానూ మద్రాసులో ఆయన అభిమానులు ఆయన్ని త్రాసులో కూర్చోపెట్టి 65 కిలోల వెండితో తూచి, యిది మీది అన్నారట. దానికాయన త్రాసులోంచి దిగి, వెండి కడ్డీలు పెట్టిన పళ్ళెంలో ఎక్కి కూర్చుని, "యిప్పుడో" అన్నారట. పెరేగిన ఉత్సాహంలో ఆ అభిమానులు యివతల పళ్ళెంలో నూట ముప్పయి కిలోల వెండి కడ్డీలు పెట్టి, అంతలో ఆగక కొంచెం కొసరు కూడా వేసి, మొత్తం రెండొందల ఐదు కిలోల వెండి సమర్పించుకున్నారట—చదువరీ, కిలో వెండి సుమారు రెండు వేల ఆయిదొందలు దాటి వుండి వుంటుంది—అనగా. . . . . . ?

పశుత్వానికి ఇద్దరు అమ్మాయిలు బలి !

కడలూరుకు చెందిన సేమందాళంచావడి అనే వూరిలో కొంతమంది యువకులు చేరి 18 ఏళ్ళ సరస్వతి అనే ఆమెను, 15ఏళ్ళ మంజు అనే ఆమెనూ పట్టుకుని తమ కామదాహం తీర్చుకుని, వాళ్ళు చనిపోయినందువల్ల మోసుకుపోయి రైలుపట్టాల మీద పడేసి చక్కాపోయారుట. ఈ పని చేసిన వారి కోసం పోలీసు వెతుకుతోంది—బలాత్కారానికి కఠిన శిక్ష ప్రభుత్వం ఆలోచించితే తప్ప బలాత్కారాలాగవుస్మీ !



పోలీసులని అరెస్టు చేసిన పోలీసు !

జూన్ 23 వ తేది బెంగళూరులో ఆ వూరు వాస్తవ్యుడు పాల్ టయిలర్ అనే అతను సెకండు షో సినిమానుంచి యింటికి సైకిలుమీద వెళ్తుండగా, దారిలో రాత్రి గస్తీ పోలీసులోయిద్దరు రాతన్ని ఆపి, రివాజు కుశల ప్రశ్నలు వేశాక, "త్వరగా నీ చేతి వాచి, ఉంగరం, జేబులో డబ్బులు మా కిచ్చెయ్ లేపోతే చితక బాదుతాం. . . .జర్కీ కోట్ బిడి" అని కన్నడంలో హెచ్చరించారట. ఈ జబర్దస్తీ దబాయింపుకు భయపడిన ఆ పాల్ టెయిలర్ మొర్రోమొర్రోమని కేకలు వేసే సరికిఇంకో బీటు పోలీసు పరుగున వచ్చి విషయం గ్రహించి ఆ యిద్దరుపోలీసులనూ అరెస్టు చేశాడుట.

18ఏళ్ళ బాలికపై 20మంది అత్యాచారం !

హావురాకు చెందిన వో18ఏళ్ళ అమ్మాయి పని మీద అలీఘర్‌కు వెళ్ళి స్టేషనులో రైలు దిగే సరికి అలీఘర్ ముస్లిమ్ విశ్వ విద్యాలయం విద్యార్థుల్లో కొంతమంది ఆమెను చుట్టుముట్టి, మా సాంప్రదాయం ప్రకారం మీరు మా హాస్టలు కొచ్చి మా ఆతిధ్యం స్వీకరించి మరీ మమ్మానందింప చేయాలి అని ఆమెను ఏమార్చి హాస్టలుకు తీసుకువచ్చి వో రూములో పెట్టి సుమారు ఇరవై మంది తమ కామ దాహాన్ని తీర్చుకున్నారట—ఇంతకూ ఆమె స్థితి ఎలా వున్నదో మాత్రం యీ విషయం వ్రాసిన పత్రిక వ్రాయలేదు!

తపాలా సంచిలో తాచుపాములు !

జూన్ 19 వ తేదీ ఖలీలాబాదు పోస్టాఫీసులో వో పోస్టు బాగు కదులుతోందట. సామాన్యంగా పోస్టు బ్యాగులు పడేసినచోటే కదలక, మెదలక వుండడం ఆచారం అలవాటూ అయిన పోస్టల్ పరివారా బ్యాగుకు ఏ దేవుడు ప్రాణాలు పోశాడో తెలీక, అరచేతిలో తమ ప్రాణాలు పెట్టుకుని సంచి విప్పేసరికి బుస్సుర మూడు తాచు పాము లందులోంచి ఎగిరి గంతేశాయట. దాదాపు అదే పని చేసిన ఆ పనివారు శక్తి వంచన లేకుండా వాటిని చుట్టుముట్టి, తుదముట్టించారట. ఇంతకూ ఆ పాములు ఎందుకు ఎవరికోసం వచ్చాయో అర్థం కాలేదట—ఫస్టే. " . .మళ్ళీ ప్రయత్నిస్తా రవి పంపినవారే!

అనర్థానికి దారితీసిన ఆవేశం !

జేడర పాళయంలో 55 ఏళ్ళ రంగసామి గవుండరు తన యిద్దరు కొడుకులు శ్రీరంగనుకు, వరదప్పనుకు చెరో30 సెంట్ల భూమి యిచ్చి సంవత్సరానికి వారిద్దరూ చెరో ఆరు బస్తాల ఒడ్లు తన కిచ్చేలా పత్రం రాయించుకున్నాడట. 30 ఏళ్ళ శ్రీరంగన్ పంట దెబ్బ తినడంవల్ల లతని యీమ తండ్రికి ఆరు బస్తాల ఒడ్లు యివ్వలేదట. దాంతో రంగసామి గవుండరుకు కోపం వచ్చి శ్రీరంగన్ను తిట్టి, చర్నాకోల్ తో కొట్టాడట. చెట్టంత ఎదిగిన కొడుకునిట్లా చితకబాత్తాడా అన్న కోపంలో శ్రీరంగన్ తన తండ్రిని కత్తితో పొడిచి, ఆవేశం చల్లారాక తప్పు గ్రహించి పోలీసులకు లొంగిపోయాడట.



మార్పు

వసుంధర

నాది ఒకరితో కలిసే స్వభావం కాదు. అలాగని నాకు మనుషుల పొడ గిట్టక పోదు. నాకు నేనై కల్పించుకుని ఎవరితోటీ మాట్లాడను. ఎరుగున్న వాళ్ళు ఎదురైనా వాళ్ళు నన్ను చూడకపోతే నేను కూడా చూడకుండా పోవడానికే ప్రయత్నిస్తాను. నలుగురు కలిసి మాట్లాడుకుంటూంటే చూస్తూ ఆనందించగలను కానీ నేనూ వారిలో ఒకణ్ణిగా కలిసిపోలేను. ఈ కారణాలవల్ల మనుషుల మధ్య మసలుతూనే నేను మనుషులకు దూరంగా ఉంటున్నాను.

నాకు వివాహమైనా నా స్వభావంలో మార్పు రాలేదు. నా భార్య కూడా నా లాంటిదే. మే మిద్దరం కూర్చుంటే చాలా కబుర్లు పుట్టుకొస్తాయి. మా యిద్దరికీ ఒకరిపట్ల ఒకరికి మంచి ఆకర్షణ ఉంది. అవగాహన ఉంది. అయితే మూడో మనిషి వస్తే మా యిద్దరికి యిబ్బందే! అట్టే మాటలు నడవ్వు.

మా యిద్దరిదీ యించుమించి ఒకే స్వభావం కావడం వల్ల మే మిద్దరం బాగా కలిసి తిరుగుతూండే వాళ్ళం. సినిమాలు, పార్కులు, పిక్‌నిక్‌లు వగైరా ఎన్నో కార్యక్రమాలు మా ఇద్దరికి మాత్రమే పరిమితమై ఉండేవి. సరిగ్గా చెప్పాలంటే మే మిద్దరం ఒకే మనిషిలా జీవిస్తున్నాం.

ఇంతగా తిరిగే మేము స్నేహితులను సందర్శించకపోవడం, స్నేహపూర్వక ఆహ్వానాలు అందించక పోవడం చాలామందికి నచ్చేది కాదు. మా ఆఫీసులో ఉద్యోగులు నన్ను గురించీ, మా వీధిలోని మహిళలు శ్రీమతి గురించీ చాటుమాటున చెవులు కొరుక్కునేవారు. వాళ్ళ పరోక్షపు విసుర్లను బట్టీ, సమాజ న్యాయాన్ని బట్టీ ఈ విషయాన్ని మేము గుర్తించగలిగినప్పటికీ మా బలహీనతని సరిదిద్దుకోలేక పోయాము.

ఒక పర్యాయం మా పక్కింటి వీరభద్రం గారికి జ్వరం వచ్చింది. ఇంట్లో ఆయన, భార్య— ఇద్దరు చిన్న పిల్లలు మాత్రం ఉన్నారు. ఆయనకు జ్వరం వచ్చిన సంగతి నాకు చాలా ఆలస్యంగా తెలిసింది. ఎందుకంటే వీధిలో కబుర్లలో శ్రీమతి పాల్గొనదు.

మార్పు

సాధారణంగా జ్వరం వస్తే చుట్టుపక్కల వాళ్లను పరామర్శించడం చాలామందికి రివాజు. నాకు అలాంటి అలవాటు లేదు. అలా వెళ్లడానికి మొహమాటంగా కూడా ఉంటుంది. అందుకే ఆయనకు జ్వరం వచ్చిందని తెలిసినా ఊరుకున్నాను.

అయిదార్రోజుల తర్వాత ఓ సాయంత్రం వాళ్ల పెద్దబ్బాయి ఆరేళ్లవాడు మా ఇంటికి వచ్చి—ఓసారి వాళ్ళింటికి రమ్మనమనికోరాడు. ఆ కుర్రాడు నాకు రోజూ సాయంత్రం తటస్థపడుతూంటాడు. ఎవరూ గమనించని పక్షంలో నేను చిన్న పిల్లలతో సరదాగా ఆడుకుంటూంటాను. అలా వాణ్ని రెండుమూడు సార్లు మా యింటికి పిలిచాను నేను. చిన్న పిల్లలతో అయితే నాకెంతో ఫ్రీగా ఉంటుంది.

నేను వాళ్లింటికి వెళ్లేసరికి పరిస్థితి ఘోరంగా ఉంది. ఆయన ఇంకా నీరసంగానే కనిపిస్తున్నాడు. ఆయన శ్రీమతి వళ్లు తెలియని జ్వరంతో పడి ఉంది. అత్తగారికి టెలిగ్రాం ఇప్పించడం కోసం ఎవర్నయినా పిలవమని ఆయన కొడుక్కు చెప్పాడుట. వాడు నన్ను పిల్చుకువచ్చాడు. నన్ను చూడ్డంతోనే ఆయన ముఖం మరింత చిన్నదైపోయింది. నావల్ల ఆ మాత్రం సాయం జరుగుతుందని ఆయనకు అనిపించినట్లు లేదు.

నేను అసలు విషయం తెలుసుకున్నాక పరిస్థితి అర్థం చేసుకున్నాను. ఈ పరిస్థితుల్లో వీళ్లు ఒంటరిగా ఉండడానికి వీల్లేదు. వెంటనే శ్రీమతిని పిల్చుకువచ్చాను. శ్రీమతి వాళ్ల పరిస్థితి చూసి కంగారు పడింది. తను వాళ్లకు సాయం ఉంటాననీ నన్ను వెళ్లి డాక్టర్ని పిలుచుకు రమ్మననీ చెప్పింది.

"ముందు పోస్టాఫీసుకి వెళ్లి టెలిగ్రాం ఇవ్వండి" అంటూ వీరభద్రం నీరసంగా మూలిగాడు.

నేనాయన మాటలు వినిపించుకోలేదు. తిన్నగా వెళ్లి నాకు తెలిసిన డాక్టర్ని పిల్చుకు వచ్చాను. డాక్టరువచ్చి రోగులిద్దర్నీ గమనించి వైద్యం గురించి సూచించి వెళ్లిపోయాడు.

ఆ తర్వాత నుంచీ ఒక వారం రోజులు ఆ కుటుంబాన్ని మా కష్టడీలో ఉంచాము. పిల్లలు శ్రీమతి దగ్గరే పడుకునేవారు. వంటంతా ఆమే చూసుకునేది. మందులు, పళ్లు వగైరాలు నేను చూసుకునేవాణ్ణి. ఒక వారం రోజుల్లో ఆ దంపతులిద్దరూ కోలుకున్నారు.

"మీరు మా అత్తగారికి టెలిగ్రాం ఇచ్చి ఉంటే మీకు ఇంత శ్రమ ఉండేది కాదు" అన్నాడు వీరభద్రం మా సేవలకు నొచ్చుకుంటూ.

"ఇందులో శ్రమేముందండీ! మీకీమాత్రం సాయపడగలిగినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. మీ అత్తగారికి టెలిగ్రాం ఇవ్వడం నాకిష్టంలేదు. బోలెడు డబ్బు ఖర్చుపెట్టుకుని ఆవిడ ఇక్కడికి వచ్చేసరికి మీ అవసరం గడిచిపోతుంది. మధ్యతరగతి సంసారాల్లో ఇలా ఇరుగు పొరుగే ఒకర్నొకరు ఆదుకోవాలి" అన్నాను.

ఆయన చాలా సంతోషించాడు. మందులు, పళ్లు వగైరాలకు అయిన ఖర్చు తిరిగి ఇచ్చేశాడు. నేను అభ్యంతర పెట్టలేదు. మధ్యతరగతి కుటుంబాల్లో డబ్బు విషయంలో మొహమాటాలుండకూడదు. అందువల్ల ఇరుపక్షాలకు ఇబ్బందేనని నా అభిప్రాయం.

ఈ సంఘటనతో మా వీధిలో నాకు మంచి పేరు వచ్చింది, ఇందుకు మేముచేసిన సేవకంటే వీరభద్రం చేసిన ప్రచారం ముఖ్య కారణం. ఇప్పుడు మాకు వీరభద్రంతో మంచి దోస్తీ ఏర్పడింది. అతను కుటుంబంతోసహా తరుచుగా మా ఇంటికి వచ్చి వెడుతూండేవాడు. వచ్చినప్పుడల్లా మేము బాగా మర్యాదలుచేసి పంపుతూండేవాళ్లం.

ఈ సంఘటనతో మాకు పేరుతెచ్చిపెట్టి ఉండవచ్చునుకానీ మా ప్రవర్తనలో మార్పును మాత్రం తీసుకురాలేక పోయింది. వీరభద్రం వచ్చి వెడుతున్నందుకు ఆనందంగానే ఉండేది కానీ మేము అతనింటికి వెళ్లేవాళ్లం కాదు. ఆయన మరీ అంతగా నొక్కిస్తే "పక్కా పక్కా వాళ్లం ఎవరు ఎవరింటికి వెడితేనేం?" అనేవాళ్లం. ఆదేమిటో మే మిద్దరం కలిసి బయట అడుగు పెడితే స్నేహితుల ఇళ్లకు వెళ్ళబుద్ధి వేసేదికాదు. ఏ సినిమాకో పోవాలనిపించేది.

అయితే ఈ విషయంలో వీరభద్రం మనసు బాధ పడకుండా ఉండడం కోసమని నేనూ, శ్రీమతీ కలిసి ఒక నిర్ణయం తీసుకున్నాము. వీరభద్రం పిల్లల పుట్టిన తేదీలు తెలుసుకుని ఆ తేదీల్లో మా అంతట మేమే పనిగట్టుకు వాళ్లింటికి వెళ్లి ఓ మంచి బహుమతి కూడా ఇచ్చేవాళ్లం.

"మిగతా రోజుల్లో మీ ఇంటికిరావాలంటే మమ్మల్ని ప్రత్యేకంగా ఆహ్వానించాలి" అని నేను నవ్వుతూ చెప్పాను. ఆ దంపతులిద్దరూ కూడా మా మనస్తత్వాన్ని సానుభూతితో అర్థం చేసుకున్నారు.

వీరభద్రం మా యింటికి కనీసం రెండు వారాలకొక పర్యాయం వచ్చేవాడు. ఒక పర్యాయం మాత్రం రెండు నెలలు గడిచినా రాలేదు. నేను కంగారుపడి విషయం అడిగాను. తనకూ తెలియదంది శ్రీమతి.

మర్నాడు ఇద్దరం కలిసి వాళ్లింటికి వెళ్లాం.

"ఈ రోజు మా పిల్లల్లో ఎవరిదీ పుట్టినరోజు కాదు" అన్నాడు వీరభద్రం.

"తెలుసు. మా ప్రవర్తన అంత సులభంగా మారదు. కానీ మీ ప్రవర్తనలో హఠాత్తుగా మార్పువస్తే కంగారు పడి పరిగెత్తుకు వచ్చాం" అన్నాను.

"మేము కూడా మీకులాగే ఆహ్వానం లేకుండా ఎవరింటికీ వెళ్లకూడదనుకుంటున్నాం" అన్నాడు వీరభద్రం సీరియస్‌గా.

కేన్సరు కురుపుల చికిత్స

కేన్సరులో తీవ్రమైన కేన్సరు మరొకటుంది. దీనిని డ్రగ్ రెసిస్టెంట్ కేన్సరు అని అంటారు. ఈ రకం కేన్సరు కణాలు చురుకుగా పని చేసి మందు ప్రభావాన్ని తగ్గిస్తాయి. ఈ రకం కేన్సరును చికిత్స చేసే విధానాన్ని యిటీవల టోక్యోలో జరిగిన ఒక సింపోజియంలో వెల్లడించారు. కేన్సరు మందులను కాల్షియం యాంటోగనైజర్‌తో లేక కాల్మోడ్యులిన్ ఇన్హిబిటర్‌తో కలిపి సంయుక్తంగా ప్రయోగించి! యీ కణాలను చంప వచ్చునని తెలియ చేశారు. ఈ రకం కేన్సరు కణాలు సాధారణ కేన్సరు కణాల కంటే డజను రెట్లు తీవ్రతరమైనవి. కేల్షియం యాంటగనైజర్లు ఈ కణాల చురుకుదనాన్ని తగ్గిస్తాయి. అందువలన కేన్సరు మందులు పని చేయటానికి అవకాశం ఏర్పడుతుంది.

"అయితే ఆహ్వానించడానికే వచ్చాం. ఇప్పుడే రండి" అన్నాను.

ఆ రాత్రి వాళ్ళు మా యింట్లోనే భోం చేశారు.

ఆ తర్వాత వాళ్ళ రాకపోకలు మళ్ళీ మామూలయ్యాయి. కానీ ఆ తర్వాత వాళ్ళెప్పుడైనా రావడం ఆలస్యమైతే మేము ప్రత్యేకంగా ఆహ్వానించేవాళ్ళం కాదు. అయినా ఇప్పటికి వాళ్ళు మా స్వభావాన్ని బాగా ఆకళింపు చేసుకోగలిగారు కాబట్టి తప్పుపట్టే వారు కాదు. వాళ్ళను సంవత్సరానికి రెండు రోజులు మాత్రం మేము ప్రత్యేకంగా ఆహ్వానించేవాళ్ళం. వాళ్ళ ఇద్దరి పిల్లల పుట్టిన రోజులకూ తప్పక వాళ్ళింటికి వెళ్ళే వాళ్ళం.

వీరభద్రం అందరివద్దా మమ్మల్ని పొగుడుతూండేవాడు. మాకు మంచి పేరు రావడానికి ఎంతవరకూ సహకరించిందో తెలియదు కానీ ఆయనొక్కడే నాకిలాంటి స్నేహితుడిగా ఉన్నాడు.

అప్పట్లో వీరభద్రం గవర్నమెంట్ ఆఫీసులో ఆఫీసర్‌గా ఉండేవారు. నేను ప్రయివేట్ కంపెనీలో గుమాస్తాని. ఆర్థికంగా వాళ్ళే మా కంటే ఉన్నత స్థాయిలో ఉండేవారు. అయినా ఆ తేడా కనిపించకుండా ప్రవర్తించేవాడు వీరభద్రం. మా పరిచయం ఎంత గాఢంగా ఉన్నా నేను మాత్రం ఎటువంటి ఇబ్బంది పరిస్థితుల్లోనూ ఆయన్ని అప్పు అడగలేదు. ఇంకా నేనే ఆయనడిగితే ఒకటి రెండుసార్లు చిన్న మొత్తాలు అప్పుగా ఇచ్చాను.

ఇలా మా పరిచయం రెండు మూడేళ్ళు కొనసాగాక ఆఫీసులో ఏదో గొడవొచ్చి నా ఉద్యోగం ఊడింది. మూడు నెలల జీతం ఇచ్చి నన్ను పొమ్మన్నారు. రెండు రోజుల పాటు నేను, శ్రీమతి దుఃఖసముద్రంలో మునిగిపోయాం. అప్పటికి నాకో కొడుకు. వాడికి రెండేళ్ళు. ప్రస్తుతం శ్రీమతి కడుపుతో ఉంది.

విషయం వీరభద్రానికి ఆలశ్యంగా తెలిసింది. ఆ దంపతులు పరుగెత్తుకుంటూ మా ఇంటికి వచ్చి విషణ్ణంగా మాటలాడారు. ఆపదలో ఆదుకోనివాడు స్నేహితుడెలాగౌతాడు—అని అన్నాడు వీరభద్రం. తన పలుకుబడినుపయోగించి ఆ కంపెనీలో మళ్ళీ ఉద్యోగం వేయిస్తానన్నాడు వీరభద్రం.

వీరభద్రం వల్ల ఆ పని అవుతుందో కాదో నాకు తెలియదు. కానీ కొన్ని కారణాల వల్ల నేనందుకు అంగీకరించలేదు. నా సమస్యలను నేనే స్వయంగా పరిష్కరించుకోవాలని నాకుంటుంది. ఎదుటి వాళ్ళ జోక్యం నాకిష్టముండదు. తర్వాత ఆ కంపెనీలో ఓ అధికారితో నాకు పడడంలేదు. మళ్ళీ ఉద్యోగం వచ్చినా నా కక్కడ దినదినగండంగా ఉంటుంది. ఒకసారి నన్ను పనిలోంచి తీసివేసిన ఆ కంపెనీలో మళ్ళీ చేరడం నాకిష్టం లేదు. అది నా అహానికి దెబ్బ!


అందువల్ల వీరభద్రాన్ని నే నొకటే సహాయం కోరాను— తన పలుకుబడితో ఏదైనా బ్యాంకు లోను ఇప్పించగలిగితే చూడమని ఆయన సంతోషంగా అంగీకరించాడు. ఆ విధంగా నా చేతిలోకి పదివేలరూపాయలు వచ్చాయి. ఆ డబ్బుతో ఓ చిన్న కిరాణా దుకాణం ఆరంభించాను. ఒక సంవత్సర కాలంలో ఆ దుకాణం నిలదొక్కుకో గలిగింది. నెల నెలా బ్యాంకు లోను వాయిదాలు కడుతూండగా ఇంటి ఖర్చులు వెళ్ళిపోతున్నాయి.

ఈ లోగా నాకో పాప పుట్టింది. పాపకు ఆర్నెల్లు వచ్చేసరికి మేము ఇంటివద్ద నుంచి మా అమ్మమ్మగారిని రప్పించుకున్నాము.

శ్రీమతికి కుట్టుపనులు, అల్లికలు, ఎంబ్రాయిడరీలు వగైరాలు బాగా వచ్చును. వాయిదాల పద్ధతి మీద ఒక కుట్టుమిషన్ కొని తను ఆడవాళ్ళకూ, చిన్న పిల్లలకూ బట్టలు కుట్టడం ప్రారంభించింది. అందువల్ల ఆమె స్థాయి మామూలు మధ్యతరగతి గృహిణినుండి బట్టలుకుట్టే 'మనిషికి దిగజారిపోయింది. ఆమెకు చుట్టుపక్కల కాస్త గౌరవం తగ్గింది. దాని ప్రభావం మే మాట్టే ఫీలు కాలేదు. మా రిజర్వుడు నేచర్ అందుకు బాగా ఉపయోగపడింది.. మేము ఇతరుల అభిప్రాయాల గురించి పట్టించుకోకుండా మా పనులు మేము చేసుకుంటూ శ్రద్ధగా వ్యాపారం మీద దృష్టిని కేంద్రీకరించాము. ఈ పరిస్థితుల్లో కూడా మా వీరభద్రం పిల్లల పుట్టిన రోజులు మరచిపోలేదు. వాళ్ళను సంవత్సరానికి రెండుసార్లు ఆహ్వానించడం మరచిపోలేదు. వాళ్ళు వీలున్నప్పుడల్లా మా ఇంటికి వచ్చి వెడుతూ మా మనోధైర్యాన్ని అభినందిస్తూండే వారు.

అయిదేళ్ళలో నా వ్యాపారం బాగా నిలదొక్కుకుంది. ఈ మధ్యనే ఒక ఫ్యాన్సీ దుకాణం, బట్టల దుకాణం కూడా ప్రారంభించాను. శ్రీమతి ఇప్పుడు స్వయంగా బట్టలు కుట్టడం మానేసింది. ఊళ్ళోని లేడీస్ టైలరింగ్ హౌస్‌ల్లో మాది కూడా ఒక ప్రముఖమైనది! పన్నెండు కుట్టు మిషన్లూ,ఇరవైమంది పనివాళ్ళూ ఉన్నారు. ఎప్పుడూ ఆమెకు చేతినిండా పని ఉంటుంది.

ఆర్థికంగా మేమిప్పుడు బాగా బాగుపడిపోయాం. నే నద్దెకుంటున్న ఇల్లు అమ్మకానికి రాగా కొనేసి — ఆ స్థలంలోనే పెద్ద మేడ కట్టాను. మా వీధికి నా దొక్కటే దివ్యభవనం. నా కిప్పుడు రెండు కార్లున్నాయి. ఒక సామాన్యమైన గుమస్తా ఈ స్థాయికి



విడిగిపోతాడని నే నెన్నడూ అనుకోలేదు. ఆ కంపెనీలో ఉద్యోగం పోవడం నా మంచికే వచ్చింది.

ఇప్పుడు కూడా మేము వీరభద్రాన్ని సంవత్సరానికి రెండుసార్లు ఆహ్వానిస్తూనే ఉన్నాం. వాళ్ల పిల్లల పుట్టిన రోజులకు వాళ్లింటికి వెళ్లి వస్తూనే ఉన్నాం. కానీ క్రమంగా వీరభద్రం మా ఇంటికి రావడం బాగా తగ్గించేశాడు. ఇప్పుడైతే మేము పిల్చినపుడు తప్ప రావటంలేదు.

ఒకసారి వాళ్లింటి కెళ్లినపుడు "ఇప్పుడు మీరు రావడం బొత్తిగా తగ్గించేశారు మా ఇంటికి!" అన్నాను.

"మీ రొస్తున్నారా?" అన్నాడు వీరభద్రం వెంటనే.

"మే మెప్పుడూ అంతే" అన్నాను నవ్వుతూ.

వీరభద్రం నవ్వలేదు— "ఒకప్పుడైతే మీ రెవరింటికీ వెళ్లేవారు కాదు. కానీ ఇప్పుడు చాలా మంది ఇళ్లకు వెడుతున్నారు. చాలా సార్లు వెడుతున్నారు. ఒక్క మా ఇంటికే రావడంలేదు."

వీరభద్రం ఆరోపణలో అబద్ధం లేదు. నేను కొంతమంది ఇళ్లకు చాలా తరచుగా వెళ్లి వస్తుంటాను. దానికి ఆహ్వానంతో నిమిత్తంలేదు. అయితే అవి వ్యాపారానికి సంబంధించిన అవసరం. నా వ్యాపారం సక్రమంగా నడిచి పోవడానికి నేను కొన్ని కంటాక్ట్స్ మెయింటైన్ చేయక తప్పదు.

నేను నవ్వి—"మీ రన్నది అబద్ధం కాదు.

మార్పు

అయితే ఆయా వ్యక్తుల ఇంటికి నేను కొన్ని ప్రయోజనాల నాశించి వెళ్లవలసి వస్తోంది. అది వ్యాపారం" అన్నాను.

"అదే మీలో వచ్చిన మార్పు—ప్రయోజన ముంటే తప్ప మీరు ఎవరింటికీ వెళ్లరు. ప్రయోజనం లేదు కాబట్టే నా ఇంటికి రారు" అన్నాడు వీరభద్రం.

నా నవ్వు చెదరలేదు — "మీరు చాలా తప్పుగా అర్థం చేసుకున్నారు. మీరు వ్యాపారానికీ, స్నేహానికీ ముడి పెడుతున్నారు. స్నేహానికి సంబంధించినంత వరకూ నే నేమీ మారలేదు. మీతో నాకున్నది స్నేహం మాత్రమే! వ్యాపారం కంటే ఎంతో విలువైనది. దాన్ని నేను వదులుకోలేను."

వీరభద్రం కన్విన్సయినట్లు లేదు కానీ సంభాషణ మార్చాడు. అక్కణ్ణించి బయటకు వచ్చాక శ్రీమతి నాతో చెప్పిందాన్ని బట్టి వీరభద్రం భార్య కూడా ఆమెతో అలాగే మాట్లాడింది. నాకు రవ్వంత బాధ కలిగింది.

మర్నాడు మేమేదో సినిమాకు వెళ్లి తలనొప్పి కొనుక్కుని — పోగొట్టు కోవడం కోసం శారదా హోటల్లో కాఫీ తాగడానికి వెళ్లాం. శారదా హోటల్ మా ఊరి కల్లా ఖరీదైనది. అక్కడి సర్వర్ రూపాయికి తక్కువైతే టిప్పు పుచ్చుకోరు. నలుగురికి సరిపడ కాఫీ ఎనిమిది రూపాయలు. హోదాను నిలుపుకోవడానికీ, మరో చోట

ఉండే అశుభ్రతను భరించలేకే మేము అక్కడే కాఫీ తీసుకుంటూంటాం.

శ్రీమతి కాఫీని చప్పరించి — "ఇది రంగనాధ్ విలాస్ కాఫీ క్లబ్‌లో కాఫీ లాగే ఉంది" అంది.

నే నుద్యోగం చేసేరోజుల్లో అది మా ఫేవరేట్ హోటల్. అక్కడి కాఫీకి చాలా పేరు.

నేను నవ్వి "హోటల్ మారినంత మాత్రాన—కాఫీ మారుతుందని ఎలా అనుకున్నావు. కాఫీని రంగనాధ్ విలాస్ కాఫీక్లబ్ కంటె బాగా తయారు చేయడం ఎవరి వల్లా కాదు. అసలు అక్కడి కాఫీయే ఇక్కడికి వస్తుందని చెప్పుకుంటారు."

అని ఉలిక్కిపడ్డాను. అక్కడైతే కప్పు కాఫీ నలభై పైసలు. ఇక్కడ రెండ్రూపాయలు. అదే కాఫీకి ధరలో ఇంత తేడా ఎలా వచ్చింది? ఖరీదైన పరిసరాలు, ఖరీదైన కప్పులు.

కాఫీని అడిగితే నేను మారలేదు అంటుంది. కానీ ప్రజలు నమ్ముతారా? ఈ భవనం, కాఫీ ధరించిన ఈ కప్పు— నమ్మనిస్తాయా?

నా విషయంలో కూడా ఇంతే జరిగిందేమో! నా ఖరీదైన దుస్తులు, నాకున్న సదుపాయాలు చూసి వీరభద్రం భ్రమలోపడి నేను మారాననుకుంటున్నాడు ఒకప్పుడు నా కంటే ఎక్కువ హోదాలో ఉండేవాడుకాబట్టే నా ప్రవర్తన ఆయనలో ఎటువంటి అనుమానాల్నీ కలిగించలేదు. నేనాయన్ను చిన్న బుచ్చగలనని సందేహించలేదు ఇప్పుడు నాకు అబ్బిన ఐశ్వర్యం మా ఇద్దరికీ మధ్య ఆర్థిక వ్యత్యాసాన్ని బాగా పెంచి— ఆయన్ని ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుకు గురి చేసింది. ఒకప్పుడు నా ప్రవర్తనను సహజ స్వభావంగా భావించగలిగిన ఆయన ఇప్పుడు దాన్ని తన పట్ల అలక్ష్యంగా భావించి బాధపడుతున్నాడు.

నేను ఫైవ్‌స్టార్ హోటల్లో కాఫీలాంటి వాణ్ణి. పాకహోటల్ కాఫీకి దానికీ రుచిలో చెప్పుకోతగ్గ తేడా ఉండదని నేనొప్పుకుంటాను. కానీ వీరభద్రం ఒప్పుకోడు. పరిసరాలు సృష్టించిన భ్రమలోపడి వీరభద్రం లాంటి వారెందరో స్నేహపురుచిని కోల్పోతున్నారు.

ఆంతరంగికంగా నేను మారలేదన్న నిజం నాకు తృప్తిని కలిగించినా, వీరభద్రంలో మార్పు వచ్చినందుకు నా కెంతో బాధ కలిగించింది. ●

"కాంప్లాన్® మాత్రమే మా కుటుంబానికి సరియైనది–సంపూర్ణంగా ఆరోగ్యబద్ధమైన ఆహారం."



''మా శ్రీవారు పనిలో మునిగి వుంటా రెప్పుడూ—తరచు భోజనం ఎగ్గొడుతూ ఉంటారు. ఆయనకు అందని ఆ పోషణని యిస్తుంది కాంప్లాన్."



"మా అబ్బాయి అన్నం సరిగ్గా తినడు, మారాం చేస్తాడు. వాడి పెరుగుదలకు కావలసిన ప్రొటీన్లూ, యితర ఆహార పదార్థాలూ కాంప్లాన్‌తో తప్పకుండా అందుతాయి"



"మా అమ్మ యిప్పుడే జబ్బుపడి లేచింది. ఆకలి లేదు. కోలుకునే యీ సమయంలో, కాంప్లాన్ ఆదర్శమైన తీరులో పుష్టినిస్తుందనిపిస్తోంది."

కేవలం కాంప్లాన్® లోనే అందరికీ అవసరమయ్యే 23 కీలక ఆహార పదార్థాలున్నాయి.



"ఇంట్లో పని చేసిచేసి అలసిపోతాన్నేను. మరింత పోషణ అవసరమనిపిస్తుంది ఒక్కొక్కప్పుడు. మరి కాంప్లాన్, నేను మా కుటుంబానికి యివ్వగలిగినంత యిచ్చేలా చేస్తుందనిపిస్తుంది."

కేవలం కాంప్లాన్‌లోనే శాస్త్రీయంగా రూపొందించిన పాళ్ళలో, మన శరీరానికి ప్రతిరోజూ అవసరమయ్యే 23 కీలక ఆహార పదార్థాలున్నాయి...ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజ పదార్థాలు. డాక్టర్లు ఎక్కువగా సిఫార్సు చేసే ఆరోగ్యబద్ధమైన పానీయం.

రుచికరమైన చాక్లెట్, ఏలక్కాయ–కుంకుమపువ్వు, స్ట్రాబెరీ సువాసనలలో దొరుకుతుంది—ప్లెయిన్ (సాదాగా) కూడా.

కాంప్లాన్®

—సంపూర్ణంగా ఆరోగ్యబద్ధమైన ఆహారం.

LINTAS-GLC-10-2316 TL

పెళ్ళి కుదిరింది

-చేర్ల సీతాదేవి



ఆ రోజు చాలా చిరాకుగా వుంది రహీమ్‌కి.

సుల్తానా జరదా కిళ్ళీ బుగ్గన పెట్టుకుని పిల్లలకి కబుర్లు చెపుతోంది. ఆమె మాటలకు పగలబడి నవ్వుతున్నారు పిల్లలు. రహీమ్ సుల్తానా వైపు పరీక్షిస్తున్నట్టుగా చూశాడు.

పలచని జుట్టులో అక్కడక్కడ వెండితీగల్లా తెల్లవెంట్రుకలు. గుండ్రటి మొహం. చిన్న కళ్ళు. నవ్వేటప్పుడు గారకట్టి కనిపించే చిన్న చిన్న వంకర పళ్ళు. కుదేసిన గుమ్మడికాయలా పిల్లలమధ్య కూర్చుంది సుల్తానా.

'మరే మా అమ్మా నాన్న ఆస్పత్రికి వెళ్ళారు. వొచ్చేవరకూ నీదగ్గరే వుండమంది మా అమ్మ' తలుపు చాటునుంచి ఓ పిల్లాడు. 'అలాగా రారా' అంటూ వాడ్ని రెక్క పట్టుకుని లాక్కుని వొళ్ళో కూర్చోబెట్టుకుంది. వాడిని ప్రశ్నలు వెయ్యటం మొదలుపెట్టింది.

రహీమ్‌కి పేపర్లో అక్షరాలు మాత్రం కనిపిస్తున్నాయంతే. అప్పటివరకూ సుల్తానా వొడిలో ఆడుకుంటున్న పసివాడు గొంతు పెద్దజేసి రాగం అందుకున్నాడు. సుల్తానా వాడ్ని భుజాన వేసుకుని తిప్పటం మొదలుపెట్టింది. సముదాయించలేక నానాయాతనా పడుతోంది.

'ఏమిటి గొడవ ?' రహీమ్ విసుక్కున్నాడు.

"బాగుంది. పిల్లలన్నాక ఏడవరేమిటి ? వీడే నా కొడుకయితే భుజాన వేసుకుని తిప్పేవాడివి కావా ?" నిలదీసినట్టే అడిగింది

రహీమ్ పేపర్లో మొహం దాచుకున్నాడు.

"మరి నీకెందుకు పిల్లలు లేరు ?" పేపరు తప్పించి చూశాడు రహీమ్.

మా అమ్మా నాన్న ఆస్పత్రికి వెళ్ళారని చెప్పిన అబ్బాయి అన్నాడు.

"ఓరి పిచ్చినాగన్నా! ఎందుకు లేరూ అంటే దేవుడు యివ్వలేదు. నాకు పెళ్ళయి యిరవై ఏళ్ళయింది. కొడుకు వుంటే మీ పెద్దన్న లేడూ, రామం, అంత వుండేవాడు."

గోపి బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకుంది సుల్తానా

రహీమ్ తలపట్టుకు కూర్చున్నాడు. "పిల్లల దగ్గర ఏం మాట్లాడాలో కూడా తెలీదు."

రహీమ్ ఇరవై ఏళ్ళ సంసార జీవితంలో చాలా సాయంత్రాలు యించుమించు ఒకేలాగ గడిచాయని చెప్పకోవచ్చు. అతను ఒక హైస్కూల్ హెడ్‌మాష్టరు వుదయం పదినుండి సాయంత్రం నాలుగు వరకూ స్కూల్లో పిల్లలమధ్య, స్టాఫ్ కంప్లెయింట్లతో, బుర్ర తిరిగిపోతుంది. ఇంటి కొస్తాడు.

సరిగ్గా గడపదగ్గర నేలమీద చతికిలబడి వుంటుంది సుల్తానా. చుట్టూ పిల్లలుంటారు. రహీమ్ టీ కప్పు, పేపరు పట్టుకుని కిటికీ పక్కనే పడక్కుర్చీలో కూర్చుంటాడు. రోడ్డుమీద వొచ్చే పోయే జనం ఒక్కసారన్నా తలతిప్పి చూస్తారు.

రహీమ్ చిరాకుపడిపోతూ, "కొంపలో ఎక్కడా చోటులేనట్టు పిల్లల్ని పెట్టుకుని గుమ్మంలో కూర్చుంటావు. చూసి చూసి ఎవడో నీకు పిల్లల

కోడి అని పేరు పెడతాడు చూడు" అని కోప్పడతాడు.

అతనా మాట అన్నప్పుడల్లా 'పెట్టుకోనీ తెలిసినవాళ్ళు గొడ్రాలు అంటుంటే పడటంలా ?' కొట్టి పారేస్తుంది సుల్తానా.

మధ్య మధ్య సుల్తానా 'యిదిగో విన్నావా ?' అంటూ పిల్లల్నించి సేకరించిన సమాచారం చేరవేస్తూ వుంటుంది. వాళ్ళని ఏ మాటలు అడగాలో ఏవి అడక్కూడదో అని లేదు.

ఇది రోజూవుండే కార్యక్రమమే అయినా కొద్ది రోజులుగా భరించలేకపోతున్నాడు అతను. కొన్నాళ్ళుగా అతను ఒక విషయం గురించి ఆలోచిస్తున్నాడు. అయితే ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాడు. 'లాభం లేదు. మనసులో మాట రమణమూర్తికి చెప్పి అతని సలహా అడగాలి ! చివాలున కుర్చీలోంచి లేచి గదిలోకి వెళ్ళాడు. చెప్పులు వేసుకుని అద్దంలో చూసుకున్నాడు. 'నలభై అంటే ఎవరూ నమ్మరు. పెళ్ళి కానివాడిలా వుంటావు' అన్న శర్మ మాటలు గుర్తొచ్చి ధైర్యం వచ్చింది. నున్నటి చెంపల్ని నిమురుకున్నాడు. వొత్తుగా నల్లగా వున్న క్రాఫుని పైపైన సర్దుకున్నాడు.

గుమ్మం దాటుతుండగా 'ఎక్కడికీ? తొందరగా వచ్చెయ్యి' గట్టిగా కేకపెట్టింది.

ఎప్పుడన్నా అవుతే అలాగే అన్నట్లు తల వూపేవాడు. యిప్పుడు మాత్రం వెనక్కి తిరిగి చూడలేదు.

రహీమ్ వెళ్ళేసరికి రమణమూర్తి పెద్ద కొడుక్కి లెక్కలు చెపుతున్నాడు. అతను యల్. ఐ. సి.లో సీనియర్ అసిస్టెంటు. ఏడేళ్ళ పాప ఎక్కాలు వల్లెవేస్తోంది. రెండేళ్ళ అబ్బాయి అతని వొళ్ళో వున్నాడు. లక్ష్మి చీరమీద ఏదో కుడుతున్నది. రహీమ్‌ని చూసి లోపలికి వెళ్ళింది.

రహీమ్ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. రమణ వొళ్ళోంచి బాబుని అందుకుంటూ 'నీ సంసారం చూస్తుంటే ముచ్చటేస్తుందోయ్ రమణా' అన్నాడు.

రమణ నవ్వి వూరుకున్నాడు.

లక్ష్మి టీలు తెచ్చింది. తర్వాత యిద్దరూ బయటికి బయలుదేరారు. దారిలో రహీమ్ చెప్పిందంతా శ్రద్ధగా విన్నాడు రమణ. కొద్దిసేపు ఇద్దరూ మాట్లాడుకోలేదు.

వున్నట్టుండి "మరి ఆవిడ, మీవాళ్ళు వొప్పుకుంటారా ?" అదే విషయాన్ని ఆలోచిస్తున్నట్టుగా అడిగాడు రమణ.

"నేను చేసుకోబోయేది పిల్లలకోసం" స్థిరంగా జావాబిచ్చాడు రహీమ్.

"కాస్త చదువుకుని, సంస్కారం వుండి, అనాకారి కాకుండా వుంటే చాలు. కులం, జాతి పట్టింపులేదు" ఆ మాటకి రమణ తలతిప్పి రహీమ్ మొహంలోకి చూశాడు.

"ఎలా ప్రొసీడ్ అవాలో సలహా యివ్వు" తన నిర్ణయానికి తిరుగులేదన్నట్లు మాట్లాడాడు.

చాలా దూరం మౌనంగా నడిచారు.

"పేపరుకి యిస్తే బాగుంటుందేమో. మంచి మాచ్ చూసి సెలక్టు చేసుకోవచ్చు."

ఆ ఆలోచన రహీమ్‌కి నచ్చింది. ఆ విషయమే మాట్లాడుతూ యింటి ముఖం పట్టారు.

* * *

మత్తేభాలవంటి మేఘాలు, గర్జనలు, మెరుపులు లేకుండా పిడుగుపడితే ఆశ్చర్యపోతారు. రహీమ్ మాటకి సుల్తానా అలానే నిశ్చేష్టురాలై నిలబడింది. సుల్తానా ఆ స్థితినుంచి తేరుకోక మునుపే రహీమ్ అందుకున్నాడు మళ్ళీ —

"నాలుగేళ్ళుపోయాక కాలో చెయ్యో పడి మంచాన పడితే ఎవరు చూడాలి ? నాకు పిల్లలు కావాలి. ఇప్పటికే ఆలస్యం చేశాననిపిస్తోంది."

"పిల్లలు పుట్టకపోతే అది నా తప్పా ? నాకు మాత్రం తల్లిని కావాలని లేదా? మరి నా గతేమిటి?" అంటూ ఏడుపు అందుకుంది సుల్తానా.

"కొంపలంటుకున్నట్టు ఏడుస్తావు దేనికి ? నీకు నేనేం అన్యాయం చెయ్యను. నెలకింత అవి పంపుతాను. హాయిగా పుట్టింట్లో కూర్చుని తిను."

"నువ్వు నన్ను కొట్టు, తిట్టు. లేకపోతే యింత విషమిచ్చి చంపెయ్యి అంతేకానీ ఇంట్లోంచి మాత్రం పోను" సుల్తానా ఏడుస్తూనే మొండిగా జవాబిచ్చింది.

రహీమ్ రెచ్చిపోయాడు.

"అరవగానే సరికాదు. ఏడాది గడువిస్తాను. కొడుకుని కనిస్తావా ? పెళ్ళి మానుకుంటాను." పెద్దగా అరిచాడు.

సుల్తానా ఏడుపు ఆపి రాయిలా నిలబడి పోయింది.

"నేను మంచివాడ్ని గనుక యీమాత్రం అవకాశమిచ్చాను. ఇంకోడయితే తలాక్ యిచ్చేసేవాడు." ఏమిటేమిటో అన్నాడు.

నాలుగు రోజుల ఘర్షణ అనంతరం బస్సెక్కించి పుట్టింటికి పంపేశాడు.

* * *


ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో మూడులైన్ల ప్రకటన కాలమ్‌కి మూడు వందల డెబ్బైఐదు రూపాయలు చెల్లించాడు రహీమ్. పదిహేను రోజుల తర్వాత పేపర్లో ప్రకటన వచ్చింది.


వారం తర్వాత ఒక వుత్తరం వచ్చింది. ఏమంత ఆశాజనకంగా లేదు. బొత్తిగా నిరుత్సాహ పడిపోయాడు. నెలలోపు యిరవై వుత్తరాలు వచ్చాయి. అందులో ఒక వుత్తరాన్ని సెలక్టు చేశారు రమణా, రహీమ్ కలిసి. అందులో యిలా వుంది—

మీరు ముస్లిమ్ అయుండి జాతి పట్టింపు లేదు అంటూ యిచ్చిన మీ ప్రకటన నన్ను ఆకర్షించింది. నా పేరు నాగభూషణం నాయుడు. ఎగ్జిక్యూటివ్ యింజనీరుగా రిటయిరయ్యాను. నాకు ముగ్గురు పిల్లలు. పెద్దవాడు రాయవేలూరులో మెడిసన్ నాలుగో సంవత్సరం. రెండోవాడు మద్రాసు ఇంజనీరింగ్ కాలేజీలో రెండవ సంవత్సరం. అమ్మాయి బి. ఎ. చదువుతున్నది.

భారతి నా చెల్లెలు, బి. ఎ. బియిడి. కడప కాన్వెంట్‌లో ఎనిమిదవ తరగతి ఇంగ్లీషు టీచరుగా ఆరేళ్ళబట్టీ చేస్తున్నది. రెండేళ్ళ క్రితం క్రిస్మస్ పండుగనాడు స్కూటర్ యాక్సిడెంట్‌లో భర్తనీ, నాలుగేళ్ళ కొడుకునీ పోగొట్టుకుంది. ఇప్పుడు ఆమె వయసు ముప్ఫైరెండు సంవత్సరాలు. ఎత్తు ఐదు అడుగుల మూడు అంగుళాలు. చామనఛాయకు పిసరంత మంచి రంగే. ఆరోగ్యంగా వుంటుంది. కను ముక్కు తీరు గుణగణాలు నేను పొగడకూడదు.

మా తండ్రిగారు యిచ్చిన భూమి, విమల్ టెక్స్‌టైల్స్‌లో షేర్ రెండు లక్షల పైగా ఆస్తి వుంది. తల్లీతండ్రీ లేనందున నేనే గార్డియన్‌గా





కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి

★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామాగల తపాలాబిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను తిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరుమీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవదని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥

వ్యవహరిస్తున్నాను. ఆమెను పెళ్ళాడబోయే వ్యక్తి పెళ్ళితోపాటే ఆవిడ ఆస్తికి హక్కుదారు అవుతాడు.

మీకు జవాబు రాయడానికి ముఖ్య కారణం మావాళ్ళల్లో ఇంతవరకూ మతాంతర వివాహం చేసుకున్నవాళ్ళు ఎవరూలేరు. ఆ ఘనత మా కుటుంబానికి దక్కాలని. మా భారతి అభిప్రాయం కూడా యిదే.

మరో విషయం. మా భారతికి తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతంతోపాటు హిందీ మాట్లాడనూ వ్రాయనూ వచ్చు. విశారద పరీక్ష పాసయింది.

మా భారతిని కంటికి రెప్పలా మీరు కాపాడు కుంటారన్న నమ్మకం కుదిరిననాడు మీ కివ్వడానికి నా కెటువంటి అభ్యంతరము వుండదు. మీ వివరాలు రాయగలరు.

స్నేహితులిద్దరూ సంప్రదించుకుని అతని వుత్తరానికి జవాబు రాసారు.

"మీ వుత్తరంలోని ప్లేన్‌నెస్ అండ్ ఫ్రాంక్‌నెస్ నన్ను ఆకట్టుకున్నాయి. మా తాత తండ్రులది పాకిస్తాన్. మా తండ్రిగారు వ్యాపార నిమిత్తం నిజామ్ స్టేట్‌కి వచ్చి యిక్కడే స్థిరపడిపోయారు.

నా విద్యాభ్యాసం యిక్కడే జరిగింది. గవర్నమెంటు హైస్కూల్ హెడ్మాష్టరుగా వున్నాను.

ముఖ్యంగా యీ వయసులో మళ్ళీపెళ్ళి ప్రసక్తి రావడానికి కారణం పిల్లలు లేకపోడం. ఇంతకాలం పెద్దగా ఈ లోపం తెలియలేదు.

ఇప్పుడు చాలా అనిపిస్తున్నది. నా మొదటి భార్య పుట్టింట్లో వున్నది. ఆమెకి నెలకి నూట యాభై రూపాయలు భరణం పంపే ఏర్పాటుచేసాను.

ఆమెవల్ల ఎటువంటి యిబ్బంది వుండదని హామీ యిస్తున్నాను

ఇక నా ఆస్తి వివరాలు : రజాకార్ సమయంలో మా తండ్రిగారు కొన్న యిల్లు, స్థలం రూపంలో, బ్యాంకులో యాభై వేల వరకూ వుంది.

నా గురించి నేను చెప్పుకునేకన్నా మీరు స్వయంగా వచ్చి విచారిస్తే బావుంటుంది."

రమణకి భోళాగా గలగలా మాట్లాడే సుల్తానా గుర్తొచ్చింది. ఢిల్లీకోట్ల భారతీయుల నాయకురాలిగా ఒక స్త్రీ చలామణీ అవుతున్న ఈ దేశంలో ఆడదానికున్న భద్రత ఏమిటి?

వ్యాపార వస్తువుగా అమ్మబడుతోంది – కొనబడుతోంది. అనుభవింపబడుతోంది ... వదిలి వేయబడుతోంది ...

* * *

రహీమ్ రాసిన ఉత్తరానికి నాగభూషణం నుంచి జవాబు వచ్చింది.

"పెళ్ళయితే వుద్యోగం చెయ్యనిస్తారా అని మా చెల్లెలి సందేహం. పెళ్ళి ఏ సాంప్రదాయ ప్రకారం జరపాలి? మీ మొదటి భార్య యింట్లోనే వున్నా నా చెల్లెలు సర్దుకుపోగలదు. ఆమె అటువంటి గుణవతి.

మీరు తెలుగు చాలా బాగా వ్రాశారు. భాష విషయంలో మా చెల్లెలికి బెంగలేదు."

ఈ వుత్తరాన్ని కూడా రమణమూర్తికి చూపించాడు రహీమ్. అర్జంటుగా జవాబు రాసి పడేశాడు.

"భారతిని చేపట్టేందుకు సిద్ధంగా వున్నాను. అయితే – ఆస్తిపాస్తుల కోసం కాక ఒక యువతిని వుద్ధరించాలన్న ప్రోద్బలమే కారణం.

జాతి, సాంప్రదాయాలను అధిగమించి మీరు ఆలోచించిన తీరు, తీసుకున్న నిర్ణయం నాకెంతో నచ్చాయి. పెళ్ళి అనంతరం కూడా ఆమె ఆస్తి ఆమె పేరనే వుంటుంది.

పెళ్ళి ఏ సాంప్రదాయ ప్రకారం అన్న ప్రశ్న లేకుండా నలుగురి పెద్దల సమక్షంలో దండలు మార్చుకుని ఒక మంచి విందు యేర్పాటు చేస్తే బావుంటుందని నా అభిప్రాయం, ఇద్దరం పెళ్ళి ముచ్చట తీరినవాళ్ళమే గాబట్టి

ఉద్యోగ విషయంలో నాకు అభ్యంతరం లేదు. మీ చెల్లెలి ఫోటో పంపగలరు."

వారం తర్వాత భారతి అన్నగారు నాగభూషణం రాసాడు తాను త్వరలో బయలుదేరి రానున్నట్లు. గాలికన్నా వేగంగా యీ వార్త అందరికీ ఎలా తెలిసిందో తెలిసింది "లక్షాధికారిణి మిమ్మల్ని చేసుకోడానికి వొప్పుకున్నదటగా" అని ఎదురుపడ్డ పరిచయస్తుడల్లా రహీమ్‌ని అడగటమే.

రహీమ్‌కి గర్వంగా, సంతోషంగా వున్నది. ముందు జీవితం గురించిన ఊహలూ, ఆలోచనలూ ఎక్కువయ్యాయి.

"రమణా! ఎలాగయ్యా! ఆడవాళ్ళకి ఏవో భయాలు, సెంటిమెంట్లు వుంటాయిగా. నన్ను స్కూటర్ ఎక్కనివ్వదేమో. పెళ్ళయ్యాక సెకండ్ హేండ్ ఫియట్ కొనేస్తాను." తనకి తట్టిన ప్రతీ ఆలోచనా రమణమూర్తికి చెపుతున్నాడు.

ఇంటికి సున్నాలు వేయించాడు బడిపిల్లలచేత పెరడు శుభ్రం చేయించాడు. అతనొస్తే యేవిధమైన ఆతిథ్యం యివ్వాలో, ఎవరెవర్ని పరిచయం చెయ్యాలో పథకం వూహించి పెట్టుకున్నాడు.

* * *

రహీమ్ బడికి వెళ్ళడానికి తయారవుతున్నాడు ఎవరో తలుపు తడుతున్న చప్పుడవటంతో వెళ్ళి తెరిచాడు. ఎర్రగా, బక్కపలచగా, పొడవుగా వున్న వ్యక్తి ఎటాచ్‌తో నిలబడివున్నాడు.

"మీరు... మీరు" సందేహిస్తూనే అడిగాడు రహీమ్.

"నాగభూషణం నాయుణ్ణి. మీరేనా రహీమ్"

అతను అడిగాడు.

'అవునవును.' రహీమ్ తడబడిపోయాడు. కంగారుపడిపోయాడు. కుంచించుకుపోయాడు.

అప్పుడు రహీమ్ వేషం –

గళ్ళలుంగీ, చేతుల బనీను, కుడిచేతిలో రేజర్, గడ్డానికి తెల్లగా నురుగు. మొదటిసారి ఆ విధంగా కనిపించవలసి వచ్చినందుకు మనసులో తెగ బాధ పడిపోతూ పైకి మర్యాద పుట్టిపడే స్వరంతో,

"ఉత్తరం రాసుంటే స్టేషన్‌కొచ్చుండేవాడ్ని. ఇల్లు కనుక్కోడం యిబ్బంది కాలేదుకదా. రండి" అంటూ ఆహ్వానించాడు.

"ఇది మా భారతి ప్రపోజల్." నవ్వుతూ లోనికొచ్చాడు భూషణం.

భూషణం కూర్చోడానికి కుర్చీ చూపించి 'కాఫీ పుచ్చుకుంటారా' అడిగాడు.

''ముందు మీరు గడ్డం కానివ్వండి.'' చనువుగా జవాబిచ్చాడు భూషణం.

'ఒక్క నిముషం' అని గదిలోకి పరుగెత్తి గబగబా గీసుకోడంలో ముక్కుక్రింద పై పెదవిమీద కసుక్కున తెగింది. చూపుడువేలుతో నొక్కిపెట్టి ఎలాగో ఆ పని పూర్తిచేసాడు.

ఎక్కువ సమయం తీసుకుంటే ఆడపిల్లలా తయారయ్యాడనుకుంటాడని రెండు నిముషాల్లో స్నానం కానిచ్చి డ్రసప్ అయివచ్చాడు. పనిపిల్లకి రెండు రకాల టిఫిన్లు, నాలుగు కప్పుల స్ట్రాంగ్ కాఫీ పట్రమ్మని ఫ్లాస్కు, డబ్బులు యిచ్చి పంపాడు.

ఈలోగా యిల్లు చూపించాడు.

'దేవిడీలా వుంది. కానీ చాలా పాతది' అన్నాడు భూషణం.

ఇది అమ్మేసి చిన్నదైనా అన్ని కంఫర్ట్సు వుండేలా యిల్లు కట్టాలన్న అభిప్రాయం వున్నట్లు చెప్పాడు రహీమ్.

పనిపిల్ల ఫలహారాలు పట్టుకొచ్చింది.

''భారతి ఫోటోలు'' అంటూ ఒక కవరు టేబుల్‌మీద వుంచాడు భూషణం.

కాఫీలు అయ్యేవరకూ ఎలాగో ఓపిక పట్టి అప్పుడు కవరు తీసి చూసాడు. రెండు ఫోటోలు వున్నాయి ఒకటి బ్రెస్టు సైజుది. రెండవది ఫుల్ సైజుది.

మంచి ఆరోగ్యంగా పుష్టిగా వుంది. కళగల ముఖం. రహీమ్‌కి చూడగానే నచ్చింది.

ఫోటో కవరు జేబులో పెట్టుకున్నాడు .

''ఈవాళ వుండి, రేపు సాయంత్రం క్రిష్ణా ఎక్స్‌ప్రెస్‌కి వెళ్తాను. ఎల్లుండి హైదరాబాదులో ఒక అర్జంట్ పనివుంది. మీ వూర్లో మంచి హోటలేదో చెప్పండి'' ఎటాచీ అందుకుని లేచాడు భూషణం.

''ఎంతమాట. మీరొస్తున్నట్లు ముందుగా తెలిసుంటే నేనే రూమ్ బుక్‌చేసి వుంచేవాణ్ణి. వుండండని'' ఎదురింటి కుర్రోణ్ణి పిలిచి ఆటో తెప్పించాడు.

దార్లో ''మీరు తెలుగువాడికన్నా తెలుగు బాగా మాట్లాడుతున్నారు'' అన్న నాగభూషణం పొగడ్తకు మురిసిపోయాడు రహీమ్.

స్టేషన్ దగ్గర్లోవున్న హోటల్ బ్లూమూన్‌లో ఎ. సి. సింగిల్ రూమ్‌కి తనే డబ్బు చెల్లించాడు. సి. ఎల్. పెట్టి వస్తానని చెప్పి బయల్దేరాడు. రెసెప్షన్ నుంచి రమణమూర్తికి ఫోన్‌చేసి భూషణం వచ్చిన సంగతి చెప్పాడు. సాయంత్రం పార్టీ గురించి మాట్లాడాడు వెంచయ్యకూ, శర్మకూ నువ్వు చెప్పు అని ఫోన్ పెట్టేసాడు

స్కూల్లో పనులు చూసుకుని సరిగ్గా పన్నెండు గంటలకు రూమ్‌కి వచ్చాడు.

''వేడి వేడి నీళ్ళు స్నానంచేసి, రెండు గంటలు పడుకుని లేచాక బడలిక తీరింది'' నవ్వుతూ ముందు తనే మాట్లాడాడు నాగభూషణం.

''భోజనం యిక్కడికే తెప్పించమంటారా ?' వినయంగా అడిగాడు రహీమ్.

మీల్స్ సెక్షన్‌కే వెడదామని ఎటాచీలో పర్సు జేబులో పెట్టుకుని గదికి తాళం వేసాడు భూషణం

కారిడార్‌లో నడుస్తూ — 'ఈ ప్రపంచంలో భోజనానికి మించింది లేదని నా అభిప్రాయం. నా మటుకు నేను ఎక్కువ ప్రాముఖ్యం, విలువ యిచ్చేది తిండికే' అంటూ నవ్వాడు.

మెనూ కార్డు చూసి రహీమ్ ఆర్డరిచ్చాడు. బిర్యానీ, తందూరీ చికెన్, ప్రాన్ పకోడా, ఫిష్ కట్‌లెట్ — ఎగ్ పుడింగ్.

నాగభూషణం తందూరీ చికెన్ నములుతూ రహీమ్‌కేసి చూసి, 'మీరేమీ తింటున్నట్లులేరు' అన్నాడు.

నిజంగానే కడుపునిండినట్లు ఆకలనిపించడం లేదు రహీమ్‌కి.

''మీరు చాలా పూర్ యీటర్‌లా వున్నారు చూడగా. మా చెల్లెలు కోడికూర్మా బ్రహ్మాండంగా వొండుతుంది'' మధ్య మధ్య మాట్లాడుతూ తింటున్నాడు భూషణం.

భూషణం పెరుగన్నంలోకి వచ్చేసరికి రహీమ్ తినడం పూర్తయింది. భూషణం చటుక్కున తలెత్తి 'మీకో విషయం చెప్పనా ?' అన్నాడు.

''చెప్పండి'' కుతూహలం కనబరిచాడు రహీమ్.

''అతి సంతోషం, విచారం కలిగినప్పుడు కంట్లో నీళ్ళు తిరగడం సహజం. ఔనా ? నాకేమో తృప్తిగా భోజనం చేసినప్పుడు కన్నీళ్ళు ఆగవు.''

'నిజమా ?!' అన్నట్లు చూసాడు రహీమ్.

నాగభూషణం కళ్ళు తడిగా మెరుస్తున్నాయి.

రహీమ్‌కి సంతోషం, తృప్తి కలిగాయి. పర్సు తీయబోయిన నాగభూషణాన్ని వారించి బిల్లు చెల్లించాడు.

రహీమ్ ఏమీ మాట్లాడక ముందు నాగభూషణమే చెప్పాడు. 'కడుపునిండా భోజనం పెట్టించారు. రెండుగంటలన్నా పడుకుంటేగాని భుక్తాయాసం తీరదు. నన్ను మీరు ఐదుగంటలకు కలుసుకోండి.'

సాయంత్రం స్వయంగా వచ్చి తీసుకువెడతాననీ, చిన్నపార్టీ యేర్పాటు చేశాననీ చెప్పి సెలవు తీసుకున్నాడు రహీమ్.

* * *

రహీమ్ పిలిచిన వాళ్ళందరూ పార్టీకి వచ్చారు. పేరు పేరునా ఒక్కొక్కర్నీ నాగభూషణానికి పరిచయం చేసాడు. రమణమూర్తికి మాత్రం భారతి ఫోటో చూపించాడు.


మాటల మధ్య రహీమ్ గుణగణాలనీ, స్కూల్లో అతనికున్న వ్యవహార దక్షతనీ, స్నేహానికి అతనిచ్చే విలువ, పేద విద్యార్థులకు అతను చేసిన సహాయం రహీమ్ గురించి చాలా గొప్పగా చెప్పారు పార్టీకి వచ్చినవాళ్ళు.


రమణమూర్తి, ''రహీమ్ నాకు నాలుగేళ్ళుగా తెలుసు. ఆవిడ యేమాత్రం రహీమ్‌కి తగిన యిల్లాలు కాదు. ఇతనుగాబట్టి యిన్నేళ్ళు ఆవిడతో కాపురం చెయ్యగలిగాడు'' అన్నాడు.

రహీమ్ ఎక్కువ మాట్లాడలేదు. ఆ తర్వాత సంభాషణ రాజకీయాలమీదికి మళ్ళింది నాగభూషణం తన వుద్యోగ సమయంలో కాంట్రాక్టర్లు, రాజకీయనాయకులు తమనెలా యిబ్బంది పెట్టారో చెప్పాడు.

పార్టీ సంతృప్తిగా ముగిసింది.

ఆ రాత్రి నాగభూషణం రహీమ్‌ని పక్కన





కూర్చోబెట్టుకుని సర్వీసు వివరాలు, మొదటి భార్య గురించి కొన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకున్నాడు.

"రేపు మీరు సెలవు పెట్టకండి. శర్మ, మూర్తిగార్ల అడ్రస్ యిస్తే వాళ్ళని విడిగా కలుసుకుంటాను. ఆ తర్వాత వూరు చూసి సాయంత్రానికి రూమ్‌కొచ్చేస్తాను. మీరు వచ్చేటప్పుడు భారతి ఫోటోలు మర్చిపోకుండా పట్టుకురండి." అని చెప్పాడు.

రహీమ్‌కి ఫోటోలు యివ్వాలనిలేదు. అందువల్ల వెంటనే జవాబు యివ్వలేదు.

అది కనిపెట్టినట్లు "మీ ఫోటోకూడా ఒకటి పట్టుకురండి. భారతికి చూపిస్తాను. తనకి నచ్చితే మిగత విషయాలన్నీ నేను చూసామ గాబట్టి మంచిరోజు చూసి, రమ్మని మీకు రాస్తాను ఆడ పెళ్ళి వాళ్ళుంగా అప్పటివరకూ మా జాగ్రత్తలో మేముండాలి."

అతను చెప్పింది సబబుగానే తోచింది రహీమ్‌కి

ఆ రాత్రికి రాత్రి శర్మనీ, మూర్తినీ కలుసుకుని ఎలాగన్నా యీ పెళ్ళి కుదిరేలా చూడండని చెప్పి యిల్లు చేరుకున్నాడు.

*   *   *

మరుసటి రోజు సాయంత్రం ఆరు గంటలకు పావుగంట ముందే హోటల్ బ్లూమూన్ చేరుకున్నాడు రహీమ్. నాగభూషణం గదిలో దిగాలుగా, నీరసంగా కూర్చునివున్నాడు.

పలకరింపుగా నవ్వాడు రహీమ్. నాగభూషణం ముఖాన నవ్వు లేదు. రహీమ్ గతుక్కుమన్నాడు. నిన్న రాత్రి వరకూ ఫేవర్‌గానే వున్నాడు. యింతలో— రహీమ్ ఆలోచన శర్మ మీదికి పోయింది.

"భూషణంగారూ! అలా వున్నారేమిటి?" పలకరించాడు.

ఒకసారి కళ్ళెత్తి చూసి వూరుకున్నాడు భూషణం.

రహీమ్ పై ప్రాణాలు పైనే పోయాయి. భూషణాని కెదురుగా కూర్చోటానికి ధైర్యం చాలలేదు.

"భూషణంగారూ! ఏం జరిగింది?" సందేహిస్తూ, భయంగా తగ్గుస్వరంతో మళ్ళీ పలకరించాడు.

"పర్సు పోయింది." ఆ మాట చెప్పడానికి నామోషీగా ఫీలయ్యాడు భూషణం.

విన్న తర్వాత రిలీఫ్‌గా ఫీలయ్యాడు రహీమ్. ఆదుర్దాగా అడిగాడు.

పెళ్లి కుదిరింది

"ఎంతుండాలి సార్? ఎక్కడ పోయింది? పోలీస్ రిపోర్ట్ యిచ్చారా?" నిట్టూర్చాడు నాగభూషణం.

"ఇంట్లో అందరికీ జాగ్రత్తలు చెప్తుంటాను. అటువంటిది పొరుగూరొచ్చి నేనే యిలా పర్సు పోగొట్టుకోడం—" వేళ్ళతో నుదురు రుద్దుకున్నాడు.

"టి. యం. ఒ. ద్వారా డబ్బు తెప్పించుకోవాలన్నా మూడు రోజులు పడుతుంది. రేపు హైదరాబాదులో ఒక అర్జంట్ పని వుంది. అసలు ఆ పనిమీద బయల్దేరే రెండూ కలిసొస్తాయని యిటొచ్చాను."

ఏంచెయ్యాలో తోచనివాడిలా అస్థిమితంగా కుర్చీ వెనక్కి జారబడి కళ్ళు మూసుకున్నాడు.

"ఎంత మాట సర్. మీరు మా వూరొచ్చి డబ్బు పోగొట్టుకున్నందుకు నేనెంతో విచారిస్తున్నాను. పొరపాటన్నది ఎవరికన్నా జరుగుతుంది. మీకు పావుగంటలో డబ్బు తెచ్చిస్తాను. ఈ ట్రైనుకే వెళ్ళండి."

"అదికాదు రహీమ్. మీ వూర్లో కాలు పెట్టింది మొదలు మళ్ళీ మా వూరు చేరేవరకూ యిక్కడ జరిగిందంతా పొల్లుపోకుండా తనకి చెప్పాలని మా భారతి నా దగ్గర మాట తీసుకుంది. నీ దగ్గర డబ్బు తీసుకున్నట్లు చెప్తే —"

"ఇందులో తప్పేముందిలెండి. మీకీ వూర్లో యెంకెవరూ తెలీదుగాబట్టిగానీ లేకపోతే యీ విషయం నాకసలు చెప్పేవారా?" మొహమాట పడుతూ అన్నా విజాయితీగా అన్నాడు రహీమ్.

"నాదే పొరపాటు. కొంత ఎటాచ్‌లో పెట్టుకోవలసింది." తన అజాగ్రత్తకి తననే విందించుకుంటూ పశ్చాత్తాపపడ్డాడు భూషణం.

"భూషణంగారూ! మీరు తయారుగా వుండండి. పావుగంటలో వస్తాను." అంటూ లేచిన రహీమ్‌తోపాటు భూషణమూ లేచి నిల్చున్నాడు.

"వెళ్ళగానే మీ డబ్బు మనియార్డర్ చేస్తాను. ఈ సహాయం చెయ్యండి."

ఆ మాటకు చాలా యిదయిపోయాడు రహీమ్.

"ఇక ఆ విషయం ఆలోచించకండి. ట్రైన్ టయిమవుతుంది" అని అతని జవాబుకి ఎదురు చూడకుండా బయటికి నడిచాడు.

పావుగంటలోవెయ్యిరూపాయిలతో తిరిగొచ్చాడు

"రహీమ్‌జీ! మీ స్నేహితులు మీ గురించి చెప్పింది విని పొగడ్త అనుకున్నాను"... ఆపైన మాట్లాడలేకపోయాడు నాగభూషణం.

"పదండి సార్!" ఎటాచ్ అందుకుని దారి తీసాడు రహీమ్.

హైదరాబాదుకి ఫస్టుక్లాసు టికెట్ తీసుకున్నాడు. రెండు మాగజైన్లు, రెండు ఏపిల్ పళ్ళు కొనితెచ్చాడు.

బండి ప్లాట్‌ఫామ్‌మీదికి వచ్చేసింది. నాగభూషణం సీట్లో కూర్చున్నాడు. గార్డు పచ్చ జండా చూపించాడు. బండి కదిలింది.

"మీరు వెళ్ళగానే వుత్తరం రాయండి" బండితోపాటు నడుస్తూ అన్నాడు రహీమ్.

"నీ పెళ్ళి కుదిరిందనే అనుకో" చనువుగా, స్నేహపూర్వకంగా రహీమ్ భుజం తట్టాడు నాగభూషణం.

"అలాగే — అలాగే!" దూరం జరిగి రెండు చేతులూ జోడించి నమస్కరించాడు.

రైలు వెళ్ళిపోయింది.

*   *   *

ఆశగా, ఆత్రుతగా నమ్మకంగా వుత్తరం కోసం ఎదురు చూడసాగాడు రహీమ్.

రెండువారాలు గడిచినాయిగానీ జవాబులేదు.

ఆదుర్దాని అణచుకోలేక రహీమ్ వుత్తరం రాసాడు.

జవాబులేదు.

ఎదురు చూసి చూసి మళ్ళీ రాసాడు.

నాగభూషణం వెళ్ళి మూడునెలలు కావస్తోంది.

రహీమ్ అయోమయంలో పడిపోయాడు. సహనాన్ని కోల్పోయాడు. నాగభూషణానికి, భారతికి విడివిడిగా వుత్తరాలు రాసి రిజిస్టర్ పోస్టుచేసాడు.

పదిహేనురోజుల తర్వాత రెండు రిజిష్టరు కవర్లూ తిరిగొచ్చాయి. భూషణానికి రాసిన కవరు మీద ఒక మూల ఎర్రసిరాతో యిలా రాసుంది —

ఈ పేరుగల వ్యక్తి యీ గ్రామములో రెండు నెలలనుండి లేదు. కావున వాపసు చేయడమైనది.


రెండవ కవరుమీద :


ఈ పేరుగల ఆమె యీ స్కూల్లో ఎవరూ లేరు. కావున వాపసు చేయడమైనది.

రహీమ్ బుర్ర గిర్రున తిరిగిపోయింది.

దగా, మోసం!! ఇప్పుడు నలుగురికీ మొహం చూపించుకోడం ఎలా?

రెండు చేతులతో తలపట్టుకుని కూర్చుండిపోయాడు రహీమ్. ★







న్యూట్రమూల్ 'మొనగాడ'వండి
బలానికి దారాసింగ్ చెప్పే పాఠాలు
గట్టితనం పొందే మార్గంలో
న్యూట్రమూల్ మీకు సహాయం
చేయనీండి– ఆరోగ్యంగా.
మీరు చేసేవన్నీ గొప్పగా
కనిపించేలా, గొప్పగా చేసేలా
కూడా. న్యూట్రమూల్
మొనగాడివడం అంటే అదేమరి.
daCunha/GCM/69/82/TL
Nutramul
అమూల్ వారి
న్యూట్రమూల్
అమ్మకందారులు :
గుజరాత్ కో–ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్
ఫెడరేషన్ లిమిటెడ్, ఆనంద్, గుజరాత్.

సీరియల్
మనసు కథ
వాసిరెడ్డి సీతాదేవి

(గత సంచిక తరువాయి)

జరిగిన కథ — 22 : శివప్రసాద్‌కి ఇంతకుముందే పెళ్లయిపోయిందనీ, ఆమె పేరు సునందనీ, పుష్కర స్నానాలకు వెళ్లి కృష్ణానదిలో మునిగిపోయిందనీ, అప్పట్నుంచీ పిచ్చివాడయ్యాడని చెప్తాడు శరత్ సుజాతకు. తనకింకా పెళ్లి కాలేదనికూడా చెప్తాడు. ప్రసాద్‌కి పిచ్చి అని నమ్మించి సుజాతను మద్రాసు తీసుకొచ్చి అసలు పిచ్చిదైన ఆమెకు అసలయిన ట్రీట్‌మెంట్ సాగిస్తుంటాడు శరత్. సుజాత తండ్రిని పిల్చుకురమ్మని శరత్ శివప్రసాద్‌ని పంపుతాడు. సుజాత వేష భాషల్లో, హావభావాల్లో రోజాను అనుకరిస్తుంటుంది.

సుభద్రమ్మ ఆండాళ్వార్ కోయిలలో వారం వారం పూజలు చేయిస్తుంది. ఆస్పిటలకు వచ్చే పిచ్చివాళ్ళకు నయం చేయమని ప్రార్థిస్తూ ఉంటుంది తుది ప్రార్థనగా పిచ్చివాళ్ళకు సేవచేసే నర్సులకు డాక్టర్లకూ పిచ్చిపట్టకుండా కాపాడమంటుంది.

సుభద్రమ్మ న్యూసెన్స్ భరించలేక శరత్‌బాబు ఆమెను రెండుసార్లు ఉద్యోగంలోనుంచి పీకేశాడు. ఆమె మంచితనాన్ని నిజాయితినీ చూసి రెండుసార్లు మళ్ళీ ఉద్యోగమిచ్చాడు

సుభద్రమ్మ అలా బయటకు వెళ్ళగానే "ఇదొక మెంటల్ కేసు. ఎప్పుడో యీావిడ్ని బల్లమీద పడుకోపెట్టాల్సి వస్తుంది!" అన్నది రోజా. శరత్‌బాబు నవ్వకుండా ఉండలేకపోయాడు.

టెలిఫోన్ మోగుతూవుంది. శరత్‌బాబు చూస్తూ అలాగే ఉండిపోయాడు. ఇది ఆరోసారి ఆత్రంగా ఆదుర్దాగా ఫోను ఎత్తడం —

"సార్ ! ఫోన్ !" అంటూ డాక్టర్ రోజా ఫోన్ ఎత్తింది.

"హల్లో ! ఎ. యన్. క్లినిక్ !" అన్నది రోజా.

"డాక్టర్ ! సుజాత భర్త ప్రసాద్ !" అరిచినంత పని చేసింది రోజా. శరత్‌బాబు ఫోన్‌తోపాటు ఆమె చేతినికూడా లాగేసుకొన్నాడు.

"ఏంరా ప్రసాద్ ! ఇంతాలశ్యమయింది ?"

"మెయిల్ గంటక్రితమే వచ్చింది. ఆ ముసలాడ్ని ప్లాట్‌ఫారం మీదనుంచి నడిపించుకు తీసుకురావడానికి పావుగంట పట్టింది —" అవతలినుంచి ప్రసాదు చెప్పుకుపోతున్నాడు.

"అదంతా తర్వాత చెప్దువిగాని —"

"సుజాత ఎలా ఉంది ?"

"ఉడ్‌లాండ్ హోటలేనా? రూంనంబరెంతా?"

ఒకళ్ళ మాట కొకళ్ళు అడ్డొచ్చి మాట్లాడుతున్నారు.

"త్రి నాట్ వన్ !"

"ఓ. కే! వస్తున్నా !" శరత్‌బాబు రిసీవర్ ఫోన్‌మీద పెట్టి లేచి నిలబడ్డాడు.

"డాక్టర్ ! సుజాతను చూస్తూ ఉండు !" శరత్‌బాబు మెరుపులా పోర్టికోలోకొచ్చాడు. కొద్ది క్షణాల్లో కారు ఆనంద నిలయం క్లినిక్ గేటులోనుంచి బీచ్ రోడ్డెక్కింది.

29

సాయంత్రం ఏడవుతూంది. అడయార్ బీచ్‌లో జనసంచారం తగ్గిపోయింది. ఆలస్యంగా వచ్చిన ఆఖరి పడవ ఒడ్డుకు చేరింది. చేపలబుట్ట నెత్తిన పెట్టుకొని నడుస్తున్న భార్య వెనక పల్లెవాడు వలలు భుజాన వేసుకొని, గుడిసెకేసి నడుస్తున్నాడు. గుడిసెకు అల్లంతదూరంలో బీచ్‌రోడ్డుకు ఆనుకొని వున్న ఆనంద నిలయం ఆవరణలో లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి.

క్లినిక్ థెరపీ రూంలో సుజాత బల్లమీద పడుకొనివున్నది. నర్సు సుభద్ర హడావుడిగా లోపలకీ బయటకీ తిరుగుతూవుంది. డాక్టర్ రోజా ఎలక్ట్రానిక్ గేడ్జట్స్ ముందు కూర్చుని రీడింగ్స్ నోట్ చేసుకొంటూ వుంది. శివప్రసాదు సుజాత పక్కన ఊపిరి బిగబట్టుకొని కూర్చుని వున్నాడు.

డాక్టర్ శరత్‌బాబు బల్లమీదకు వంగి, తీక్షణమైన చూపుల్ని ఆమె కళ్ళల్లో నిలిపి సుజాతను హిప్నటైజ్ చేస్తున్నాడు

క్రమంగా సుజాత మస్తిష్కం, చైతన్యం వ్యక్తిత్వం డాక్టర్ శరత్‌బాబు అధీనమైపోయింది.

"సుజాతా ?" శరత్‌బాబు కంఠం గంభీరంగా ఉంది.

"ఊఁ !" సుజాత రెస్పాన్సుతో శరత్‌బాబు మనిషి రెండింతలయిపోయాడు. రంగం సిద్ధమయింది. ఆ మనసు తన అధీనమయిందన్న సంతోషం అతని కళ్ళల్లో ప్రతిఫలించింది. సుజాత భర్త ఉత్కంఠంతో సుజాతనూ, డాక్టర్ను చూస్తూ వున్నాడు.

"సుజాతా ! ఎవరో మాట్లాడుతున్నారు విను !" శరత్‌బాబు డాక్టర్ రోజాను చూసి చెయ్యి ఊపాడు.

"డాక్టర్‌బాబూ ! ఇరవై ఏడేళ్ళనాటి సంగతి. అప్పుడు నేను శిరిపురం హైయ్యర్ ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టర్‌గా ఉన్నాను."

"సుజాతా ! ఈ గొంతు ఎవరిదో చెప్పగలవా ?" శరత్‌బాబు బల్లమీదకు వంగి సుజాతను అడిగాడు.

సుజాత మాట్లాడలేదు.

"గుర్తు చేసుకో ! ఈ గొంతు ఎవరిదీ ?"

"తెలియదు."

"ఓ. కే ! సుజాతా ! మీ నాన్నగారి పేరేమిటి?"

"జి. పరబ్రహ్మరావు."

"జి. అంటే ?"

"జిల్లేళ్ళమూడి."

"మీ నాన్నగారు—జిల్లేళ్ళమూడి పరబ్రహ్మరావుగారొచ్చారు."

"ఎందుకొచ్చాడూ ?"

"ఎందుకేమిటి ? నిన్ను చూడటానికి వచ్చారు !"

"నన్నేం చూడనవసరంలేదు. వెళ్ళిపొమ్మనండి !"

"తప్పు. అలా అనకూడదు ఎంతోదూరం నుంచి నిన్ను చూడాలని, నీతో మాట్లాడలని వచ్చారు."

"ఆయన నన్నెప్పుడో వదులుకొన్నాడు. ఆయనగారు నాతో మాట్లాడాల్సింది ఇంకేమీలేదు. ఆయన దృష్టిలో కూతురు ఎప్పుడో చచ్చిపోయింది."

"కాని నీ దృష్టిలో, నీ తండ్రి ఇంకా బ్రతికే ఉన్నాడు. తండ్రిమీద నీకున్న అనురాగం, ఆపేక్ష చావలేదు. అవును కదూ ?"

సుజాత కొద్ది క్షణాలు మౌనం వహించింది. ఆమెకు దుఃఖం పొంగి పొంగి వస్తూన్నది

"సుజాతా ? ఏడుస్తున్నావా ? తప్పు ఊరుకో. చూశావా ? మీ నాన్నంటే నీకెంత ప్రేముందో ? మీ నాన్న నిన్ను చూడాలనీ, నీకేదో చెప్పాలని ఎంతో ఆశతో వచ్చాడు నువ్వు వెళ్ళమంటే ఆయనెంతో బాధపడిపోతాడు. రండి ! పరబ్రహ్మరావుగారూ ! మీ అమ్మాయి వింటున్నది. ఊఁ ప్రారంభించండి. సుజాతా వింటున్నావుగా — వింటున్నావ్ " శరత్‌బాబు కంఠం మెల్లమెల్లగా మరుగైపోయింది. పరబ్రహ్మరావు మొదలుపెట్టాడు

"డాక్టర్ బాబూ ! ఇరవై ఏడేళ్ళనాటి సంగతి. అప్పుడు నేను శిరిపురం హైయర్ ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరగా వున్నాను. అప్పుడే కొత్తగా అపాయింటయి మేరి వచ్చి చేరింది. స్కూల్లో అసిస్టెంట్‌గా వున్న మేరితో నాకు పరిచయం ఏర్పడింది. పరిచయం పెరుగుతున్న రోజుల్లో ఆమెను వివాహం చేసుకోవాలనుకొన్నాను. మేరీని మనసారా ప్రేమించాను. ఆమె నన్ను ప్రేమించింది. నాతోటే ఆమె జీవితాంతం గడపాలనుకొన్నది. క్రిస్టమస్ శలవలకు స్కూలు పిల్లలను తీసుకొని కొండవీడు ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళాము. ఆ రాత్రి పిల్లలందరూ నిద్రపోతున్నారు. మేరీ నేనూ అర్థరాత్రిదాకా కబుర్లు చెప్పుకొంటూ చల్లగాలిలో

ఆరుబయట కొండరాళ్ళమీద కూర్చున్నాము. టప టప మంటూ వానచినుకులు పడసాగాయి. అంతలో కడవపోతగా వర్షం మొదలయింది. పరుగెత్తుకొని విడిదికి వెళ్ళేలోపలే ఇద్దరం పూర్తిగా తడిసిపోయాము. నా ముందరే మేరీ తడిచిన చీరా రవికా మార్చుకోసాగింది. లాంతరు వెలుగులో యవ్వనంలో ఉన్న ఆమె శరీరపు వంపులు నన్ను సమ్మోహితుడ్ని చేశాయి. ఏదో బలహీనత నన్నావరించింది. నా మనసు అధీనం తప్పింది. నా చేతుల్లో ఆమె కొద్దిక్షణాలు పెనుగులాడింది. తర్వాత ఆమె నాకు లొంగిపోయింది. ఆమె శరీరాన్ని ఆక్రమించుకొన్నాను.

ఎక్సకర్షన్నుంచి తిరిగి వచ్చాము. వేసవి సెలవల్లో పెళ్ళి చేసుకొందామని నిర్ణయించుకొన్నాము. ఆ రోజు నుంచి రోజూ రహస్యంగా కలుసుకునేవాళ్ళం. హైయ్యర్ గ్రేడ్ పాసయిన మేరిని స్కూలు ఫైనల్ ప్రైవేట్‌గా కూర్చోమని ప్రోత్సహించాము. ఇంగ్లీషు లెక్కల్లో మేరికి కోచింగ్ ఇస్తూ వుండేవాడిని. ప్రైవేట్ వంకతో మా కార్యక్రమాలు నిరభ్యంతరంగా సాగిపోతూ ఉండేవి. అయినా తోటి టీచర్లలో గుసగుసలు బయలుదేరాయి. నేను హెడ్మాష్టరుగా ఉన్నాను కాబట్టి మా ముందు ఎవరూ బయటపడే వాళ్ళుకాదు భయపడేవాళ్ళు సెలవులివ్వగానే మేరి స్వగ్రామానికి వెళ్ళింది. వెళ్ళేముందు నా చేత వాళ్ళ దేముడి ముందు ప్రమాణం చేయించుకొని వెళ్ళింది. రోహిణి మొదటిపాదంలో నా వివాహం నిశ్చయమైంది. మా తండ్రి చండశాసనుడు. పరువు ప్రతిష్టలు గల కుటుంబం. సాంప్రదాయలకు ఆచారాలకు నియమనిష్టలకు అంకితమైన వంశం మాది. మా తండ్రి ముహూర్తాలు పెట్టుకొని ఇంటికి తిరిగొచ్చిన తర్వాత వారంరోజులు బాధపడ్డాను. మధనపడ్డాను. కాని ఎదురుపడి చెప్పే ధైర్యం నాలో లేకపోయింది. దూరపు బంధువు ఒకాయన్ను పట్టుకొని ఆయన చెవులో ఊదాను. ఆ మహానుభావుడేం చెప్పాడో మా నాయనగారికి? ఆయన అగ్నిహోత్రావధానులయిపోయాడు. దానికి తగ్గట్టు మా తల్లిగారు గుండెజబ్బు మనిషి! వాళ్ళిద్దర్నీ కాదని యీ కులంకాని, మతంగాని మేరిని వివాహం చేసుకోవడం అసంభవమనిపించింది. అలా జరిగితే నా తల్లితండ్రులు నా కళ్ళముందే 'హరి' అనేట్టున్నారు. వంశం, కులం, మతం మేరీని నాకు కాకుండా చేశాయి — "

"దుర్మార్గుడా?" శరత్‌బాబు ఉలిక్కిపడి చూశాడు. సుజాత కళ్ళు మూసుకునే ఉంది.

"సుజాతా! నివ్విప్పుడేం మాట్లాడకూడదు. మీ నాన్న చెప్తున్నది వినాలి. మళ్ళీ నేను మాట్లాడమనేదాకా పెదవి కదపకూడదు. వింటున్నావా? వింటున్నావు. మీ నాన్న మాటలు నీకు వినిపిస్తున్నాయి — వినిపిస్తున్నాయ్!"

"— నాకు మోజు తీరలేదు. శలవుల తర్వాత బడి తెరిచారు. నాకు పెళ్ళయినట్టు మేరికి చెప్పలేదు. ఆమె మా పెళ్ళిని గురించి వత్తిడి చేసినప్పుడల్లా కల్లబొల్లి మాటలు చెప్పి దాటవేశేవాడిని. తెగేదాకా ఆమె లాగేదికాదు. నన్ను దూరం చేసుకుంటే నష్టం ఆమెకేనని మేరికి తెలుసు. పైగా నేను అవివాహితుడ్నని ఆమె నమ్ముతుంది. ఎప్పటికయినా ఆమెకు వివాహం అవుతుందనే నమ్మకంతో ఉంది. అప్పటికే మేరీ మూడు నెలల గర్భవతి! —"

"పరబ్రహ్మారావుగారూ! 'ఒక్క నిముషం ఆగండి! సుజాతలో మార్పును గమనించానన్నారు. సరిగ్గా గుర్తు చేసుకొని చెప్పండి. ఆ మార్పు ఎప్పుడు మొదలయింది? ఎలా ప్రారంభమైందీ?" శరత్‌బాబు గొంతు వినిపించింది.

"సుజాతకు పదకొండు నిండి పన్నెండో ఏదు వచ్చింది. ఓ రోజు అదియే నెల అనుకొంటాను నా పక్కలో పడుకొని ఉన్న సుజాత తెల్లవారుఝూమున ఖంగారుపడి లేచింది. నన్ను లేపింది. సుజాత ముఖంలో పలానా అని చెప్పలేని భయమూ ఆదుర్దా గోచరించాయి. పిల్లలంగామీద రక్తపుమరకలు కనిపించాయి. ఆ రక్తం ఇంకా తడితడిగానే ఉంది. ముందు నా కంతా అయోమయం అయిపోయింది. మెల్ల మెల్లగా అర్ధమయింది. ఆడదిక్కులేని సంసారం! తెలతెలవారుతుండగా వెళ్ళి పక్కింటి పేరమ్మగారిని లేపుకొచ్చాను. పేరమ్మ సుజాతను చింకిచాపవేసి మూలన కూర్చోపెట్టింది. నీకు ఖర్చు





వచ్చింది బ్రహ్మయ్యా. నీ కూతురు పెద్దదయింది అన్నది పేరమ్మ. ఆ పేరమ్మ చెప్పినట్లే రజస్వలయిన సుజాతకు అన్ని ఏర్పాట్లూ చేశాను. కొబ్బరా బెల్లం, ముత్తైదువుల పిలుపులు, తతంగం అంతా పేరమ్మ చేతులమీదుగానే జరిగిపోయింది. పచ్చి తాటాకులు కొట్టించి తెప్పించాను. ఆకులు కడిగి మెల్లాలో గోడవారగావేసి సుజాతను కూర్చోపెట్టడం జరిగింది. తడి ఆకులమీద కూర్చొబెట్టిన మరుక్షణంలో సుజాత కెవ్వున కేకపెట్టి పడిపోయింది! పది నిముషాలకుగాని మన స్పృహలోకి రాలేదు. ఆ తర్వాత కొద్దిరోజులు మామూలుగానే ఉన్నది. తర్వాత తర్వాత తనకు తెలియకుండానే నిద్రలో లేచేది. ఓ పండక్కు కొత్తబట్టలు కుట్టించి తెచ్చాను. తెల్లవారేసరికి అవి బావిలో పారేసింది సుజాత. అప్పట్నుంచీ తన కిష్టమయిన వస్తువులన్నీ తీసుకెళ్ళి ఊళ్ళో ఊర బావిలో పడేసి వస్తుండేది. ఆ రాత్రి చేసిందేమీ తనకు తెల్లవారితే తెలిసేదికాదు. పైగా వస్తువులు పోయినప్పుడల్లా చాలా బాధపడేది. తనకు ప్రియమైన వాటినన్నిటినీ శత్రువులెవరో పనిగట్టుకొనివచ్చి బావిలో పారేస్తున్నట్టు భావించేది. ఇంట్లో ఖరీదయిన వస్తువులు పోయినప్పుడల్లా బావిలో వెతికించి తెప్పించేవాడిని. ఊరు ఊరంతా వింతగా విరగబడి చెప్పుకొనేవాళ్ళు. స్కూల్లో పిల్లలు పంతుళ్ళూ సుజాతను వింతగా అదోలా చూసేవాళ్ళు. సుజాతను వీలైనంతవరకూ అందరికీ దూరంగా వుంచేవాడ్ని. దాని బ్రతుకు దాదాపు ఒంటరి బ్రతుకే అయిపోయింది.''

''పరబ్రహ్మరావుగారూ! సుజాత తనకు బాగా ఇష్టమయినవాటిని మాత్రమే బావిలో వేసేదన్నారు. తను ఇష్టంలేని వాటి జోలికి వెళ్ళేది కాదా? కొంచం గుర్తు చేసుకోండి. ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న?'' శరత్‌బాబు కంఠం ఖంగ్‌మని విన్పించింది.

''ఎక్కువగా తనకు ఇష్టమైనవాటినే వేసేది. బావిలో దాచుకొన్నట్టు చేసేది. తను బాగా ద్వేషించేవాటిని కూడా నీళ్ళల్లో వేసేదేమో మరి! నాకు గుర్తులేదు. ఇది చాలా అరుదుగా జరిగేది. ఎంతోమంది డాక్టర్లకు చూపించాను. కాని ప్రయోజనం లేకపోయింది. సుజాత శారీరక ఆరోగ్యం బాగానే ఉందని నిర్ధారణ చేసి చెప్పేవాళ్ళు. సుజాత మానసిక వ్యాధితో బాధపడుతుందని, చికిత్స కోసం విశాఖపట్నం, లేదా హైదరాబాదు పిచ్చాసుపత్రికి తీసుకెళ్ళమని కొందరు డాక్టర్లు సలహా ఇచ్చారు. దాంతో సుజాత భవిష్యత్తుమీద నాకు దిగులుపుట్టింది. ఒకసారి పిచ్చాసుపత్రికి తీసుకెళ్ళిన పిల్లకు పెళ్ళికాదని భయపడ్డాను. పైగా ఇది అంత ప్రమాదకరమైన జబ్బుకూడా కాదని తోచింది. చాలా వస్తువులు రాత్రిపూట ఆమెకు అందుబాటులో లేకుండా జాగ్రత్తపడ్డాను. సుజాతను నా దగ్గరే పడుకోపెట్టుకొని, రాత్రిపూట లేచినప్పుడల్లా తిరిగి తీసుకొచ్చి పడుకోబెట్టేవాడిని. అలా ఒహటి రెండు సంవత్సరాలు జాగ్రత్తపడేసరికి సుజాతకు ఆ వ్యాధి కూడా తగ్గుముఖం పట్టింది. ఆరు నెలలకో,

మూడు నెలలకో ఓసారి మాత్రమే జరుగుతుండేది. పోను పోను పూర్తిగా తగ్గిపోయింది. పంతొమ్మిదో ఏడు వచ్చేసరికి సుజాతలో యీ వ్యాధి పూర్తిగా తగ్గిపోయినట్టే అనిపించింది. ఈ మూడు నాలుగేళ్ళల్లో — అంటే పెళ్ళి అయేంతవరకూ రెండు మూడుసార్లు మాత్రమే సుజాతలో ఇది మళ్ళీ కన్పించింది. సుజాత పుష్పవతి అయినప్పట్నుంచీ, అంటే పన్నెండో ఏడు వచ్చినప్పట్నుంచి పదిహేడో ఏడు వెళ్ళేవరకు సుజాతలో యీ రుగ్మత చాలా ఉధృతంగా వుంది. ఆమెతో నా బాధలు వర్ణనాతీతం. బయటి ప్రపంచానికి తెలియకుండా వుంచడానికి ఎన్నో అవస్థలు పడ్డాను. ప్రతి సంవత్సరం జిల్లా పరిషత్ ఆఫీసులో లంచం ఇచ్చి ట్రాన్స్ఫర్ చేయించుకునేవాడ్ని. డబ్బులిచ్చి వున్న చోటనే ఉండటానికి మిగతా టీచర్లు ప్రయత్నిస్తుండే వారు. కాని నేను డబ్బు ఇచ్చి బదిలీ చేయించుకోవాల్సివచ్చేది. అలా జిల్లాలో చాలా ఊళ్ళు తిరిగాను. సుజాత కాలేజి చదువుకొచ్చాక ఒకేచోట మూడేళ్ళున్నాను. అక్కడే రిటైరయాను. అప్పటికి సుజాతలో కూడా చాలా మార్పు వచ్చింది. ఆ మూడేళ్ళల్లో ఒహటి రెండుసార్లు యీ వ్యాధి కన్పించినా చుట్టుపక్కలవాళ్ళకు ఎవరికీ తెలియదు. ఓసారి సుజాత బావిలో పారేసిన వస్తువులు దొంగలు చేసిన పనిగా ఇరుగుపొరుగువాళ్ళకు చెప్పాను. పదిమందికీ తెలిసి అల్లరయేలోపలే సుజాతకు, పెళ్ళి చేయడానికి తొందరపడ్డాను. అయినవాళ్ళల్లో సంబంధం చూస్తే యీ రహస్యం ఎప్పటికయినా బయటపడుతుందని భయపడ్డాను. అసలు నా బంధువర్గానికి కూడా చాలా దూరంగా ఉన్నాను. అందువల్లనే సుజాతకు అటు తల్లి తరఫువాళ్ళుగాని, ఇటు నావైపు బంధువులుగానీ ఎవరూ తెలియదు. ఒంటరిగానే బతికింది. కాలేజిలో కూడా ఇద్దరు ముగ్గురు తప్ప స్నేహితులు లేరు సుజాతకు —''

''మీ మాటకు అడ్డొస్తున్నాను. క్షమించాలి. ఏ రకమయిన పరిచయం లేని వ్యక్తికీ, ముక్కూ మొహం తెలియని మనిషికి సుజాతని ఇచ్చి ఎందుకు పెళ్ళి చేశారో నాకు అర్థమయింది. కాని యీ పెళ్ళికి మీ అమ్మాయి ఇష్టపడిందా ? ఆమె ఇష్టంమీదే యీ పెళ్ళి చేశారా ?''

''లేదు. సుజాతకు ఏ మాత్రం ఇష్టంలేదు. నా బలవంతంమీదే ఒప్పుకొంది. ఆమెకు పెళ్ళి చేయలేని నా అసమర్థత, అసహాయత నా బిడ్డ ముందు సిగ్గువిడిచి చెప్పుకొన్నాను. నా నిస్సహాయతే నా బిడ్డమీద కోపానికి కూడా కారణమైంది. ఆ కోపంలో సుజాత ముందు అనకూడని మాటే అన్నాను. తీగలాగితే డొంకంతా కదులుతుంది — అన్నాను. నీ జబ్బు బయటపడితే నీ బ్రతుకే బయట పడుతూందన్న అర్థంలోనే ఆ మాటలన్నాను. సుజాత దాని అంతరార్థం అప్పుడు తెలుసుకొన్నదో లేదో ? తనలో అణిచిపెట్టుకొన్న అయిష్టత మరోరూపంలో బయటపడింది. తెల్లవారుఝామున పడవలో గోదారి దాటి పెళ్ళికి తరలి వెళ్తున్నాం. నది మధ్యలో గోదావరిలోకి నన్ను తోసేసింది. రాదారి పడవ అంచున కూర్చున్న నన్ను అమాంతం నదిలోకి తోసేసింది. ఇన్ని ఏళ్ళుగా సుజాత చేసిందానికంటే దారుణమైనది చేసిందా రోజున! సుజాతకు ఆ క్షణాన నేను కన్నతండ్రి అనేది కూడా తెలిసివుండక పోవచ్చు. పడవవాళ్ళు నదిలోనుంచి లాగి లాంచీలో వేశారు నన్ను. ఆ రోజు గోదావరిలో మునిగి చచ్చిపోయినా బాగుండేది. కాని సుజాత పెళ్ళి ఎక్కడ ఆగిపోతుందేమోనని భయపడ్డాను. ఆ భద్రాద్రి రాముడి దయవల్ల పశుపుతాడుతోనే సుజాత పెళ్ళి జరిగిపోయింది. నిద్రలో తూలి నేనే గోదాట్లో పడినట్లు నలుగురితోనూ చెప్పాను. నగలు — మంగళసూత్రంతో సహా గోదావరి పాలైనాయి. నా అల్లుడు ఇది నమ్మలేదు. తను ఇచ్చిన డబ్బు వాడేసుకొని, గోదావరిలో నగలుపోయినట్టు నాటకం ఆడేననుకున్నాడు. అదే అభిప్రాయం మరో రకంగా — వ్యంగంగా వ్యక్తం చేశాడు. నా తల కొట్టేసినట్టు లజ్జతో కృంగిపోయాను —''

''మీ అమ్మాయి మిమ్మల్ని నదిలోకి తోసివేసిందన్నారు కదా ? అది మీ పట్ల ఆమెకున్న ప్రేమను చూపిస్తుందా లేక మీరంటే ఆమెకున్న అయిష్టతను తెలియచేస్తుందా ?''

''రెండూ కావొచ్చు ! లేక ఏదయినా ఒకటే కారణం కావొచ్చు ! సైకియాట్రిస్టు మీరు. మీరే చెప్పాలి డాక్టర్‌గారూ. మనసు విప్పి అన్నీ మీముందు పెడుతున్నాను. నా బిడ్డను మీరు కాపాడతారనే నమ్మకంతోనే ఇదంతా చెప్తున్నాను. నా సుజాతకు నయమవుతుందా ? నా బిడ్డ మళ్ళీ మామూలు మనిషి అవుతుందా ? దానికి అన్యాయం చేశాను. పాపాత్ముడ్ని...''

''పరబ్రహ్మరావుగారు ఊరుకోండి ! ఇప్పుడు దుఃఖించి ప్రయోజనం ఏముంది ? జరిగిందేదో జరిగిపోయింది. ఇహ జరగవలసింది చూడండి. నాకు చేతనయింది నేను చేస్తున్నాను. మీ సహాయంతో సుజాతకు మానసిక ఆరోగ్యాన్ని కలిగించగలననే నమ్మకం నాకుంది.''

''సహాయమా? సహాయమేమిటి డాక్టరుగారూ? నా ప్రాణాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. నా బిడ్డ కోసం నేనేమయినా చేస్తాను. చెప్పండి! ఏం చేయమంటారు ?''

''నిజం చెప్పండి. చాలు.''


''డాక్టర్ బాబూ !''


''అవును ! నిజం చెప్పండి చాలు ఇప్పుడు నేను అడగబోయే ప్రశ్నలు మీకు ఇబ్బంది కలిగించవచ్చు ! మీ వ్యక్తిగత విషయాల గురించి అడుగుతున్నానని మీరు బాధపడకూడదు. సుజాత మళ్ళీ మామూలు మనిషి కావాలన్నా, సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలన్నా ఇదొక్కటే అవకాశం ! మార్గమూను. ఈ అవకాశం చేయి దాటిపోతే నేను చేయగలిగింది కూడా ఏమీలేదు. అందుకని నా ప్రశ్నలకు మీరు ఉన్నదున్నట్టు, జరిగింది జరిగినట్టు, ఏ అరమరికలు లేకుండా, సూటిగా, ఖచ్చింతా, స్పష్టంగా —''

''డాక్టర్‌బాబూ ! చచ్చినపాముని ఇంకా ఎందుకు కొడ్తారు ? అడగండి.''

''పరబ్రహ్మరావుగారూ! మీ వివాహం అయేసరికి మేరీ మూడు నెలల గర్భవతి. ఆ తర్వాత...''

(ఇంకా వుంది)





ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

కె. జి ఎస్. కె. - కుప్పం

శిల్పకళ, చిత్రకళ ఏ కళ మనల్ని బాగా ఆకర్షిస్తుంది ?

★ నైపుణ్యం అబ్బితే ఏ కళ అయినా చేతిలో రాణిస్తుంది

కవి తన అనుభవాలతోపాటు విమర్శకుని అనుభూతులను కూడా జోడించి రాస్తే ?

★ అయ్యవార్ని చేయబోయి కోతి అయి వూరు కుంటుంది కవి నిరంకుశుడు తోచినది రాయడం అతని లక్షణం.

మనిషి జీవితంలో మార్పు అనేది లేకుంటే ?

★ విసిగి వేసారిపోతాడు

ఎస్. ఎమ్. ఎల్. - నర్సారావు పేట

అమ్మ కన్న అమ్మాయి మిన్న — అవుతుంది. ఎప్పుడు ?

★ వయస్సులో వున్నప్పుడు.

వి. ఎస్. ఆర్. - హైదరాబాదు

అనాదిగా సినిమాలలో మాచింగు కలర్స్ స్త్రీలు వేస్తేనే విమర్శించేవాళ్లం. ఇప్పుడు పురుషులు వేస్తున్నారు ఇవేం మాయ రంగుల రోగం ?

★ అందుకే సాగిపోయే నాగరిక చిహ్నాలను చూసి దడుసుకోవద్దనడం.

డి. డి. వి — దులియజన్

నేను ఒకమ్మాయిని గురించి మానసికంగా చాలా బాధపడుతూంటాను. ప్రేమించిన ఆవిడను మరువలేకుండా వున్నాను. యీ పరిస్థితులలో నేనేం చేయాలి ?

★ బుద్ధారాయడు కాకుండా—ఏదైనా ఉద్యోగం అంటూ వుంటే ఆ పనిలో — దృష్టి నిలపాలి. ఎక్కడగోలో కొత్తగా యువతరాన్ని మానసికగోల పట్టి పీడిస్తున్నట్టుగా తోస్తూంది.

వెంకట్ — ఉరవకొండ

అబల జీవితం పతన మవడానికి కారణం చుట్టూ వున్న పరిసరాలా, వాతావరణమా లేక పురుషులా ?

★ కర్ణుడి చావుకి లాగ 'అబల' జీవిత పతనానికి—కారణాలు అనేకం !

జె. ఎల్. ఎస్. - కొత్తగూడెం

మానసికంగా ఎదగని వాళ్లు. తనని ఆరాధించే వారిని అభిమానించలేనివాళ్లు సిగ్గుతో తలవంచుకు బ్రతకాలి. ఎదుటి వాళ్లను తప్పుపట్టే హక్కు అధికారం వాళ్లకు లేదంటాను ?

★ ఏదో నా గోల అయోమయంగా వుంది సౌమ్యా ! అయినా రోగికి వైద్యం తెలియకపోతే ఎలా—అన్నట్టుంది—నీ సాధింపు !

ఎస్. ఆర్. సిహెచ్. - నిజామాబాదు

నేను ఇంటర్ చదివి ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నాను నాకు తల నెరసినదన్న కారణంగా ఎవరూ పెళ్లి చేసుకోడంలేదు. నేను ముసలివాడిననే మాట మీరు సమర్థిస్తారా ?

★ నాకేం పిచ్చా ? వెర్రా ? తల నెరవడంకాదు ముసలి తనానికి నిదర్శన. మనసు పండడం. నల్ల జుట్టే కావలిస్తే రంగేసుకోవచ్చు. కాని మనసు ముసలిదైతే—రంగు పట్టదు. అది జ్ఞాపకం వుంచుకోండి

విజేంద్ర. — ఆదోని

మీకు ఎటువంటి సాహిత్యం అంటే యిష్టం ?

★ నేను ఏదైనా చదివేస్తాను. మంచిదని అంతా అంటే ఎందుకు మంచిదో అనీ, చెడు అని అంటే ఎందుకు చెడు అంటున్నారోననీ—చదివేస్తాను. కొంచెం దెయ్యాలు, భూతాలు, చేతబళ్లు పెట్టుబళ్లు, బలులు మొదలైనవే అరాయించుకోలేను !

ఎల్. వి. ఆర్. — ఖర్గపూరు

నా ఫ్రెండు దెయ్యాలు లేవు అంటున్నాడు. నేను దెయ్యాలు ఉన్నాయి అంటున్నాను యిందులో మీ మాట ఏమటి ?

★ ఈ మీ కార్డు నా కందింది అంటే — దెయ్యం వున్నట్టే లెక్క కద !

ఎస్. డి. ఎస్. — కర్నూలు


మనసు ఇచ్చిపుచ్చుకోవడం ప్రేమైతే మరి దోచుకోవడం ఏమవుతుంది ?

★ పెళ్లి !!

ఎల్. జి. వి. — గౌడవల్లి

ప్రేమ, సంసారం వాటితోనేనా మనిషి జీవితం ?

★ కాదు మానవ జీవితంలో ఇవి ముఖ్య భాగాలే గాని మానవ జీవిత సర్వస్వం కాదు ! స్వంతం మినహాయించి మనిషి జీవితంలో నల్గురికీ పనికి వచ్చేవీ, తనకు తృప్తి నిచ్చేవీ చాలా చేయవచ్చును, ఎంత సేపూ తనూ, తన అవసరాలూ, తనవాళ్లూ అనుకునే వ్యక్తి చాలా త్వరగా నిరుత్సాహి అవుతాడు; అలసిన హృదయాలకి సేద తీర్చుకొనే అవకాశం కల్పించడం, చేయూత అవసరమైన అసహాయునికి బాసటగా నిలబడడం—ఇవన్నీ మనిషి అలవరచుకోవాలి చిన్నతనంనుంచీ పిల్లలకీ—తనను దాటి ఆలోచించడం నేర్పించాలి.





మీ నూతన గృహానికి పాతకాలపు ఆయిల్-బౌండ్ డిస్టెంపరా?



బ్రిటిష్ పెయింట్స్ వైనల్ తెచ్చుకోండి మీ ఇంటి గోడల చేత శుభం లాభం పలికించండి

మీ నూతన
గృహము, నూతన
సంవత్సరం, కుటుంబంలో ఒక కొత్త పెళ్లి
కూతురు—వీరు క్రొత్తవిగా జరిపించనున్న
తరుణంలో పాత సొగసులోవున్న
ఆయిల్-బౌండ్ డిస్టెంపర్ మీకు యిక
అవసరం లేదు అనుకుంటారు
కదా ! మీ గోడలకు వైనల్ తో
అందాన్ని యివ్వండి—ఆకర్షణీయమైన
అందాలతో తొణికిసలాడే వాటిని చూసి
ఆనందించండి వైనల్ మీ గోడలకు నున్నటి
ఫినిష్ ఇస్తుంది, ఖరీదైనవిగా కన్పించేలా
చేస్తుంది—మును పెన్నడూ లేనంతగా
వైనల్ వల్ల మరెన్నో
ప్రత్యేక ప్రయోజనాలు
కూడా—ఏ ఆయిల్-బౌండ్ డిస్టెంపరూ పోటీ
పడలేనివి! ఇవన్నీ అదనపు ఖర్చేమీ లేకుండానే.



వైనల్‌ని ఏ ఆయిల్-బౌండ్ డిస్టెంపర్‌తోనైనా పోల్చి చూడండి. ప్రతి విషయంలోనూ అతి శ్రేష్ఠమైనది వైనల్.

	వైనల్	ఆయిల్-బౌండ్ డిస్టెంపర్
ఫినిష్	చక్కటిది, నున్నటిది	[illegible]
ఆరడానికి పట్టే సమయం	4 గంటలు	12 గంటలు
వాసన	ఇంపైనది	భరించలేనిది
కడుక్కొనేందుకు	ఎంతో వీలైనది	వీలుగా వుండదు
రంగు నిలిచి వుండటం	దివ్యం	[illegible]
మన్నిక	ఎక్కువ	తక్కువ
వెచ్చం	—[illegible]—	

.అన్నిటికీ మించిన విషయం. 5 కిలోల ఆయిల్-బౌండ్ డిస్టెంపర్ కావలసివచ్చే విస్తీర్ణానికి, కేవలం 2 లీటర్ల వైనల్ చాలు !


బ్రిటిష్ పెయింట్స్ వైనల్

ఆనందప్రదమైన తరుణంలో విశిష్టమైన పెయింట్

LINTAS(C)/VNL/67/2317 TL

విజేత

ముద్దంశెట్టి హనుమంతరావు



ఆ రహదారి బంగళా, వూరికి రెండు ఫర్లాంగుల దూరంలో వుంది. అక్కడి వాతావరణం నిశ్శబ్దంగా వుంటుంది.

అక్కడ చౌకీదారు గోవిందు. గత ఇరవై యేళ్ళనించీ అక్కడే వుంటున్నాడు.

మాజీ ఎమ్మెల్లే వరహాలరాజు ధర్మమాఅంటూ గోవిందుకి ఆ వుద్యోగం దొరికింది. ఇచ్చే జీతం, గొర్రెతోకలాంటిదే అయినా, బంగ్లా వెనుక భాగంలో అతనుండడానికి యేర్పరచిన ఇల్లు ఎంతో సౌకర్యంగా తోచిందతనికి. అక్కడికి వచ్చి,పోయే ఆఫీసర్లు, అప్పుడప్పుడూ వస్తూండే రాజకీయ నాయకులు, గోవిందుకి తృణమో, పణమో ముట్టజెప్తూ వుంటారు. ఆ టిప్పులే, యే యిబ్బంది లేకుండా అతడ్ని ఆదుకుంటున్నాయి. అటువంటి వుద్యోగాన్ని తనకిప్పించిన వరహాలరాజన్నా, అతని కుటుంబ సభ్యులన్నా, గోవిందుకి యెనలేని గౌరవం, పూజ్యభావం వున్నాయంటే ఆశ్చర్య పడాల్సిందేమీలేదు.

*   *   *

సాయంత్రం ఆరు గంటలు కావస్తోంది. దూరంలో మోటారు సైకిలు శబ్దం విన్పించి గేటు దగ్గరకొచ్చాడు గోవిందు.

మోటారు సైకిలు రానే వచ్చింది. వచ్చిన వాడు వరహాలరాజు సుపుత్రుడు, బుచ్చిబాబు.

"దండాలండీ సినబాబుగారు" సవినయంగా అన్నాడు, గోవిందు, రెండు చేతులూ జోడించి.

"బావున్నావా గోవిందూ" కుశల ప్రశ్నవేశాడు బుచ్చిబాబు.

"తవరి దయవల్ల బాగానే వున్నాము బాబు." నమ్రతగా జవాబిచ్చాడు గోవిందు. "రండి లోపలికి ." అంటూ గేటు తీశాడు.

"ఇప్పుడు కాదులే... ఇవ్వాళ యెవరూ లోపల లేరుకదూ."

"లేరు బాబూ! ఏం?"

"పట్నం నుంచి స్నేహితులొస్తున్నారోయ్. ఈ రాత్రికి మేం యిక్కడే వుండాలనుకొంటున్నాం. అందుకనే ముందుగా తెలుసుకుందామని వచ్చాను." అన్నాడు బుచ్చిబాబు.

గోవిందు, కాదనలేక పోయాడు.

"అట్టాగే రండిబాబు; తవఁరిని కాదంటానా"

"సరే వస్తానయితే..." తృప్తిగా మోటారు సైకిల్ని వెనక్కి తిప్పి సాగిపోయాడు, బుచ్చిబాబు.

గోవిందు, గేటు దగ్గరగా వేసుకుని, లోపలికి వచ్చేశాడు.

*   *   *

రాత్రి ఎనిమిదిన్నర దాటిందప్పుడే. గోవిందు చుట్ట కాల్చుకుంటూ బంగళా వీధి మెట్లమీద కూచున్నాడు. ఏదో మోటారు సైకిలు వస్తూండటం చూచి లేచి నుంచున్నాడు.

బుచ్చిబాబు మోటారు సైకిలు వచ్చి ఆగింది. గోవిందు గేటు తెరిచాడు. మోటారు సైకిలు లోపలికొచ్చింది. బుచ్చిబాబుతో పాటు స్నేహితులెవరూ రాలేదుగాని, ఓ స్నేహితురాలు మాత్రమే రావడం, గోవిందుని ఆశ్చర్యంలో ముంచింది. "స్నేహితులొస్తారని సెప్పారుబాబు ? ఏరీ ?" మెల్లగా ప్రశ్నించాడు, గోవిందు. ఈ సారి అతని మాటల్లో యెదుట వ్యక్తిపట్ల గౌరవం సన్నగిల్లినట్టయింది. కళ్ళల్లో యేహ్యభావం, కాస్తంత కోపం, యెర్రపారల్ని సృష్టించడం, బుచ్చిబాబు చూళ్లేదు.

గోవిందు ప్రశ్నకి, బుచ్చిబాబు తేలికగా ఓ చిరునవ్వు నవ్వేడు.

"స్నేహితులంటే అబ్బాయిలేనన్న మాటేమిటి? అమ్మాయిలు కూడా కావొచ్చు. సమయానుకూలంగా మనం అర్థాలు మార్చుకోవాలి. కదూ కవితా ?" తన వెంటనున్న అమ్మాయికేసి చిలిపిగా చూస్తూ అన్నాడు.

కవిత సమాధానం చెప్పలేదు. మొహం దించుకుంది. అక్కడే నిల్చోబెట్టి మాట్లాడ్డం, ఆమెకి యిబ్బెట్టుగాను, యిబ్బందిగాను తోచిందేమో మరి—మాట్లాడలేక పోయింది.

"సర్లే గోవిందూ; అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం. ముందు తలుపు తెరువ్." అధికార పూర్వకంగా అన్నాడు బుచ్చిబాబు.

గోవిందు ఆలోచనల్లో పడ్డాడు. అతని మెదడు చురుగ్గా పన్జేసింది. అతడిలోని మానవత్వం మేల్కొంది. ఒక స్త్రీ—ఆమె ఎవరైనా కావొచ్చు. . ఆమె జీవితంతో చెలగాట మాడ్డానికి బుచ్చిబాబు పూనుకుంటున్నందుకు, అదీ—తాను చౌకీదారుగా వుంటున్న ఈ రహదారి బంగళాలో ఆ అన్యాయానికి తలపెడుతున్నందుకు, బుచ్చిబాబుపట్ల వల్లమాలిన జుగుప్స యేర్పడింది, గోవిందుకి. ఆమె బజారు మనిషే కావొచ్చు... గొప్పింటి బిడ్డే కావొచ్చు. ఏమైనా ఈ అన్యాయంలో తాను భాగస్వామి కాకూడదు. అంతేకాదు... ఒకసారి యిటువంటి అవకాశానికి తావిస్తే, యిదే అలవాటుగానూ మారిపోవచ్చు. పైగా యిక్కడ యే అఘాయిత్యం జరిగినా, తనకి పీకల మీదికొస్తుంది. ఇటీవల యిటువంటి సంఘటనలు యెన్ని వింటున్నాడు, తాను? బుచ్చిబాబు వరహాలరాజు గారబ్బాయే కావొచ్చు కాని, తన వుద్యోగ ధర్మానికి మచ్చరాకూడదు.... యిలా ఆలోచిస్తుంటే గోవిందులో కొత్త చైతన్యం రేకెత్తింది.

బుచ్చిబాబు మోటారు సైకిల్ని షెడ్డులోకి తీసుకుపోతుంటే కంగారుపడ్డాడు గోవిందు.

"ఆగండి సినబాబు గారు; దయసేసి తిరిగెళ్లిపోండి బాబూ; మరేవీ అనుకోకండి." ప్రాధేయ పూర్వకంగా అన్నాడు గోవిందు. ఆ మాటలనడానికి యెంతో ధైర్యం కూడదీసుకోవాల్సి వచ్చిందతనికి.

తన పక్కనే పిడుగు పడ్డట్లయ్యింది, బుచ్చిబాబుకి. స్థాణువైపోయాడు అతనికి క్షణం పాటు నోటమాట రాలేదు. తమ దయా దాక్షిణ్యాలపై జీవిస్తున్న గోవిందుకి యింత పొగరా ? తననే కాదంటాడా ? అదీ తన ప్రియురాలి సమక్షంలో తనకి తలవంపా?... కోపంతో వణికిపోయాడు బుచ్చిబాబు. మోటారు సైకిల్ని స్టాండువేసి నిలబెట్టి దగ్గరగా వచ్చాడు.

"గోవిందూ! ఏవిటి నీ పొగరు ? వొళ్ళు కొవ్వెక్కిందా ? నన్నే ఎదిరిస్తున్నావా ?" సుమారు గర్జించాడు, బుచ్చిబాబు.

"చమించండి బాబుగారు; యెదిరించనేదండీ; నా వుద్యోగానికి నాయం సెయ్యాలకదా బాబూ! ఈ రోజు తవఁరొచ్చినారు. రేపు మరోరు రావచ్చు. ఇది అలవాటుగా మారిపోద్దని నా బయం బాబూ; రోజులు సూత్తంటే బాగాలేవు. ఎప్పుడేమవుద్దో తెలీదు. ఈ యిసయం ఆ పెద్దబాబుగారికి తెలిసినాదంటే, యింకేమన్నా వుందా! పిల్లలు గలవాణ్ణి నాకే అపవాదూ రానివ్వకండి బాబూ;" రెండు చేతులు జోడించి, సవినయంగా అన్నాడు గోవిందు.

బుచ్చిబాబు ఉక్రోషం పరాకాష్ఠ నందుకుంది.

"రాస్కెల్! నువ్వు నాకు నీతులు చెప్పేవాడివట్రా?" గోవిందు చెంప ఛెళ్ళుమంది.

గోవిందు తల్చుకుంటే, తిరగబడి బుచ్చిబాబుని చిత్తుచేసేవాడే; కాని, తన వునికి తెలుసుకుని, రాతిబొమ్మే అయ్యాడు. చెంప తడుముకున్నాడు.

"పోన్లెండి బాబూ; తవఁరు కొట్టినందుకు నానేం బాధపడ్లేదు. తవఁరు సెయ్యిసేసుకున్నారని, నాన్న గారికే చెప్పను. కాని, తవఁరీ తప్పు తోవనించి తప్పుకోండి బాబూ; ఇటువంటి పనులు అచ్చిరావు."

బుచ్చిబాబు కోపం యెలా వున్నా, కవితకి అవమానంతోపాటు, గోవిందుమీద కసి యేర్పడింది. ఈ అణాకానీ వెధవ తమనిలా అవమానింటుతాడా అన్న కసి అది. "వీణ్ణి యేంచేసినా పాపంలేదు డియర్! పిట్టకొంచెం కూతఘనంగా వుంది. మన ఖర్మగాపోతే వీడిచేత చెప్పించుకోవడమా ?" అంది రుసరుసలాడుతూ.

అగ్నిమీద ఆజ్యం పోసినట్లుగా ఆ మాటలు బుచ్చిబాబుపై పనిచేశాయి. అతని ఆవేశం కట్టలు తెగి ప్రవహించింది.

"ఒరేయ్ గోవిందూ .." అని మీదికి పోబోతున్నంతలో జీపు హారన్ దూరంలో విన్పించింది, బుచ్చిబాబుకి.

మంత్రముగ్ధుడిలా ఆగిపోయాడు. ఏదో జీపు వస్తూండటం చూశాడు. వుపేక్షించకుండా యాంత్రికంగా మోటారు సైకిలు మీద కూచుని స్టార్ట్ చేశాడు.

"వీడి పని తర్వాత పడ్తాను. నువ్వు కూచో డియర్..." అన్నాడు కంగారుగా.

కవిత వెనుక సీట్లో కూచుంది.

"ఒరేయ్ గోవిందూ! నీ పొగరు తర్వాత అణుస్తా.." హుంకరిస్తూ, మోటారు సైకిల్ని జీపు వస్తున్న త్రోవ గాక మరోవేపు పోనిచ్చాడు బుచ్చిబాబు.

గోవిందు నవ్వుకున్నాడు తనలో తానే. తానో మంచిపని చేసిన తృప్తి అతనిలో నిండుకుంది.

అప్పుడే జీపు వచ్చి ఆగింది. అందులోంచి వరహాలరాజు, అసిస్టెంట్ ఇంజనీరు హయగ్రీవాచారి దిగారు. తాను నిజంగా అదృష్టవంతుడే ననుకున్నాడు గోవిందు. అదృష్టమే తన పక్షాన లేకపోతే, ఈ రోజు కొద్ది క్షణాలముందు వచ్చిన బుచ్చిబాబు, ఆ అమ్మాయి యిక్కడుంటే యేంజరిగి వుండేదో! ఒక్కసారి వూహించుకున్నాడు. అతనికి కళ్ళుతిరిగినట్టయ్యింది.

"దండాలు బాబయ్యా" వచ్చిన ఆ యిద్దర్నీ ఉద్దేశించి సవినయంగా అన్నాడు, గోవిందు.


"ఎవరైనా వున్నారేవిట్రా?" ప్రశ్నించాడు, వరహాలరాజు


"లేరుబాబూ; తవఁరు దయసెయ్యండి" సవినయంగా ఆహ్వానిస్తూ, పోయి తలుపులు తెరిచాడు గోవిందు.


వాళ్ళిద్దరూ లోపలికి నడిచారు

హయగ్రీవాచారి బాత్‌రూమ్‌కి వెళ్ళినతరుణంలో బుచ్చిబాబు వచ్చిన విషయాన్ని వివరంగా చెప్పాడు, గోవిందు వరహాలరాజుతో. ఎంతో ఆలోచించిన మీదట, ఆ పని చేశాడు

వరహాలరాజు నిర్ఘాంత పోయాడు గోవిందు కేసి రెప్పవెయ్యకుండా క్షణంసేపు చూస్తూ వుండిపోయాడు. ఏవిటి తాను వింటున్నది? తన కొడుకు ఇలా మారిపోయాడా? వాడే గనక ఇప్పుడు తన ప్రియురాలితో యిక్కడ అగుపించివుంటే, హయ







ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

మాధవ పూజ - మానవ తృప్తి

భగవంతుని సృష్టి అంతా మానవుల సుఖ జీవనానికి ఉపయోగించేదే! మానవులు తృప్తి పడితే మాధవుడు తనకు పూజ చేసినట్లు సంతోషిస్తాడని గ్రహించాలి. అందువల్ల మానవుని తృప్తి భగవంతుని పూజతో సమానమే!

మహా భక్తుడైన ఒక గృహస్థుడు తాను ప్రాతఃకాల పూజ చెయ్యబోతూ కుమారుణ్ణి పిలిచి, ఒక రూపాయి చేతికిచ్చి "నాయనా! నేను స్నానం చేసి పూజకు కూర్చుంటాను. నువ్వు అంగడికి పోయి మంచి అరటిపళ్లు యీ రూపాయికి తీసుకుని రా" అని చెప్పి పంపాడు. ఆ బాలుడు చాలా బుద్ధిమంతుడు. భగవద్భక్తితోపాటు తండ్రియందు చాలా భక్తి ఉన్నవాడు. ఆ పిల్లవాడు అంగడికి పోయి మేలైన అరటిపళ్లు కొని ఇంటికి వస్తూవుండగా మార్గంలో ఒక చిన్నపిల్లవాడు, ఒక స్త్రీ కనబడ్డారు. వారు బాగా బక్కచిక్కి, ఆకలితో మిక్కిలి బాధపడుతున్నట్లు అతనికి తోచింది. అడుగు తీసి అడుగు పెట్టలేకపోతున్నారు. పళ్లు తెస్తూవున్న వ్యక్తికి కొంత జాలి కలిగింది. అయినా, ఆలస్యమయిపోతుందేమో అని ఏమీ చెయ్యలేక ముందుకు పోసాగాడు. ఆ బాలుడు "బాబూ! ఒక పండియ్యండి" అని వెంట పడ్డాడు. ఆ బాలుణ్ణి వెనక్కు తీసుకురావాలని ఆ స్త్రీ — ఆ బాలుని తల్లి — వానివెంట పరిగెత్తి నేలపై పడిపోయింది. పిల్లవాడూ నేల కూలబడ్డాడు. అప్పుడా వ్యక్తి వెనక్కుతిరిగి, ఆ బాలుడికీ, వాని తల్లికీ రెండు పళ్లు ఇచ్చాడు. వాళ్లు ఆతురతతో వాటిని తింటూవుంటే మరికొన్ని పళ్లు ఇచ్చాడు. క్రమంగా పళ్లన్నీ అయిపోయాయి. వాళ్లు తృప్తిపడి దారిప్రక్క వున్న ఒక చెట్టు క్రిందకు పోయి విశ్రాంతి తీసుకున్నారు.

ఉత్తచేతులతో కొడుకు తండ్రి దగ్గరకు వచ్చాడు. పూజలో కూర్చున్న తండ్రి "ఏవీ పళ్లు?" అని ప్రశ్నార్థసూచకంగా చూడగా, అతడు జరిగినదంతా మెల్లగా చెప్పాడు. తండ్రి "నాయనా! మంచి పని చేశావు. ఆకలితో వున్న వాళ్లని తృప్తిపరచడమే భగవత్సేవ! భగవత్పూజ. తనకు నైవేద్యం పెట్టకపోయినా; తన సృష్టిలోని మానవులు తృప్తిపడడమే దేవుడు కోరేది. ఆయనకు హృదయపూర్వకమైన ధ్యానమే చాలు" అన్నాడు. పుత్రుడు సత్ఫలాలు తెచ్చినందుకు ఆయన ఎంతో సంతోషించాడు.'

విజేత

గ్రీవాచారి దృష్టిలో తన పరువు ప్రతిష్టలు యెంతగా దిగజారిపోను; వాణ్ణి జులాయి మనిషిగా ఆయన గుర్తిస్తే, యింక తనగౌరవం ఏముండేది? .. యిలా ఆలోచిస్తే అతనికి మతిపోయినట్టయ్యింది.

వరహాలరాజు అంత తీవ్రంగా యోచిస్తుంటే, ఒక పక్క గోవిందుకీ మతిపోయింది. భయం ఆవహించింది. కొడుకుని సమర్థించి, తనకే చీవాట్లు పెడతారేమోనని వాడి భయం. ఆతృతతో ఆయన కేసి చూశాడు, గోవిందు.

"గోవిందూ! నువ్వు చాలా మంచిపని చేశావురా: ఈరోజు నా పరువుప్రతిష్టల్ని కాపాడావు. వాడేదో వాగినందుకు, నిన్ను చెయ్యిచేసుకున్నందుకు, నేనెంతో విచారిస్తున్నాను. నువ్వేం అనుకోకు, నువ్వేం భయపడకు," అని వరహాలరాజు అంటుంటే గోవిందు హృదయం ఆనందంతో గంతులేసింది. వరహాలరాజు గారు యెంత దొడ్డ మనిషి; ఇటువంటి వ్యక్తులు యెంతమంది వుంటారు? అనుకున్నాడు.

"నానేం అనుకోవడంనేదు బాబుగారు, తమరికి సెప్పడం మంచిదని సెప్పినాను, అంతే"

"సర్లే! మావాడు ఈ పరిసరాలకి రాకుండా కట్టుదిట్టం చేస్తాలే. వాడిచేత నీకు క్షమాపణ చెప్పిస్తాను. అప్పుడుగాని వెధవకి బుద్ధిరాదు."

"క్షమాపణెందుకులెండి బాబుగారూ, తమరి కాళ్ళకింద బతుకుతున్నోడ్ని." కంగారుగా అన్నాడు గోవిందు.

"అయినా సరే, నువ్వూరుకోరా; పొరపాటు నయినా ఈ మాట ఎవ్వరితోనూ చెప్పకేం?"

"ఎంతమాట బాబుగారూ! యిటువంటి పొరపాటు యెప్పుడూ సెయ్యను బాబయ్యా!"

"ఇంక అవు, ఇంజనీరుగారు వస్తున్నారు." అని టాపిక్ మార్చాడు, వరహాలరాజు.

గోవిందు అక్కణ్ణించి జారుకున్నాడు, మిగతా యేర్పాట్లు చెయ్యడానికి.

* * *

మరునాడు వుదయం పదిగంటలు కావస్తోంది. గోవిందు పక్కల మీది దుప్పట్లు దులిపి వేస్తున్నాడు.

"ఏంరా గోవిందూ ఏంచేస్తున్నావ్?" అంటూ లోపలికి వచ్చాడు వరహాలరాజు. అతని వెంట బుచ్చిబాబు కూడా వున్నాడు.

"తమరా బాబుగారూ; కూసోండి" అంటూ కుర్చీలు తెచ్చి వేశాడు, గోవిందు. "కూసోండి సిన బాబూ.." బుచ్చిబాబుని వుద్దేశించి అన్నాడు.

బుచ్చిబాబు మొహంలో కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు. చాలా యిబ్బందిగానే కూచున్నాడు.

"వూఁ... చెప్పరా క్షమించమని..." అన్నాడు, వరహాలరాజు కొడుకుని వుద్దేశించి.

గోవిందుకి విషయం అర్థమై పోయింది. కంగారుపడిపోయారు.

"వద్దు బాబుగారూ; నామీదొట్టు. ఏదో సిన బాబుగారు సిన్నతనంకొద్దీ కొట్టారు. పోన్లెండి బాబయ్యా," అన్నాడు గోవిందు.

అయినా, వరహాలరాజు వూరుకోలేదు. "నువ్వూరుకో గోవిందూ! చేసిన తప్పు సరిదిద్దుకోవాలంటే క్షమాపణ చెప్పుకోవడం చాలా అవసరం. వూఁ... చెప్పరా..." కొడుక్కేసి తీక్ష్ణంగా చూస్తూ అన్నాడు.

బుచ్చిబాబుకి వేరే మార్గం లేకపోయింది. గుటకలు మింగడం ప్రారంభించాడు.

"తప్పయ్యింది క్షమించు గోవిందూ!" అన్నాడు మొహం దించుకునే.


"సాల్లేబాబూ; నాకే సిగ్గేత్తంది." రెండు చేతులూ జోడించి వినయపూర్వకంగా అన్నాడు, గోవిందు యెంతో బాధపడుతూ.

"ఆ సిగ్గు వీడకుండాలిరా గోవిందూ! చదువుకోగానే సంబరం కాదు, సంస్కారం అలవడాలి. వస్తామరి," అంటూ కదిలాడు వరహాలరాజు. బుచ్చిబాబు తండ్రి వెంట నడిచాడు.

గోవిందు మనసు చివుక్కుమంది. కాని, యేం చెయ్యగలడు? ఎంతవద్దని తాను మొర పెట్టుకున్నా క్షమాపణ చెప్పించడానికే నిర్ణయం తీసుకున్న పెద్ద బాబుగార్ని యెవరాపగలరు? ఆయనలాంటి వ్యక్తులు యేకొద్దిమంది వున్నా, తనలాంటి పేదోళ్ళ బతుకులకి యెప్పుడూ న్యాయమే వరిస్తుంది. కాని, అటువంటి వ్యక్తులు యెంతమంది వున్నారని...? భారంగా నిట్టూర్పు విడుస్తూ తనలోతానే అనుకున్నాడు గోవిందు.

* * *

ఆరోజు నుంచి బుచ్చిబాబు ఆ రహదారి బంగళాకి రానేలేదు. అంతేకాదు—అతని ప్రవర్తనలోనే యెంతో మార్పువచ్చింది. గోవిందు యెక్కడ కనిపించినా యెంతో ఆప్యాయంగా పలుకరిస్తాడు. జులాయి తిరుగుళ్ళు అతనిలో అంతరించాయని అందరూ చెప్పుకుంటుంటే, ఆ మార్పులో తనకీ భాగం వుందని, గోవిందు అమితంగా మురిసి పోతూ వుంటాడు. ఆరోజే గనక తానలా ప్రవర్తించి వుండకపోతే బుచ్చిబాబు బ్రతుకే మరోలా వుండేదేమోనని తృప్తిగా అనుకుంటాడు, గోవిందు. అది ఒక విధంగా తన విజయమేనని భావించడంలో అతిశయోక్తి కాదేమో!?



"వెళ్ళిపోతున్నావేం రామం?"

"కొంచెం పనుందోయ్...;

"పోనీ రెండాట లేసి మానేద్దాం."

"అబ్బే...చాలా అర్జంటు పనుందోయ్. సారీ మీరు వేసుకోండి" అంటూ వచ్చేశాడు రామం.

ప్రతిరోజూ ఆఫీసయ్యాక ఆఫీసులోనే సహోద్యోగులతో పేకాట ఆడటం అలవాటు రామానికి. కానివాళ జేబులో లక్ష్మీదేవి గలగలలు లేకపోవడంతో ఎలాగోలా మిత్రుల కంటబడకుండా జారుకుందామని ప్రయత్నించినా, వాళ్ళ కళ్ళల్లో పడేసరికి సంజాయిషీ ఇచ్చుకోక తప్పలేదు.

అలవాటుకి బ్రేక్ పడిందన్నది ఒక బాధ అయితే తన వెనుక తన పేకాట మిత్రులు తన మీదెన్ని జోకులు పేల్చి నవ్వుకుంటున్నారా? అన్నదింకో బాధ అయి కూర్చోవడంతో విపరీతంగా ఫీలవుతూ నడుస్తున్నాడు.

ఇటువంటప్పుడు బంగారంవుంటే ఆదుకున్ను. కాని అత్తవారిచ్చిన వుంగరం ఎప్పుడో తాకట్టుకీ ఆ పిమ్మట అమ్మకానికీ వెళ్ళిపోయింది. భార్యగాజులు తాకట్టు పెడదామని తెలిసిన మార్వాడీ దగ్గరికెళ్తే "పాత అప్పుకి హామీ ఇది" అంటూ లాక్కున్నాడు. చేతి వాచీని పేకాట్లో పడ్డ బాకీక్రింద అతడి పేకాట ఫ్రెండ్ తీసేసుకున్నాడు, ఆ డబ్బులిచ్చేక భద్రంగా తిరిగిచ్చేస్తానంటూ.

ఇంక తాకట్టు పెట్టగల వస్తువులేం లేవు ఇంట్లో గాని, తన దగ్గర గాని. జీతం వచ్చి నాల్రోజులే అయినా అదంతా 'హుష్ కాకీ' అయిపోయింది. క్రితం నెలలో పేకాట 'అరువు'కి ఆడటంతో జీతాల రోజున ఆ అరువు ఇచ్చిన వాళ్ళంతా లాక్కుపోయారు జీతాన్ని. దాంతో కిరాణా కొట్లో పాత బాకీ చెల్లించలేకపోయాడు. అది చెల్లిస్తే గాని మళ్ళీ అరువివనని భీష్మించుకుని కూర్చోవడంతో ఇంట్లోకి ఒక్క సరుకూ తేలేకపోయాడు. వెధవది సరుకుల్లేకపోతే పోయే పేకాటకి పైసల్లేకుండా పోయాయిగదా! ముక్కలు త్రిప్పటం అలవాటైన చేతుల్ని కట్టేసినట్టుగా వుంది. ఏదోలావుంది. మళ్ళీ జీతాలు రావాలంటే ఇరవై ఆర్రోజులు గడవాలి, ఖర్మ!

అసహనంగా, అవమానంగా, విసుగ్గా, చిరాగ్గా, కోపంగా, నీరసంగా వుంది రామానికి. "ఆఫ్టాల్ పదిరూపాయల్లేక ఫ్రెండ్స్‌ముందు ఇన్సల్ట్ అవ్వాల్చొచ్చింది. నిజానిగా హారిబుల్! పదిగాకపోయినా కనీసం అయిదువున్నా ఈపాటికి నాలుగాట లాటలాడేవాడు. రెండాటలైనా కొట్టేవాడు...స్టార్ తిరగాలి గాని ఒక్కరోజులో బాకీలన్నీ తీర్చి తాకట్లు విడిపించెయ్యడూ? ప్చ్...చేతిలో చిల్లిగవ్వ కూడా లేకుండా పోయింది సమయానికి... అనుకుంటూ రోడ్డుమీద కన్పించిన రాళ్ళని కసిగా తన్నుకొంటూ నడవసాగాడు.

తను పోర్షన్ వైపెళ్తోంటే ఓ కుక్క అడ్డొచ్చింది. పెడీమని తన్నాడు. అది వెనుతిరిగి భయంకరంగా మొరిగింది. దాంతో మరీ రెచ్చిపోయి మళ్ళీ కాలెత్తాడు గాని అది కాళ్ళకి బుద్ధి చెప్పింది.

"ఉమా"...బూట్లు తీస్తూ పిల్చాడు పెరటివేపునున్న భార్యని.

భార్య రాకపోయేసరికి వుగ్రుడైపోతూ "ఉమా" అంటూ అరిచాడు ఇల్లు అదిరేలా.

ఆమె పరుగెత్తుకొచ్చింది.

"ఏం జేస్తున్నవే? ఎన్నిసార్లు పిలవాలి?"

"విన్పించలేదండీ" భయపడుతూనే అంది.

"విన్పించలేదూ? అవున్లే. మొగుడనేవాడు ఆఫీసునుంచి అలసి వస్తాడన్న ధ్యాస వుండేడిస్తేగా అనుకోడానికీ! అలా దిష్టిబొమ్మలా నిలబడి చూడకపోతే కాసిని టీ నీళ్ళు నా మొఖాన పొయ్యకూడదూ?"

"టీపొడి..." నసిగిందామె.

"లేదంటావ్? అంతకంటే ఏమంటావులే. ఎక్కడలేని దరిద్రమంతా నీ దగ్గరే వుంటుంది. ఇంకా అలా నిలుచునే వున్నావేం కాసిని నీళ్ళన్నా తగలెయ్."

ఆమె పరుగున తెచ్చిచ్చింది.

ఖాళీ గ్లాసు ఆమె కందిస్తూ ఆమెనీ, ఆమె కట్టుకున్న చీరనీ చూశాడు విసుగ్గా.

మొహం జిడ్డుగా వుంది. బొట్టు సగం చెరిగింది. అక్కడక్కడా చిరగ్గా కుట్టిందేమో కాస్త ఎబ్బెట్టుగా వుంది చీర. మనిషి నీరసంగా లంఖణాలు చేస్తోందాన్లా వుంది!

"ఆ వాలకం ఏమిటే? వెళ్ళి మొఖం కడుక్కో" చిరాకు పడ్డాడు.

ఆమె మొఖం చిన్నబుచ్చుకు వెళ్ళిపోయింది తప్ప తనకి ఒంట్లో బావుండలేదన్న సంగతి బయట పెట్టలేదా ఇల్లాలు!

మంచంమీద వెల్లకిలా పడుకున్నాడు రామం.

ఇప్పుడు డబ్బు కావాలి. డబ్బు లేకపోతే ఇంట్లోనూ తన ఒంట్లోనూ కూడా వుత్సాహమే వుండదు. వుత్సాహం లేకపోవడమే కాదు వూపిరాడనట్టుగా వుంటుంది కూడామా! ఎప్పుడో పెద్ద స్టేక్‌తో పేకాడినప్పుడు చెయ్యి తిరగాలీ, అదృష్టం కలిసి రావాలీ, దెబ్బతో తన దరిద్రం తీరిపోద్ది. అద్సరే ఇప్పటి సంగతి...ఎంతో కొంత అర్జంటుగా సంపాదించాలి ఎలా?

ఆలోచనలు తెమలటం లేదుగాని ఇంతలో స్కూల్నుంచి పిల్లలొచ్చి అల్లరి చెయ్యసాగారు. ఇదే అదినను కుని చంటోడు అరున్నొక్క రాగం అందుకున్నాడు.

వ్యసనం

"ఒరేయ్. నోర్మూసుక్కూర్చుంటారా నీవు విమానం మోత మోగించనా ? ఉమా—ఆ చంటోడు ఇందాకట్నుంచి ఏడుస్తోంటే విన్పించడంలేదూ? అబ్బా! ఇది ఇల్లు కాదు నరకంరా బాబూ..."

వంట చేస్తోందల్లా గబుక్కునొచ్చి పిల్లల్ని వీధిలో కెళ్ళి ఆడుకోమని చెప్పి పంపి, చంటోడ్ని ఎత్తుకుని కళ్ళు తుడుచుకుంటూ వంటింట్లోకెళ్ళి పోయింది ఉమ.

"ఇంట్లో కూర్చుంటే డబ్బెలా వస్తుంది గానీ అలా వూళ్ళోకెళితే ఏ అప్పిచ్చే అప్పారావో దొరకొచ్చు" అనుకుని లేచాడు

"బజారు కెళ్తున్నారాండీ" భర్త బట్టలు తొడుక్కొంటోంటే అడిగింది ఉమ.

". .వూఁ—ఏం?"

"చంటోడికి పాలడబ్బా .."

"వాడికి పాలడబ్బాలు, నీకు చీరెలు, సారెలు, కిరాణా సరుకులు! ఇవన్నీ తేవడం నాతరం కాదు అన్నిటికీ నన్నే చావమంటే నేనెక్కడ చావను? పోనీ నాలుగొందలు పంపమని మీ నాన్నకి రాయకూడదూ?" అని కోప్పడుతోంటే అతడికో బ్రహ్మాండమైన ఐడియా వచ్చింది ఉమకి ఒంట్లో బావోటంలేదనీ, గుండెనీరసం అని డాక్టర్ చెప్పేడనీ, ఏవో టానిక్కూ ఇంజెక్షన్లూ వాడాలనీ, చంటోడి క్కూడా ఏవో మందులు కంటిన్యువస్‌గా ఇప్పించాల్సొస్తోందనీ అంచేత డబ్బుకి ఇబ్బందిగా వున్న దృష్ట్యా ఓ నాలు గొందలు పంపమని మావగారికి ఉత్తరం రాస్తే? అన్పించించింది. ఆ వుత్తర క్షణాన అదెంతో మంచి ఆలోచననీ, మావగారు తప్పకుండా డబ్బు పంపిస్తారు గనుక ఇంట్లోకి సరుకులూ తేవచ్చు, చిల్లర బాకీలు తీర్చి తనూ ఈ నెల సరదాగా గడిపేయొచ్చన్పించింది.

వెంటనే ఈల వేసుకుంటూ పోస్టాఫీసుకెళ్ళి వుత్తరం రాసి పోస్టు చేశాడు రామం.

నాలుగో రోజున రామానికి టీ యమ్. ఓ. వచ్చింది అతడి మావగారి దగ్గర్నుంచి

"మామావగారు చాలామంచివారు"అనుకున్నాడు డబ్బు అందుకుంటూ. "ఉమ కూడా మంచిదేపాపం. అప్పుడప్పుడూ తనే వూరికే కోప్పడుతూంటాడు. డబ్బు ఇబ్బందులవల్ల అశాంతిగా వుండి అలా ప్రవర్తిస్తున్నాడు గానీ లేకపోతే నెత్తిమీద పెట్టుకుని పూజించేవాడుకాదూ ?" అనుకున్నాడు ఈ డబ్బు ఆమెవల్లే వచ్చిందన్న భావన కలగ్గానే. ఇక ఆమెని కష్టపెట్టకూడదని అనుకున్నాడు.

ఎన్నడూ లేంది ఆఫీసవ్వగానే తిన్నగా ఇంటి ముఖం పట్టాడు, ఆనందాశ్వాన్ని అధిరోహించిన రామం.

ఉమ తలపోటుగా వుండటంతో పడుకునివుంది.

"అదేవిటి ఉమా ఈవేళప్పుడు పడుకున్నావ్. ఇంట్లో బావోలేదా?" అతడి కంఠంలో ఆప్యాయత ధ్వనిస్తున్నా ఆమె కంగారుగా లేవబోయింది.

"ఫర్వేదులే పడుకో" అని ఆమె నుదుటిమీద చేయివేసి చూసి "చాలా వేడిగా వుందే. కొంచెం జ్వరం తగిలినట్లుంది. టాబ్లెట్ తెప్పిస్తానుండు" అంటూ ఆమె వద్దని వారిస్తున్నా వినకుండా ప్రక్కింటి కుర్రాడ్ని మెడికల్ షాప్‌కి పంపించాడు

ఇంతలో చంటోడు నిద్రలేచి ఏడుస్తోంటే తనే వెళ్ళి ఎత్తుకుని వూరడిస్తూ "ఏమిటో ఉమా. ఈమధ్య ఆఫీసులో పని ఎక్కువంవ్వా, ఆర్థిక ఇబ్బందులదృష్ట్యానూ నిన్నెక్కువగా కోప్పడు తున్నాను ఏమీ అనుకోకు ఉమా ఇంకెప్పుడూ అలా ప్రవర్తించను. అయినా ఈ డబ్బు ఇబ్బందులన్నీ పేకాటవల్లే వస్తున్నాయనుకో. అంచేత రేపట్నుంచీ పేకాట పూర్తిగా మానేస్తాను. మన సుఖం కన్నా పేకాట ఎక్కువా చెప్పు? ఆఫీసవ్వగానే తిన్నగా ఇంటి కొచ్చి నీతోనూ, పిల్లల్తోనూ గడిపేస్తాను పిల్లల చదువు గురించి ఇప్పట్నుంచే శ్రద్ధ వహించాలి కూడానూ " అంటూ ఎన్నో కబుర్లు చెప్పాడు రామం జేబు బరువుగా వుండటంతో అవన్నీ వింటూ కలో నిజమో తేల్చుకోలేక కళ్ళప్పగించి చూస్తూండి పోయింది ఉమ

ప్రక్కింటి కుర్రాడు టాబ్లెట్ తేగానే తనే టీ కాసిచ్చాడు భార్యకి మీచేత చేయిస్తున్నానంటూ ఆమె నొచ్చుకుంటే "భార్యాభర్తలిద్దరూ ఒకరికొకరు సాయం చేసుకున్నప్పుడే ఏ సంసారమైనా సుఖంగా, సాఫీగా, సంతృప్తిగా, సంతోషంగా సాగుతుంది ఉమా" అన్నాడు.

భర్తలో వచ్చిన మార్పుకి ఉమ ఏనుగెక్కినంత సంబరపడుతోంది అంత మంచి మార్పు తీసుకొచ్చి నందుకు దేవుళ్ళందరికీ అంజలి ఘటించింది కూడానూ.

ఆ సాయంత్రం ఉమకి వంటలో సాయం చెయ్యడం, పిల్లలచేత స్నానాలు చేయించి బట్టలు తొడగడం, కబుర్లు చెబుతూ భోంచెయ్యడం వగైరా చెయ్యడమే గాక చాన్నాళ్ళ తర్వాత భార్యా పిల్లల్ని సినిమాకి కూడా తీసుకెళ్ళాడు రామం.

సినిమానుంచి వచ్చాక ఆ మర్నాడు ఆఫీసునుంచి రాగానే తామిద్దరూ బజారుకెళ్ళి కావలసిన సరుకులు తెద్దామన్నాడు. ఆమెకి మంచి చీరలు లేవు గనుక ప్రస్తుతం రోజూ కట్టుకునే వో రెండు కొంటాననీ, ఎరియర్స్ రాగానే ఓ మంచి చీర కొంటాననీ అన్నాడు

అతడి మాటలు వింటూ మురిసిపోతూ "ఈ స్వర్గం కలకాలం నిలిచిపోవాలి" అనుకుంటూ భర్త కౌగిట్లో ఒదిగి పోయింది ఉమ

మర్నాడు ఆఫీసు కేంటీన్లో తన మిత్రులతో నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడుతోంటే "నువ్వు లేకపోయేసరికి ఈనాల్రోజులూ పేకాట పరమ బోర్‌గా వుందనుకో. ఇవాళెమైనాసరే నువ్వు కూడా ఆడాలి. కావలిస్తే మేం డబ్బు అప్పిస్తాం" అన్నారు వాళ్ళు రామంతో


"ఛా—డబ్బుకోసం కాదోయ్"

"మరింకేవిటి గురూ? హోం డిపార్ట్‌మెంటు గొడవ చేస్తోందా, ఎవరో అన్నారు.


"అబ్బే అదేంకాదు గురూ! అర్జంటు పనుండి వెళ్ళిపోయానంతే. ఇవాళ ఆడదాం" అనేశాడు అనకుండా వుండలేక దానికితోడు పేకాటాడి చానాళ్ళయ్యిందంటూ మనసు వుబలాటపడింది కూడానూ. ఓ పది రూపాయల్తో ఆడితే నష్టం ఏవిట్లే? అలవాటైన ఆట గనుక సరదాగానూ వుంటుంది. అదృష్టం కలిసొస్తే నాలుగు డబ్బులు సంపాదించొచ్చుకూడానూ!

ఆఫీసయ్యాక యథాప్రకారం ముక్కలు కలుపుతూ కూర్చున్నారు.

రెండంటే రెండు ఆటలు ఆడి లేచిపోవా లనుకున్నాడు రామం కాని ఆటలు కలిసి రావడంతో ఈమధ్య పోగొట్టుకున్న డబ్బంతా రాబట్టేసుకోవా లనుకున్నాడు ఇన్నాళ్ళకి తన చెయ్యి తిరిగిందనీ, తనకింక ఢోకా వుండదనీ అనుకుంటూ ఆడాడు.



వెల్లటూరు నవరంగ్ చిత్ర కళానికేతన్‌వారు నిర్వహించిన 12వ అఖిలభారత బాలల చిత్రకళా ప్రదర్శనలో ఉత్తమ చిత్రంగా ఎన్నికై స్వర్ణ పతకాన్ని అందుకున్న చిత్రం "బావి వద్ద". (చిత్రకారుడు : చిరంజీవి విజయ్, జి. సహదేవ్)




9వ అఖిలభారత ఔత్సాహిక చిత్రకళా ప్రదర్శనలో ఉత్తమ చిత్రంగా బహుమతి పొందిన "కళాకారుని జీవితం".

(చిత్రకారుడు . శ్రీ టి వి. సత్యనారాయణ)



తృతీయ ప్రాంతీయ ప్రౌఢ చిత్రకళా ప్రదర్శనలో ఉత్తమ చిత్రంగా ఎన్నికై స్వర్ణపతకాన్ని పొందిన తైలవర్ణ చిత్రం "అఖిలభారత వైచిత్రి"
(చిత్రకారుడు : శ్రీ ఆర్ హేమాద్రిచెట్టి, తిరుపతి)



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

జి. ఎస్. ఎస్. ఆర్. — వేలకొండపల్లి

నా స్నేహితునికి చేతి వేళ్ళ సందుల్లో చిన్న కురుపులు లేచి రాత్రింబవళ్ళు దురద పెడుతున్నదట. వాటిని గిల్లితే నీళ్ళరక్తం వస్తున్నదట ఇలా ఎందువలన వస్తాయి? వీటికి ఏమి చెయ్యాలి?

★ పై పూతగా బెంజైల్ బెంజొయేట్ (20 శాతం) వాడాలి. ఈ మందు, బాగా స్నానం చేసిన తర్వాత పూయవలసి ఉంటుంది. మొదటిసారి పూసిన తర్వాత 12 గం॥ల తర్వాత మరోసారి పూయవలసి ఉంటుంది. అలా పూసిన 12 గం॥ల తర్వాత స్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి వంతున వరుసగా మూడు వారాలు ఈ మందుని వాడాలి

లోనికి పిరిటాన్, అవిల్ వంటి మాత్రలు పూటకి సగం మాత్ర వంతున రోజుకి 3 పూటలుగా వరుసగా వారం రోజులు వాడితే దురదలు తగ్గే అవకాశం ఉన్నది.

ఈ లక్షణం ఉన్నవారు వారి గుడ్డలను వేరే ఉంచి, వేడినీళ్ళలో ఉడికించి ఆరవేసి వాడవలసి ఉంటుంది.

కె జి. ఎస్. కె. — కుప్పం

సాధారణంగా గొప్పవారికే గుండె జబ్బులు ఎక్కువగా వస్తాయి. కారణం ఏమిటి?

★ గుండె జబ్బులు అన్ని వర్గాలవారికీ వచ్చే అవకాశం ఉన్నది. గుండెజబ్బుకి డయాబెటిస్, అధిక బ్లడ్‌ప్రెషర్, అతి స్థౌల్యం మొదలయినవి దోహదం చేస్తాయి ఈ రోగాలు బాగా శ్రమించి పనిచేసేవారికి ఎక్కువగా రావు శారీరక కష్టం లేనివారికి ఈ రోగం వచ్చే అవకాశం, శ్రమించి పనిచేసేవారికి వచ్చే అవకాశానికన్నా కొద్దిగా ఎక్కువ అనే చెప్పవలసి ఉంది

డి. టి ఎస్. ఎస్. — శింగరాయపాలెం

నేను ఎన్నో సంవత్సరములనుండి కాలవస్నానం చేస్తాను. ఇంట్లో అన్ని పనులకూ ఆ నీటినే వాడటం అలవాటు. కాని ఈ సంవత్సరము మాత్రము ఇన్ని సంవత్సరములనుండి లేనిది కాలవ లోని మెట్లకు పాచి పట్టి దిగి స్నానము చేయుటకు యిబ్బందిగా వున్నది. ఈ సంవత్సరము మాత్రమే పాచి పట్టుటకు కారణమేమిటి? ఆ నీరు పాన యోగ్యమగునా?

★ నీరు ఎక్కడినుంచి లభ్యం అవుతున్నా పరిశుభ్రం చేసిన తర్వాతగాని వాడటం మంచిది కాదు. కనీసం ఆ నీటిని వడపోసి తర్వాత బాగా మరగకాచి త్రాగవలసి ఉంటుంది

పాచి ఎందుకు పడుతుందనేది అందరికీ తెలిసిందే కదా! శాస్త్రీయంగా నీళ్ళలో ఉన్న బాక్టీరియా, ఫంగై, మొదలయినవి, ఒక విధమైన ఫేరసైటు (చెట్ల తెగకు చెందినది) పాచి పట్టటానికి ముఖ్య కారణాలవుతాయి.

కె ఎల్. — వైజాగ్

గర్భవతి అయిన నా స్నేహితురాలు బొగ్గులు, పలక పుల్లలు, ఇటుక ముక్కలు, బియ్యం మొదలైనవి తింటుంది. వీటిని తినాలనిపిస్తుంది అంటుంది. ఇవి తింటే ఆమెకుగాని, పుట్టబోయే బిడ్డకుగాని ఏమైనా ప్రమాదమా? ఇవి తినకుండా వుండుటకు ఏమైనా మందులు వున్నాయా?

★ గర్భిణిగా ఉన్న సమయంలో "పెర్వర్టెడ్ అప్పిటైట్" ఉండటం కొందరిలో సహజమే! ఇలా చేయటం వల్ల తల్లికిగానీ, పుట్టబోయే బిడ్డకి గాని ఏ విధమైన ప్రమాదమూ ఉండదు ●

చిల్లరమల్లర బాకీలన్నీ తీర్చేసి ఫ్రెష్ అయిపోవాలనుకుంటూ వుత్సాహంగా ఆడాడు.

కాని మెల్లగా వచ్చిందీ, తన దగ్గరున్నదీకూడా పోతోంటే తన సొమ్మైనా పూడ్చుకోవాలని కసిగా ఆడాడు. ఇదివరకెన్నడూ ఆడని విధంగా డబ్బుకి కేర్ చెయ్యకుండా ఆడాడు. ఆడేకొద్దీ పోతూనేవుంది తప్ప రావట్లేదు!

మరి రెండు గంటలకే రామం జేబులు ఖాళీ అయిపోయాయ్!

ఒకటీ రెండూ కాదు మూడు వందల ఎనభై రూపాయలు పోయాయ్!

రామం గుండెలు గుభేలుమన్నాయ్. దుఃఖం పొంగివచ్చింది.

నీరసంగా లేచి తననీ, పేకాటనీ తిట్టుకుంటూ ఇంకెప్పుడూ ఆడకూడదని ఒట్టు పెట్టుకుంటూ ఇంటి ముఖం పట్టాడు.

"అయినా మావగారు ఏడుస్తూ పంపించి వుంటాళ్ళే. అందుచేతే ఇలా పోయింది. దానికితోడింట్లో ఎప్పుడూ పోరే! ఏడ్పులే! ఇంక సిరి నిలవమంటే ఎలా నిలుస్తుంది?" అని భార్యమీద మండిపడుతూ నడుస్తున్నాడు.

"బాబూ — పైసా ధర్మం సెయ్యండయ్యా" పొట్ట చూపిస్తూ చెయ్యి చాచాడు ముష్టివాడు.

"ఛా. ప్రతివాడికీ అడుక్కోవడం అలవాటయ్యింది. వూరికే వస్తే తిందామనేగాని కష్టపడి తిందామని ఒక్కడికీ లేదు" కసురుకున్నాడు. ఇంటికెళ్ళగానే భార్య కావల్సిన కిరాణా సరుకుల లిస్టు చేతికందిస్తే ఏంజెయ్యటమా అని బుర్ర బద్దలు గొట్టుకుంటూ నడుస్తున్నాడు.

తమ పోర్షన్వైపెళ్తోంటే తమింట్లోంచి ఎవరెవరివో అయిదారుగురి మాటలు విన్పించసాగాయ్. ఇల్లు కొంచెం సందడిగాకూడా వుంది.

రామం గుండెల్లో రాయి పడింది.

"ఒకవేళ... ఒకవేళ..."

అతడి నోటి తడారిపోయింది. గుండె దేన్తోనో పోటీ పడుతున్నట్టు కొట్టుకోసాగింది.

మొన్న భార్యకి ఒంట్లో బావుండలేదని మావగార్కి ఉత్తరం రాసిడబ్బు పంపమన్నాడుకదూ! ఉమ ఆరోగ్యం ఎలాగుందో అన్చెప్పి వాళ్ళంతా కట్టగట్టుకుని రాలేదు కదా? వాళ్ళు పంపిన డబ్బు తన దగ్గర్లేదు. తమ అవసరాలూ గడవలేదుగాని వాళ్ళొస్తే ఇంకో అంత ఖర్చు! ఎక్కడా దొరక్క వాళ్ళనడిగితే మళ్ళీ వాళ్ళ గురించించెవర్ని బతిమాలగలడు? పైగా తను అబద్ధాలు వ్రాశానని తెలిస్తే ఎంత అప్రతిష్ఠ! తన గురించి అత్తామామలూ, బావమరదులూ, వారి భార్యలూ. మరదళ్ళూ, వారి భర్తలూ అంతా హీనంగా అనుకోరూ? అదోలా చూడరూ? అయ్యో! ఎంత కర్మొచ్చిపడిందిరా దేవుడా!

ముచ్చెమటలు పోస్తోంటే అడుగులు తడబడుతోంటే లోపలి కెళ్ళడానికి ధైర్యం చాలక, బయట తచ్చాడుతోంటే ఉమ వీధిలోకొచ్చింది. అతడ్ని చూసి గబగబా దగ్గరికొచ్చింది

"ఎవరూ వచ్చింది?" ఆతృతగా అడిగాడు రామం.

"మా అమ్మా, నాన్నా, చెల్లెళ్ళూ అంతా వచ్చారండీ."

అతడి మొఖంలో రక్తపుబొట్టు కూడా లేదు.

"అయితే నీకు ఒంట్లో బాగోలేదన్న సంగతి .."


"బాగోలేదనే చెప్పాన్లెండి."

"నిజంగా? థాంక్ గాడ్. లేకపోతే చచ్చేవాడ్ననుకో. నువ్వు నిజంగా దేవతవి ఉమా."


"దానికేంలెండిగానిప్పుడింట్లో ఏం లేవండీ. పక్కింట్లో టీ పొడీ, పంచదారా తీసుకుని టీ కాసిచ్చాను. మీరు ఆఫీసునుంచి వస్తూ సరుకులు తెస్తారని చెప్పాను. వాళ్ళు చూడకుండా వెళ్ళి ఎలాగోలా అన్ని సరుకులూ, బియ్యమూ పట్రండీ." అంది ప్రాధేయపడుతూ.

తలూపి "దేవుడా!" అనుకుంటూ వెనుదిరిగాడు రామం.

కళ్ళముందు కళ్ళు పొడుచుకున్నా కన్పించనంత చీకటి పరచుకునివుంది! ★



'టింగు రంగడు'లో చిరంజీవి, షావుకారు జానకి, జగ్గయ్య



టింగు రంగడులో టక్కరివాళ్ళు

కోటిలింగం (నూతన్‌ప్రసాద్) గెంతుతూ రావడం చూసి, "రేయ్, గాడిదకొడకా! ఏమిట్రా ఆ చిందులూ నువ్వూనూ?" అన్నాడు భూపతి (నాగభూషణం).

"డాడీ! నేనేగనక గాడిదకొడుకునైతే, నన్ను 'కన్న గాడిద'వి నువ్వే అవుతావ్?"

"నిన్ను కన్నందుకు నేను గాడిదను కాలేదురా! నీ సలహా విని రక్తపరీక్ష చేయించానే – అదిగో అందుకు అడ్డగాడిదనయ్యాను. మన కొంప మునిగింది. వాళ్ళిద్దరి రక్తం ఒక్కటేనని తేలింది. దాంతో మామయ్య మనమీద మండిపడిపోతున్నాడు."

"డాడీ! నీ కొడుగ్గా నేను అనకూడదుగాని, ఆ బ్రహ్మదేవుడు నీ బుర్రలో మెదడు పెట్టడం మానేసి, కంగార్లో ఇంకేదో పెట్టేసుంటాడు."

"ఇప్పుడేమైందనిరా – అపోజిషన్ పార్టీలాగ అలాగ చెరిగేస్తున్నావు?"



సినిమా

"చెరిగేయటంకాదు; మామయ్య బ్లడ్డూ ఆ రంగడి బ్లడ్డూ ఒక్కటేనని నీకు ముందుగ తెలిసినప్పుడు ఏ పంది రక్తమో, కుక్క రక్తమె తీసుకెళ్ళి టెస్ట్ చేయించి – ఆ రక్తం, మామయ రక్తం ఒక్కటి కాదని మస్కా కొట్టొచ్చుగదా?'


"పోయింటేరా. నాకా ఐడియానే తట్టలేదు ఊఁ... సరే. చూస్తా. ఈసారి ఒక బ్రహ్మం మైన ఐడియా వేసి, ఆ తర్వాత నీకు వచ్చి చెప్తాను."


"వెయ్ – వెయ్! నీ ఐడియాని బంగాళ ఖాతంలో కలిపెయ్యడానికి నేను ఇంకో ఐడియా



'ఏకలవ్య'లో
జయప్రద

'ఈనాడు
ఒక దృ





'జగ్గు'లో కృష్ణంరాజు, సత్యనారాయణ, అల్లు రామలింగయ్య

వేస్తాను. అహ్హాహ్హా ! సుపుత్రా, తప్పు చెయ్యకురా — అని ఊరికే అన్నారా ?" అంటూ కోటిలింగం, తండ్రి ముఖకవళికలు గమనించసాగాడు.

తాతినేని ప్రసాద్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించిన అనిల్ ప్రొడక్షన్స్ "టింగు రంగడు" చిత్రానికి తాతినేని ప్రకాశరావు నిర్మాత.

"ముగ్గురమ్మాయిల మొగుడు"

"టైటిల్‌నిబట్టే ఊహించుకోవచ్చు ఇది కడుపుబ్బ నవ్వించే చిత్రమని. విజ్జి అనే కొత్త అమ్మాయిని పరిచయం చేస్తున్నాం. ఆమెతోపాటు ముచ్చెర్ల అరుణ, సాధన — ముగ్గురమ్మాయిలు. మొగుడు — చంద్రమోహన్," అన్నారు నాగార్జున పిక్చర్స్ అధినేత ఎ. సారధి. ఈయన గతంలో నిర్మించిన "గోపాలరావుగారి అమ్మాయి, పక్కింటి అమ్మాయి" చిత్రాలు కూడా హాస్య ప్రధానమైనవే నన్న విషయం ప్రేక్షకులకు విదితమే. పై చిత్రం

విశేషాలు

-జి. వి. జి.

షూటింగ్ జూన్ 27న మొదలైంది. సత్యనారాయణ, రమణమూర్తి, రాళ్ళపల్లి, భాస్కర్, వీరభద్రరావు, రామన్నపంతులు, మూర్తి ఇతర పాత్రధారులు. తోటకూర ఆశాలత కథకు పూసల సంభాషణలకర్త. చక్రవర్తి స్వరకల్పనలో వేటూరి, గోపి గీతాలు రాశారు. బి. కోటేశ్వరరావు ఛాయ, రాజా ప్రొడక్షన్, నాయని మహేశ్వరరావు కూర్పు, వి. ఎస్. వి. నరసింహారావు నిర్వహణలో రాకేష్ సహ నిర్మాత. "జూలై 9వ ఫస్ట్ షెడ్యూల్ ముగిసింది," అని స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించే రేలంగి నరసింహారావు తెలిపారు.



'ముగ్గురమ్మాయిల మొగుడు'లో చంద్రమోహన్, ముచ్చెర్ల అరుణ, సాధన, విజ్జి

సినిమా



'వయ్యారి భామలు—వగలమారి భర్తలు'లో రాధిక, కృష్ణ, ఎన్.టి.ఆర్., శ్రీదేవి


"గోడమీద బొమ్మ"


"జూలై 5తో తొలి షెడ్యూల్ పూర్తి చేశాం," అన్నారు గిరి. ఈయన స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో రాకేష్ ఆర్ట్ పిక్చర్స్ నిర్మించే ఈ చిత్రానికి జూన్ 25న అన్నపూర్ణా స్టూడియోలో ప్రారంభోత్సవం జరిగింది. మంత్రి శ్రీ పి జనార్దన్‌రెడ్డి తొలి క్లాప్ ఇచ్చారు. బేబీ మంజూష కెమెరా స్విచ్ ఆన్ చేసింది. ప్రదీప్, కాంతారావు పి. ఎల్. నారాయణ, దేశిరాజు హనుమంతరావు చిట్టిబాబు, సారథీ, మాడా, పి. జె. శర్మ, మాస్టర్ హరి, పూర్ణిమ, సూర్యకాంతం, అన్నపూర్ణ మమత, శకుంతల, బేబీ కీర్తి, ఒక విభిన్నమైన ప్రధాన భూమికలో జయమాలిని నటిస్తున్నారు కథ, మాటలు యామిని రాశారు. వేటూరి, పి నారాయణరెడ్డి, గోపి, శారదా అశోకవర్ధన్, ఎం.కె సుగమ్‌బాబు గీతాలకు సత్యం బాణీలు కూర్చారు సుఖదేవ్ ఛాయ, వి. కృష్ణమూర్తి శిల్పం, ఎస్.ఆర్ రాజు నృత్యాలు, టి. కృష్ణ కూర్పు, కె. వి సరస్వతీకుమార్ సహ దర్శకత్వం, ప్రేమ్‌తేజ్ సహకార దర్శకత్వం, ప్రొడక్షన్‌ను రవిప్రకాష్ సి. మాణిక్‌రావు నిర్వహిస్తున్నారు.

శ్రీ క్రాంతి చిత్ర

"ఇది పెళ్ళంటారా?" తర్వాత క్రాంతికుమార్ నిర్మించే "పులిరాజు"లో కృష్ణంరాజు, చిరంజీవి నాయకులు. ఎ. కోదండరామిరెడ్డి దర్శకుడు. తదుపరి చిత్రం "ప్రొడక్షన్ నెంబర్ 6"లో చిరంజీవి, రాధిక నాయకా నాయికలు.

'అనంత రాగాలు'లో రాజ్యలక్ష్మి




ప్రేక్షకుల ఆలోచనల్లో, ఊహల్లో విప్లవం తెచ్చే క్రాంతి చిత్రం
ఇది పెళ్ళంటారా !
నిర్మాత క్రాంతికుమార్
దర్శకత్వం: విజయ భాస్కర్
మాటలు సత్యానంద్
సంగీతం చక్రవర్తి
కెమెరా వెంకట్
కూర్పు కృష్ణ
కళ భాస్కరరాజు
సాయికృష్ణ
TARAKAPRABHUADS.
THE MOST CONTROVERSIAL FILM OF THE YEAR

సినిమా

"ప్రేమ దీపాలు"

''హైదరాబాద్‌లో కొన్నిభవనాలలో షూటింగ్ జరిపాం. జూన్ 5 నుంచి 16 వరకు జరిగిన రెండవషెడ్యూల్‌తో మూడొంతులు పూర్తయింది,'' అన్నారు వెంకటేశ్వర ఆర్ట్స్‌వారి పై చిత్రానికి స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించే సి. ఎస్. బోసు. శరత్‌బాబు, కవిత, రాజ, భానుప్రియ, చలపతిరావు, ఎం. ఎస్. ప్రసాద్, శ్రీలత, రూపి, అత్తిలి లక్ష్మి, గిరిజారాణి, చిడతల అప్పారావు తెరముందు; పెండ్యాల, ఎస్. రామకృష్ణారావు, శ్రీనివాసరావు, సత్యం, సుధాకరరెడ్డి, ఈశ్వరబాబు తెరవెనుక కృషి చేస్తున్నారు. జూలైలో చివరి షెడ్యూల్ జరుగుతుందని నిర్మాతలు పి. వెంకటేశ్వర్లు, జి. నాగేశ్వరరావు తెలిపారు.

రంజిత్ ఆర్ట్స్ చిత్రం


కృష్ణ హీరోగా విజయనిర్మల దర్శకత్వంలో ఓ చిత్రాన్ని కామారి రంజిత్‌కుమార్ త్వరలో ప్రారంభిస్తారు.



'ప్రతీకారం'లో శోభన్‌బాబు, మోహన్‌బాబు

'ఇల్లంతా సందడి'లో ప్రభ





'షంషేర్ శంకర్'లో కృష్ణ, శ్రీదేవి

డైరెక్టర్ కె. రాఘవేంద్రరావు కొత్త చిత్రాలు

కృష్ణ, కృష్ణంరాజు, శ్రీదేవి, జయప్రదలతో చలసాని అశ్వనీదత్ నిర్మించే వైజయంతి మూవీస్ 3వ చిత్రానికి; దేవీవరప్రసాదరావు నిర్మించే దేవీ ఫిలిమ్ ప్రొడక్షన్స్ 4వ చిత్రానికి; "జస్టిస్ చౌదరి" తరువాత టి. త్రివిక్రమరావు నిర్మించే విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ 6వ చిత్రానికి; ఎం. అర్జునరాజు, కె. శివరామరాజు నిర్మించే రోజా మూవీస్ 3వ చిత్రానికి; ఎ. ఎన్. ఆర్.తో చలసాని గోపీ నిర్మించే చిత్రానికీ కె. రాఘవేంద్రరావు దర్శకత్వం వహించ మన్నారు.

కొన్ని చిత్రాల పేర్లు

★ దాసరి నారాయణరావు రచన, దర్శకత్వంలో కొసరాజు భానుప్రసాద్ మాతన నటీనటులతో విశాఖపట్టణం ప్రాంతాలలో నిర్మించే ప్రయోగాత్మక చిత్రం "ప్రేమకు మరోవైపు". కొసరాజు రాఘవయ్యచౌదరి సమర్పించే ఈ చిత్రానికి ఎం.ఎస్. విశ్వనాధన్ సంగీత దర్శకుడు.

★ వేజెళ్ళ సత్యనారాయణ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో నిర్మాత ఎ. కృష్ణ కుమార్ సెప్టెంబర్‌లో ప్రారంభించే కృష్ణసత్య క్రియేషన్స్ "ఇదిగో ప్రశ్న ... ఏదీ జవాబు ?" చిత్రానికి పరుచూరి – గోపాలకృష్ణ మాటలు రాస్తున్నారు. శివాజీరావు సంగీతం, ఆర్.కె. రాజా ఛాయాగ్రహణం నిర్వహిస్తారు.

'మామ్మగారి మనవలు'లో సుమలత, అరుణ



సినిమా

ఈ చరిత్ర ఏ పేరాతో .... ? లో అస్తవ్యస్తంగా ఉన్న నేటి వ్యవస్థ !

సంఘ విద్రోహులైన ముగ్గురు పెద్ద మనుష్యులతో పృథ్వీ అనే ఉద్యోగి మోసగింపబడి, కోపంతో వ్యవస్థారావు ఇంటికొచ్చాడు. "నాకా ఉద్యోగం రాలేదు. నన్నన్యాయం చేయకండి, సార్!" అని మొఱపెట్టుకున్నాడు.

వ్యవస్థారావు విని విననట్లు ఊరుకున్నాడు. అయన్ని వెనకేసుకువస్తూ కవి, "అన్యాయమా ! వారు 'అఆ'లే నేర్చుకోలేదు. అన్యాయమన్న పదం ఆయనకేం తెలుస్తుంది, నాయనా ?" అన్నాడు.

"నా దగ్గర పదివేల రూపాయలు తీసుకుని, ఆయన కొడుక్కి ఉద్యోగం వేయించుకోవడం అన్యాయం కాదా ?"

పక్కనే ఉన్న బ్రోకర్ — ముక్కు మీద వేలెట్టుకొని, "ఛీ ... ఛీ ! తప్పు, నాయనా ! వారు లంచం పుచ్చుకోవడమేమిటి ?" అన్నాడు.

పృథ్వీ ఆవేశంతో "మరి నా దగ్గర తీసుకున్న పదివేల రూపాయలు ఏమయ్యాయి ? అలా నటించకండి, సార్ ! నన్ను మోసం చెయ్యకండి. ఆ డబ్బెక్కడ్నుంచి తీసుకొచ్చానో తెలుసా మీకు ? నా తల్లిదండ్రుల రక్తమాంసాలు మూటకట్టి తెచ్చాను, సార్ ! మా బ్రతుకులు నాశనం చెయ్యకండి," అన్నాడు.

"అయ్యో, ఎవరో నిరుద్యోగి...మతిభ్రమణం చేత అలా మాట్లాడుతున్నాడు," అని కవి, "అవును. ఎవరో చదువుకున్న పిచ్చోడు," అంటూ బ్రోకర్ హేళనగా చూశారు.

వ్యవస్థారావు గంభీరంగా "రేయ్, బాషా ! పెదానంగా ఈ పిచ్చి వెధవని బయటకీడ్చేయ్ !" అంటూ హుకుం జారీచేశాడు.

పృథ్వీ రెచ్చిపోయి, "రేయ్, వ్యవస్థారావ్ ! నన్ను మోసం చేస్తార్రా ? మీరు సుఖంగా బ్రతుకలేర్రా. జొన్నన్నం తిన్న నా చెల్లెలి లేత పేగులు మిమ్మల్ని శపిస్తాయిరా ! మట్టి పిసికి రాత్రింబవళ్ళు కష్టపడి నా ఉద్యోగం కోసం ఆశతో ఎదురు చూస్తున్న నా తండ్రి చూపులు మిమ్మల్ని నిలువునా చీల్చేస్తాయిరా. పస్తులతో మలమలమాడిపోయిన నా తల్లి ఆవేదన మిమ్మల్ని మింగేస్తుందిరా !" అంటూండగా బయటకు గెంటెయ్యబడ్డాడు.

పీడ విరగడైందనుకొని ఆ దుష్టత్రయం సంతృప్తి చెందారు.

దగాపడ్డ పృథ్వీగా కొత్తనటుడు కిరణ్‌బాబు, వ్యవస్థారావుగా గోకిన రామారావు, కవిగా పి. ఎల్. నారాయణ, బ్రోకర్‌గా కర్నాటి లక్ష్మీనరసయ్య పాల్గొన్న సాయిలక్ష్మి పిక్చర్స్ "ఈ చరిత్ర ఏ పేరాతో ... ?" చిత్రాన్ని వేజెళ్ళ సత్యనారాయణ దర్శకత్వంలో గోగినేని ప్రసాద్, యు. రాజేంద్ర ప్రసాద్ నిర్మించారు. పరుచూరి గోపాలకృష్ణ, శివాజీరాజా, ఆర్.కె. రాజు, కె. రామలింగేశ్వరరావు, బాబూరావు, రాజు, అక్కినేని శ్రీనివాసరావు, డాక్టర్ కె. రాజబాపయ్య తెరవెనుక కృషిచేశారు. సమర్పణ : అట్లూరి రామమోహన్‌గాంధి.



'గొల్కొండ అబ్బులు'లో కృష్ణంరాజు, సత్యనారాయణ

'భక్త ధ్రువ—మార్కండేయ'లో రోహిణి, సురేష్, వంశీకృష్ణ, బాబు







సంపూర్ణ పోషకాహారంలో వుండవలసినవన్నీ కలిసివున్న రుచికరమైన పదార్థం

సిరిలాక్®

ఇన్‌స్టెంట్ వీట్ మిల్క్, సీరియల్

ఇవ్వగలిగినంత కాలం మీ పాపకి చనుపాలు యివ్వండి—మీరు యివ్వగలిగిన మంచి ఆహారం అదే. 4 నెలల ప్రాయం వచ్చేసరికి పాపకి ఎక్కువగా పోషక పదార్థాలు కావాలి. ఘన పదార్థాలు తీసుకోడానికి పాప సిద్ధంగా వుంటుంది. సిరిలాక్ యివ్వడం వలన, పాలు యివ్వడం మానకుండా పాప ఆహారంలో ఘన పదార్థాలు ప్రవేశ పెట్టడం గురించి మీ డాక్టర్‌ని సంప్రదించండి.

మీ పాపకి సరిఅయిన పాళ్లలో పోషక పదార్థాలు అందించడానికి సిరిలాక్‌లో గోధుమ పిండి, పూర్తి మీగడ పాలు మరియు చక్కెర ఉన్నాయి. పిండి పదార్థాలు మరియు క్రొవ్వు పదార్థాలు శక్తి నివ్వడానికి, మాంసకృత్తులు పెరుగుదలకి, విటమిన్లు మరియు ఖనిజాల లోపాల నుండి రక్షణ కలిగించడానికి దీనిలో ఉన్నాయి. సిరిలాక్—మీ పాప బాగుగా, ఆరోగ్యంగా పెరగడానికి.

సిరిలాక్—పాలు వుండనే వున్నాయి

దీనిని తయారు చేయడం చాలా సులభం. —దీనితో ముందుగా మరగబెట్టిన గోరువెచ్చని నీరు చేర్చండి.



ముందుగా మరగబెట్టిన నీటితో సెరిలాక్ చేర్చండి



బాగా కలపండి




వెంటనే యిచ్చేందుకు తయారు

SAA/FSL/C/2258 TEL

NESTLÉ

సినిమా




'కర్త—కాంత—కనకం'లో మంగళగౌరి

ప్రజాశక్తి

"దేవుడంట దేవుడంట దేవుడంట !
వాడున్నోళ్ళ కండదండ...
బండరాయి —"


స్పీకర్‌లోంచి పై పాట వినిపిస్తోంది. మద్రాసుకు దాదాపు 30 మైళ్ళ దూరంలో తిరునీర్‌మలై అనే కుగ్రామం... అక్కడ మాదాల రంగారావు కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాణ సారథ్యంలో తుది మెరుగులు దిద్దుకుంటూన్న నవతరం పిక్చర్స్ "ప్రజాశక్తి" ఔట్‌డోర్ షూటింగ్ సందడి... మాదాల సారథ్యంలో ప్రతి చిత్ర నిర్మాణం ఒక ఉద్యమంలా ఉంటుంది. ఆయన చిత్రాలన్నీ ప్రజల్ని ఆలోచింపజేసి, విప్లవోన్ముఖులను చేసే విధంగా ఉంటాయి. ఐతే, "ప్రజాశక్తి" చిత్రం విప్లవాత్మకంగానే కాక కళాత్మకంగానూ తీర్చిదిద్దబడుతోంది... ఆ కుగ్రామం చుట్టూ చిన్న చిన్న కొండలు... కొండల మధ్య పొలాలు... పొలాల మధ్య చెఱువు... చెఱువుచుట్టూ ఇళ్ళు... ఓ పక్కన ఎత్తయిన కొండ — దానిమీద చిన్న గుడి... పిన్నా పెద్దా తేడా లేకుండా నవతరం యూనిట్‌లోని కళాకారులు, సాంకేతిక నిపుణులు సమిధికోత్సాహంతో ఒక మహత్తరమైన సామాజిక జీవన మార్పిడికోసం నడుంకట్టిన ఉద్యమకారుల్లా శ్రమిస్తున్నారు. ఈ చిత్రంలో కొత్త నటీనటులు, జూనియర్ ఆర్టిస్టులు అసంఖ్యాకంగా పాల్గొనడం మరో విశేషం. "నా చిత్రానికి కథకులు, కథానాయకులు, నిర్దేశకులు అంతా ఎప్పుడూ ప్రజలే. ప్రజల జీవన



'ఈ చరిత్ర ఏ సిరాతో'లో నూతన్‌ప్రసాద్

విధానాన్ని శాస్త్రీయ దృక్పథంలో పరిశీలించి, సామాజిక విప్లవమే ధ్యేయంగా పెట్టుకుని, ప్రజల జీవన విధానాల ప్రతిరూపాలను తెరకెక్కిస్తున్నా. అంచేత నా చిత్రాల విజయానికిగాని, భౌతిక స్వరూపానికిగాని కారకులు అప్పుడూ, ఇప్పుడూ,

'ఇద్దరు కిలాడీలు'లో సుమన్, భానుచందర్





'నాగాభరణం'లో మంజుల, కె. విజయ

ఎప్పుడూ ప్రజలే,'' అంటూ మాదాల ఈ చిత్రం గురించి ఇలా వివరించారు : ''శ్రమశక్తి, ప్రజా శక్తిని మించిన దైవికశక్తి ఏదీలేదు. వృత్తులకు వినియోగపడే ఆయుధాలే దేవుళ్ళు. దోపిడీ మితిమీరితే ఆ ఆయుధాలే తిరగబడతాయి. మూఢ నమ్మకాలు, కర్మ సిద్ధాంతం, వర్ణాశ్రమ ధర్మాలు, కుల వ్యవస్థలు అంటూ ఆ రోజుల్లో సంఘాన్ని చట్రంలో భిగించి, చైతన్యానికి దూరం చేశారు. కాలం గడిచినా వాటి ఆనవాళ్ళు పోలేదు. కొందరు స్వార్థపరుల ప్రయోజనానికి, దోపిడీకి దోహదం చేస్తున్న అనాచారాలను అరికట్టి, నాగళ్ళే దేవుళ్ళని చాటిచెప్తూ, కులం అనేది లేని సంఘాన్ని స్థాపించాలనేదే ఈ చిత్రం ధ్యేయం. రైతుకూలీ — బడుగు వర్గాల సమైక్య జీవనానికి పునాదులువేసే సమిష్టి వ్యవసాయానికి నాంది పలికే శ్రామికవర్గ భూపోరాటంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నాం.''

30 రోజులలో నిర్విరామంగా ప్రజల మధ్య, ప్రజల సహకారంతో పూర్తయిన ఈ చిత్ర నిర్మాణంలో తమిళనాడు కమ్యూనిస్ట్ పార్టీ కార్యకర్తలు కూడా పాలుపంచుకోవడం మరో విశేషం. తమిళనాడు వెండితెరకు రుధిరచ్ఛాయ పులమాలని తమ దీక్ష, పట్టుదలగా ఆ కార్యకర్తలు తెలియజేశారు.

కె. విజయ, సురేఖ, ప్రతిభ, శ్రీ అండ్ శ్రీమతి బీరప్ప మస్తాన్‌రావు, టి. కృష్ణ, బాబూరావు, చలపతిరావు, నర్రా వెంకటేశ్వరరావు, పి. జె. శర్మ, మిఠాయి చిట్టి, ఎం. పి. ప్రసాద్, చిత్ర సారథి మాదాల రంగారావుతోపాటు వేలాది ప్రజా కళాకారులు పాల్గొన్న ఈ చిత్రానికి చక్రవర్తి సంగీతం, ఎం. జి. రామారావు సంభాషణలు, ఉర్సి శిల్పం, ఆర్. రామారావు ఛాయ, 'నవతరం యూనిట్' దర్శకత్వం — తెరవెనుక హంగులు.

తెర పొరలు

★ ''నన్ను డైరెక్టర్ కె. బాలచందర్‌గారికి షావుకారు జానకి పరిచయం చేశారు,'' అంది శ్రీదేవి. ''అప్పుడు నేను బాల నటిని. కాని, ఆ తర్వాత చాలాకాలానికి బాలచందర్‌గారి వద్ద నుంచి నాకు పిలుపు వస్తే, ఆశ్చర్యపోయాను — ఆయన నన్నంతగా గుర్తుంచుకున్నందుకు. 'చూడమ్మా. ఓ సీత కథ — ను తమిళంలో తీస్తున్నాను. నువ్వే హీరోయిన్‌వి. కాని, మరీ బక్కపల్చగా ఉన్నావ్. మూడ్నెల్లు టయిమ్ ఇస్తున్నాను. కాస్త లావెక్కాలి సుమా!' అన్నారు. ఆయన చిత్రంలో హీరోయిన్ ఛాన్స్ దొరికిందన్న ఆనందంలో ఆ మర్నాటినుంచే లావెక్కడం ప్రారంభించాను,'' అంది శ్రీదేవి కలకలా నవ్వుతూ.

★ ''నా జీవితంలో నేను ఒకే ఒక్క గొప్ప పొరబాటు చేశాను. మళ్ళీ అలాంటి పొరబాటు జరక్కుండా ఎంతో జాగ్రత్తగా ఉంటాను,'' అంది రాధిక. ''శ్రీలంకలో నేను చదువుకుంటున్న రోజులవి ... అప్పుడు నా వయసు 15 ఉంటుందేమో! మా కుటుంబానికి పరిచయమున్న ఓ గొప్ప వ్యక్తి మరణించారు. పరామర్శించడానికి మా ఇంటినుంచి బయలుదేరిన వాళ్ళతో నేనూ వెళ్ళాను. శవం చుట్టూ చాలామంది మహిళలే గుమికూడి ఉన్నారు. శవం పక్కన విచారవదనంతో కూర్చొని ఉన్న ఓ యువతితో 'ఇంత చిన్నవయస్సులోనే మీ భర్తగారు పోవడం చాలా దురదృష్టకరం' అంటూ ఓదార్చాను. చుట్టూ మూగి ఉన్న మహిళలు నా వంక అదోలా చూశారు. నాకేం పాలుపోలేదు. అక్కడ్నుంచి బయటకు రాగానే మా మామయ్య 'కొంప ముంచేశావు, రాధికా! నీకు తెలియకపోతే ఊరుకోవాలిగాని, మనలాగే పరామర్శించడానికి వచ్చి అక్కడ కూర్చున్న గవర్నర్‌గారి కూతురితోనా నువ్వలా అనడం? ఆ అమ్మాయికి పెళ్ళయి తీరా రెండు నెలలైనా కాలేదు. నువ్వలా అన్నందుకు ఎంతగా నొచ్చుకొని ఉంటుందో!' అని కోప్పడ్డాడు. దాంతో నా పాదాల కింద భూమి కంపించి పోయినట్లయింది,'' అంది రాధిక.

★ ''నేను సినిమారంగలో ప్రవేశించాక మా స్వస్థలానికి వెళ్ళడానికి వీలుపడింది కాదు. ఏప్రిల్ 14న మా గృహప్రవేశానికి మా తిరువనంతపురం వెళ్ళా. అప్పటికీ ఇప్పటికీ ఆ నగరం ఎంతో మారిపోయినట్లు అనిపించింది,'' అంది రాధ.

★ ''మీరు ఒక బిడ్డకు తండ్రి అయ్యారన్న విషయం తెలిస్తే, మీ అభిమానులకు మీ మీదున్న గ్లామర్ తరగిపోదా?'' అని ఒకరడిగిన ప్రశ్నకు రజనీకాంత్ ''పెళ్ళయి రెండేళ్ళయినా ఇంకా తండ్రి కాకపోతే మరో విధంగా శంకిస్తారేమో అభిమానులు?'' అంటూ నవ్వారు.

★ ''ఒక హిందీ పిక్చర్‌లో నటించడానికి రాఖీ మద్రాసు వచ్చినప్పుడు ఆమెను వాహినీ స్టూడియోలో కలిశాను. చాలాకాలం క్రితం ఆమె నటించిన ఒక చిత్రానికి నేను డాన్స్ డైరెక్టర్‌కు అసిస్టెంట్‌గా పని చేసిన విషయం గుర్తుందా — అని అడిగాను. ఆమె కొన్ని క్షణాలపాటు నా వంకే తదేకంగా చూసి, 'అరే! ఆ అబ్బాయివా నువ్వు? నమ్మలేకుండా ఉన్నాను. ఎంత తక్కువ వ్యవధిలో ఎంత పైకొచ్చేశావ్?' అంటూ అభినందించింది. గుర్తున్నా గుర్తులేనట్లు కొందరు నటించే ఈ రోజుల్లో ఆ మహానటికి నేనింకా జ్ఞాపకం ఉండడం ఆశ్చర్యంగా లేదూ?'' అన్నారు కమలహాసన్.

'అమర గీతం' లో పూర్ణిమా జయరాం



వేలాది కుటుంబాలు అనాదిగా వాడ్తబడుతున్న
లవంగనూనె ప్రభావాలన్నింటినీ ప్రామిస్‌లో మళ్ళీచూసారు.

లవంగనూనెతో కూడిన సాటిలేని టూత్‌పేస్ట్ ప్రామిస్

మీరూ ఎందుకు వాడి చూడకూడదు మరి!



ప్రామిస్
దంతక్షయంనుండి రక్షణకు
తోడ్పడుతుంది. నోటినితాజాగా
రూపొందించి
దుర్వాసనను అరికడుతుంది.


బల్సారా ఉత్పాదన

Monde Selection
Gold Medal Winner

ఆరోగ్యంచిందే పళ్ళు,
చిగుళ్ళు, తాజాశ్వాస–
అదే మరి ప్రామిస్ వాగ్దానం.

CHAITRA-BLS-453R TEL

ఇప్పుడు ఖాళీ ట్యూబ్ ఆఫరును 31 డిశంబరు 82 వరకు ఆఖరిసారిగా పొడిగించబడినది


సున్నితమైన రతి చర్మసౌందర్యాన్ని మరింత
సున్నితంగా తీర్చిదిద్దేది లక్స్
ఉవ్విళ్ళూరింపజేసే రతి అందానికి కారణం ఆమె మెచ్చే, ఆమెకోనచ్చే లక్స్.
లక్స్ ఆమె చర్మ సౌందర్యాన్ని అందంగా, అపురూపంగా తీర్చిదిద్దుతుంది,
''నా చర్మ సౌందర్యాన్ని మృదువుగా, మనోహరంగా
రూపొందించుకునేందుకు నేను వాడేది లక్స్''
అంటుంది రతి.
Rati Agnihotri
LUX
PINK
శుద్ధమైన, సౌమ్యమైన లక్స్—
సినిమా తారలకు సౌందర్యాన్నిచ్చే సబ్బు
హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ వారి విశిష్ట ఉత్పాదన
HTB-HLL-5760

సీరియల్

కాలంకరిబాక

వలివేటి నాగచంద్రావతి

(గత సంచిక తరువాయి)

బొమ్మ తిరగబడి బొరుసు అయినట్టు ఇప్పుడు ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుతో బాధపడుతోంది కామేశ్వరమ్మ.

అయితే ఈ సంబంధంమీద పూర్తిగానూ మనసు విరగలేదు. ఎంచేతంటే, ఇంత సంపదా ఇవాళ కాకపోయినా రేపయినా మాకు చెందేదేకదా అన్న దిలాసా —

తన కూతురు నా గడప మెట్టేక ఈ డాబూ, దర్పం వెనక్కిపెట్టి నా కాళ్ల దగ్గరకి రావలసినవాడే కదా ఈ వియ్యంకుడూ అన్నధీమా —

ఆ మూడుముళ్లూ పడితే కోడలి పొగరణచటం మాత్రం ఎంతసేపని ? "ఒరే నాయనా — ఆ తళుకూ బెళుకూ తగ్గించకపొయ్యేవంటే నువ్వు వెంటబడ్డట్టే మిగతా కుర్రకారూ వెంటపడగలరు కోడలుపిల్ల వెంట" అని ఒక్క ముక్క అందిస్తే చాలు పెళ్లాన్ని కట్టడిలో పెట్టేపని తన కప్పగించడా కొడుకు అనీ — ఇంకా నమ్మకం విశ్వాసం మిగిలే వున్నాయావిడకి

సరే సాయంత్రమయింది. 'టీ' సేవిస్తూ సావిట్లో సమావేశమయ్యారు.

'ఎందుకు తాత్సారం ? చప్పున బేరం సెటిల్ చేసేసుకుంటే ఈ ఉక్కిరి బిక్కిరి వాతావరణం నించి తప్పుకుని ఇంటికిచేరి ఊపిరి పీల్చుకోవచ్చును' అనుకుని కామేశ్వరమ్మే మొదలుపెట్టింది.

"ఆలస్యమెందుకు అన్నయ్యగారూ ! ఈ పూట వర్జం లేదు. అన్ని విషయాలూ ఇప్పుడు మాట్లాడేసుకుంటే రేప్రొద్దున్న తాంబూలాలు పుచ్చుకుని మేము వెళ్లిపోతాం" అని.

కాబోయే కోడలి కలివిడితనంలోనూ, వియ్యమందబోయే వియ్యంకుడి విజ్ఞానంలోనూ తల మునకలుగా తబ్బిబ్బవుతున్న కేశవరావుగారు తను ఎత్తుకోవాలిసిన వ్యవహారాన్ని భార్య కదిపేసరికి హఠాత్తుగా తెలివి తెచ్చుకుని, "అవునండీ వ్యాపారం గుమాస్తాలమీద వదిలి వచ్చాను. మనమిక అసలు విషయంలోకి వద్దాం" అని తొందరపడుతూ భార్యకి వంత పలికారు.

అందాకా జీడిపప్పు పలుకులు నోట్లో కెగరేసుకుంటూ వసంతలక్ష్మితో అవకతవకగా చదరంగం ఆడుతోన్న బిందు ఈ సంభాషణ మొదలవంగానే ఇబ్బందిగా లేచిపోయింది

ఐదు నిమిషాల్లో డ్రస్ మార్చుకునొచ్చి, "డాడీ ! మీరు మాట్లాడుతూవుంటారుగా...నేనలా బయటకు వెళ్లివస్తాను" అని తండ్రికి చెప్పి, వెంటబడుతున్న వసంత చెయ్యి పుచ్చుకుని "ఆంటీ వసంతని కూడా తీసుకెడుతున్నాను" అని కామేశ్వరమ్మకు కూడా చెప్పి సమాధానానికి ఎదురు చూడకుండానే బయటకు నడిచింది.

నేవీబ్లూ కలర్ జీన్సూ, మెళ్లో పెద్ద పెద్ద రుద్రాక్షమాలా వేసుకుని ఓ పెద్ద నైలాన్ రుమాలుతో జుట్టు ముడేసి హైహీల్సు టకటక లాడిస్తూ వసంతని వెంటేసుకు బిందు వెళ్లిపోతూంటే మాటలు ఆపేసి విస్తుపోతూ చూస్తూండిపోయింది కామేశ్వరమ్మ.

ఒకసారి కొడుకు కాలేజీ యానివర్సరీ అయితే వెళ్లింది. అదేదో ఫేషన్ పెరేడ్ అట. చిత్రవిచిత్రమయిన కట్టూ బొట్టూతో ఆడపిల్లలు ముస్తాబై వచ్చి చూపించారు. స్టేజిమీద ప్రదర్శన వరకే పరిమితమనుకొన్న ఆ వేషమే బజారు తిరగబొయ్యే ఈ పిల్ల వంటిమీద చూస్తోందిప్పుడు.

"ప్చ్ ... ప్చ్ ... లాభంలేదు. ఎన్ని పుటాలు వేస్తే ఈ పిల్ల బుద్ధి శుద్ధి అయ్యేను" అని మనస్సులోనే వాపోయింది కామేశ్వరమ్మ.

తెప్పరిల్లి వింటే రంగారావుగారంటున్న మాటలు చెవులకు వినిపించి పూసిన నోటితో మిరపకాయ నమిలినట్టు మండిపోయిందావిడ లోలోపలే.

కామేశ్వరమ్మ గుచ్చుతున్న చూపుల ముళ్ల వెళ్లే కుమార్తె వస్త్రధారణ పైన్నే అని ఆయన గ్రహించుకున్నట్టుంది. "ఈ పిల్లలు వయస్సులో ఉన్నప్పుడు అలంకారాలకీ, ఫేషన్లకీ ఎంత ప్రాముఖ్యమిస్తారో చూశారా ? ఆ యేజ్ దాటిపోతే వాళ్లూ ఒక పద్ధతికి అలవాటు పడిపోయి, ఈ వేషాలు వాళ్లంతట వాళ్లే మానుకుంటారు. పుబ్బలో పుట్టి, మఖలో మాడిపోయే యింత సింపుల్ విషయానికి మనం వర్రీ అయి, వాళ్లని రాపాడించడం నాకంత నచ్చదు సుమండీ !

పాతనే పట్టుకు వేళ్లాడే మనం మన ముసలి భావాలు కాస్త సడలించి వాళ్లని చూడండి. తోటలో అప్పుడే వికసించిన రకరకాల పువ్వుల్లాగా, స్వేచ్ఛగా ఎగిరే సీతాకోక చిలకల్లాగా వుండరూ ?" అంటో కేశవరావుగారికేసి చూశారు రంగారావుగారు 'ఏమంటార'న్నట్టు.

"మరె — మరె. కుర్రవయసులో మనమూ ఈ షోకుల్ని వేలం వెర్రిగా అనుకరించినవాళ్లమే. వెనకటివి మరిచిపోయి, పిదపకాలం పిదప బుద్ధులూ అంటూ ఇప్పుడు వీళ్లనిలా విమర్శిస్తున్నాంగాని" సమర్ధనగా బుర్ర వూగించేరు కేశవరావుగారు

ప్రస్తుతం రంగారావుగారు ఏం మాట్లాడినా సబబుగా సందర్భంగానే కనిపిస్తున్నాయాయనకి. రంగారావుగారి ఎదర ఓ గంటసేపు కూర్చుంటే వాళ్లనోసారి ప్రపంచ ప్రదక్షిణం చేయించేస్తారు. ప్రొద్దుటనించీ ఆయనగారి విషయ పరిజ్ఞానం ఎంత దొడ్డదో గ్రహించుతున్న కేశవరావుగారికి ఆశ్చర్యానికి తోడు, "అయ్యయ్యో లోకమింతుంటే, కూపస్థ మండూకంలా ఖాతా పుస్తకాలూ, లాభనష్టాల బేరీజుల్లోనే కాలం వెళ్లబుచ్చానే" అన్న చింత కూడా వలుగుతోంది.

తానతందాన అంటున్న భర్తకేసి కొరకొర చూసి పెదవి విరిచేసింది కామేశ్వరమ్మ అజ్ఞాసి 'చేరి మూర్ఖుల మనసు ... ' అన్న పద్యం గుర్తు చేసుకుని అక్కడి కావిడ మనస్సు ఒప్పించే కార్యం నించి విరమించారు రంగారావుగారు

ఆ తరవాత కూడా ఆవిడ ఎంత నలుగుడు పడని రకమో సంభాషణ సాగేకొద్దీ రంగారావుగారికి తెలిసి వచ్చింది.

ఒడుగు కావిడట; వెండి పానకం బిందెలట; స్నాతకానికి పట్టుబట్టలట; కాళ్లు కడిగేందుకు వెండి పళ్లెమట; బాలీసుపీటలట, వియ్యపురాలి కట్నంట; ఆడబిడ్డ లాంఛనాలట, అప్పగింతల బట్టలట; అలకపాన్పుమీద స్కూటరుట, బంధు జనాలకి మర్యాదలట; సారెతో తేవాలిసిన సామాన్లట. ఇలా ఇలా చేసిన పాపాలు చిత్రగుప్తుడు చదువుకుంటూ పోతున్నట్టు తమకు పెళ్లిలో ముట్టాలిసిన వన్నీ ఆవిడ వరుస తప్పకుండా ఏకరువు పెడుతోంటే

జరిగిన కథ — 8 : కేశవరావ్, కామేశ్వరమ్మగార్ల ఏకైక పుత్రుడు మురళి — రంగనాథం, రాజ్యలక్ష్మమ్మగార్ల ఆఖరి సంతానం మీనాక్షిని మాయమాటలతో మోసపుచ్చి తన కోర్కెను తీర్చుకొంటాడు. కామేశ్వరమ్మకు ఆడపిల్ల పుడుతుంది. మీనాక్షి గర్భవతి అవుతుంది. మురళిని కేశవరావ్ వైజాగ్ మెడికల్ కాలేజీలో చేర్పించి వస్తాడు. చివరికి చేసేదిలేక మీనాక్షిలో పెరుగుతున్న పాపాన్ని రాజ్యలక్ష్మమ్మ నాటు వైద్యంతో నిర్మూలించటానికి ప్రయత్నిస్తుంది. ఆ వైద్యం మీనాక్షి ప్రాణాల్నే హరిస్తుంది. మురళి చదువు పూర్తిచేసి హౌస్ సర్జన్ చేస్తుంటాడు. రంగారావుగారి ఏకైక పుత్రిక హిమబిందుతో పరిచయం కల్గుతుంది మురళికి ఆమె మనసులో కూడా స్థానాన్ని సంపాయిస్తాడు. కేశవరావ్‌గార్కి కాబోయే కోడలు బిందు నచ్చింది. కానీ కామేశ్వరమ్మకు మాత్రం ఆమె వేషధారణ, చిన్నపిల్లల చేష్టలు, మగరాయుళ్లా తిరగటం సుతరామూ నచ్చలేదు. అలాగని రంగారావుగారి ఆస్తి, అంతస్థు, హోదా ఇవన్నీ చూసాక ఒప్పుకోకుండానూ వుండలేకపోతోంది.

పిత్తరువులా చేష్టలు దక్కి వింటూండిపోయాడు రంగారావుగారు.

ఆడపిల్ల తండ్రిని గాయం చేయకుండానే లోపలి రక్తాన్ని జుర్రేసే ఇలాటిలాటి అద్భుతమైన లాంఛనాలనబడే ప్రక్రియలుంటాయన్న వైనమే ఆయనకు సరిగ్గా తెలియదు.

ఆయన ఓ బీదింటి పిల్లని మనసుపడి చేసుకున్నాడు కొడుకు సౌఖ్యమే తమకు ముఖ్యమనుకున్నారు ఆయన తలితండ్రులుకూడా ఉభయ ఖర్చులూ తామే భరించి గుళ్లో పెళ్లిచేసి మనస్ఫూర్తిగా అక్షింతలు వేశారు.

మారు చీరలో వచ్చిన కోడల్ని కుడికాలు ముందు మోపమని "మా ఇంటి మహాలక్ష్మి" అంటూ ఆదరంగా చెయ్యిచుట్టి దగ్గరకు చేర్చుకున్నది ఆయన తల్లి.

గతంలో తనకు చెందినంతవరకూ ఈ విశాల హృదయ సౌందర్యాలనే, ఈ లలిత సంస్కార ప్రవర్తనలనే, ఈ ఆర్ద్ర మనోహర ప్రకృతులనే ఎరుగును ఆయన.

అందరూ తనవారిలాగే వుంటారనికాదు ఏవో కొన్ని ఆచారాలూ, ఆనవాయితీలూ, సరదాలూ వుంటాయని ఆయనకీ కొద్దిగా తెలుసును

కానీ కామేశ్వరమ్మ చెప్పేవి ఎంత వింతగా, విపరీతంగా ఉన్నాయి ? అడుగడుగునా ఏదో వంకని ఏవేవో! పిండినవి చాలదు కాబోను, దొంగచెంబుట. . ఎవరికీ చెప్పకుండా ఎత్తుకెడతారుట దానికో వెండి చెంబు తెప్పించాలన్నది. ఆడపిల్లని కన్నవాళ్లు నాతితో సమానమట. మగబిడ్డని కన్నవాళ్లకి తోడుకోవటమే పనిట, లాడూ, స్వీటు వొక్కెనా కావాలన్నది. ఎంత చిత్రాతి చిత్రమయిన లాంఛనాలు; ఎదుటి మనిషిని నిట్టనిలువునా దోపిడీ చెయ్యటానికి ఎన్ని పేర్లూ, ఎన్ని ఉపాయాలూ వున్నారు ?

తనమాట సరే ఇంతో అంతో వుంది; నెగ్గేసెయ్యగలడు. సామాన్య కుటుంబీకుడుంటాడు అతని మాటేమిటి ? ఒక్క ఆడపిల్ల పెళ్లితోనే హతమారిపోడా ? ఆడపిల్ల పుట్టడమే ఇంటికి అరిష్టమనుకోడా ? — సుదీర్ఘంగా నిట్టూర్చుకున్నారు రంగారావుగారు

"నయం బిందు లేకపోవటమో అదృష్టమయింది లేకపోతే ఎంత తగువగును ? మేము మీకిచ్చేవి సరే మీరు మాకిచ్చేవి ఏమిటని ఎదురు సవాళ్లు వేసేది ఇన్ని జరిమానాలు వేసేందుకు మా తక్కువా మీ ఎక్కువా ఏమిటని ఎదురు తిరిగేది ఈ చాదస్తపు ఆచారాలూ, ఈ మార్గపు పద్ధతులూ, ఈ అనవసరపు ఆడంబరాలూ వద్దు ఏ రిజిస్ట్రీ వివాహమో చేసెయ్యమని పేచీపెట్టేది " అనుకుని నవ్వుకున్నారు లోలోపలే.

'గమ్మత్తేమిటంటే ఆ తానులో ముక్కే అయినా మురళి వీళ్లలాగకాదు అతనికీ తమకిలాగే ఇలాంటివి గిట్టవు. అతని ఆలోచనలూ మనసూ ప్రగతికి అభిముఖంగా వుంటాయి ఎప్పుడూ' అని మురళిని తలుచుకు మురిశారు

"పాపం మురళికీ తెలిసుండదు; తల్లి మరీ ఇలా కాబూలీవాడి నకలులా ప్రవర్తిస్తుందని తెలిస్తే ఎంతో నొచ్చుకుంటాడు ఈ బేరసారాలకి ఎంతో సిగ్గుపడతాడు.

అయినా ఎందుకతనికి చెప్పి చిన్నబుచ్చడం ? ఏవో చిన్న చిన్న సరదాలు, ఇవ్వలేనివాడుకాదు తను. ఊ అంటే పోతుంది అక్కడికి వీళ్లనీ తృప్తి పరిచినట్టుంటుంది." అనే ఆలోచనల్లో వున్నారు రంగారావుగారు.

అక్కడితో కామేశ్వరమ్మ అడిగేవాటికి ఫుల్‌స్టాప్ పెట్టి ఆగినట్టయితే సమావేశం సవ్యంగానే ముగింపుకొచ్చేది.

అయితే అది అలా జరగలేదు అసలైన పాయింట్లు ఒక్కటొక్కటిగా ఆఖర్నే లేవనెత్తింది కామేశ్వరమ్మ.

"కట్నం ఏభై వేలకి తగ్గితే మా పరువు దక్కదు" అన్నది మొదటగా.


రంగారావుగారు పరిహాసంగా, "గట్టిగా అనకమ్మా చెల్లెలా! కట్నమివ్వటంగానీ, పుచ్చుకోటంగానీ నేరం ఆ మాట నువ్వెత్తకూడదు. నేనొప్పకూడదు" అని తేలగొట్టజూశారు

కామేశ్వరమ్మ పడనివ్వలేదు "ఇచ్చేవాళ్లు ఇస్తూనూ వున్నారు. పుచ్చుకునేవాళ్లు పుచ్చుకుంటూనూ వున్నారు ఇలాంటి చట్టాలన్నీ కాగితాల మీద వరకే పరిమితం మీకు తెలీందేంవుందీ ? కాదంటారా . . ఇక మాటలే అనవసరం మనం లేచిపోవచ్చు" అంటూ ఖరాఖండీగా తేల్చేసింది.

'ఇదీ సరదాల వంటిదే అవుతుందా ? తన అభిమతానికి విరుద్ధమయిన పనే—ఎలా చెయ్యటం ? ఒప్పుకోవటమా — మానటమా ?' అని ఆయన ఇంకా ఓ పక్కని గుడిసుళ్లు పడుతూండగానే ఆయన మౌనాన్ని పూర్ణాంగీకారంగా తీసుకుని, "అబ్బాయికి







స్వంత ప్రాక్టీసు పెట్టించే పూచీకూడా మీదే నండోయ్'' అని ఇంకో బరువు నెత్తికి చేర్చింది.

'ఓహ్ ఏమి ఆశ! ఎంత డబ్బు రంధి మనుషులు' అని ఆయన ఆశ్చర్యపడుతూండగానే మరో బాంబ్‌షెల్ విసిరింది.

''అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలన్నారు. రేపు మీరు 'అపుత్రస్య గతిర్నాస్తి' అని ఏ పిల్లవాణ్నో చేరదీయాలనుకోవచ్చును. ఏడాది ఆగితే మనవడే పుడతాడు. వాణ్నే దత్తత తీసుకుంటే గొడవే లేదనుకోండి .. అయినా ముందేం జరుగుతుందో ఏం చెప్పగలం? కీడెంచి మేలెంచమన్నారు. ఎటుపోయి ఎటువచ్చినా మీ అమ్మాయి 'అయ్యో పుట్టింటాశ లేకపోయిందే' అని బాధపడకుండా వుండాలి సగమాస్తి పసుపు కుంకుమ కింద అమ్మాయిపేర రాస్తే మంచిది. మిగతాది తదనంతరం రాసినా ... '' అంటో.

సహనమనేది ఓ సముద్రమయితే దాని చెలియలికట్ట తెగింది. ఆగ్రహమనేది ద్రవమయి, అదుపు అనేది ఒక పాత్ర అయివుంటే ఆ ద్రవం ఆ పాత్ర అంచుల్ని దాటి ప్రవహించింది.

'ఉన్నకొద్దీ మరీ మితిమీరుతోందే ఈవిడ ఆగడం. తన ఆస్తినీ భవిష్యత్ కార్యక్రమానికి కూడా బిరిగీసి శాసించే అధికారం, సాహసం ఈవిడకెలా వచ్చేయి? ఊరుకుంటే తననికూడా సంతలో నిలబెట్టి అమ్మిపారేసి డబ్బు చేసుకునేలా వుంది' కూడదీసుకుంటూ వస్తున్న రంగారావుగారి నిగ్రహం కాస్తా పునాదుల్తో సహా కదిలింది.

వెంటనే ఘాటుగా సమాధానం చెప్పేశారు

''నాకూ కొన్ని నియమాలున్నాయి. కట్నం రూపేణా పైసాకూడా ఇవ్వకూడదన్నది అందులో ఒకటి. ఇక నా ఆస్తి సంగతి. అది అంతా నా స్వార్జితం. బిందు కిందులో చిల్లిగవ్వకూడా ముట్టదు. పిల్లణ్ణి దత్తు తీసుకుంటానో, గుర్రప్పందేలలో పెడతానో అదంతా నా యిష్టం. బిందుని ఒట్టి బిందుగా మాత్రమే కన్నెధార పొయ్యగలను. అందుకు మీరిష్టపడితేనే మా అమ్మాయి మీ ఇంటి కోడలవుతుంది'' అని.

కాలం కరిచాక

దాంతో అప్పటివరకూ నార్మల్‌గా వున్న వాతావరణంలో హఠాత్తుగా వేడిమి వ్యాపించిన అనుభూతి కలిగింది అందరికీ.

పచ్చని అరిటాకు పరిచి, దాన్ని నవకాయ పిండివంటలతో నింపి, 'ఈ ఆకంతా నీదే' అని వూరిస్తూ ఎదర కూర్చోబెట్టింతరవాత, 'అందులో పదార్థాలు తప్ప సుమా!' అని చల్లగా హెచ్చరిస్తే ఎలా వుంటుంది? అదిగో సరిగ్గా అలాగయింది కామేశ్వరమ్మ వ్యవహారం.

ముఖం గంటుపెట్టుకు కూర్చుంది కామేశ్వరమ్మ. ప్రతిస్పర్థిని చిత్తుచేసి వచ్చి అలుపు తీర్చుకుంటున్న వస్తాదులా సీరియస్‌గా శ్రద్ధగా చుట్ట చుట్టుకునే కార్యక్రమంలో నిమగ్నులయ్యారు రంగారావురావుగారు

ఎటుగూడీ కేశవరావుగారి పనే ఇరకాటాన పడింది.

ఇక్కడకు వచ్చేముందు అనుకున్నదేమిటంటే లాంఛనాల వరకూ సంభాషణ కామేశ్వరమ్మ పరంగా నడవాలని. ఆయనకది పెద్దగా ఎబ్బెట్టనిపించలేదు

ఎందువల్లనంటే ఆ ఆనవాయితీలూ, ఆ తతంగాలూ, ఆవిడకే ఎక్కువ అనుభవం. తనకు పరిచితి తక్కువ అంచేత ఆ వెర్షన్ ఆవిడకే ఒదిలెయ్యాలని ముందునించీ వారనుకున్నదే.

కానయితే రంగారావుగారెంత ఫార్వర్డు మనిషో

సందేహం

దేవుడనే వాడున్నాడా — అని
జీవుడికి సందేహం కలుగవచ్చు
అతడు జీవుడే కనుక;
జీవుడనే వాడున్నాడా అనే
సందేహమే దేవుడికి లేదు —
అందుకనే అతడు
దేవుడు!

— పైడిపాటి సుబ్బరామ శాస్త్రి.

తెలిశాక నాగవల్లి గుళ్లనీ, మధు పర్కాలనీ చెల్లించడానికి ఆయనకి మనస్కరించలేదు. కానీ తను వూరుకొమ్మందామన్నా భార్య వూరుకోదు. ఎవరేమనుకుంటారో అనుకుని వెనకాడేలాంటి బలహీనాలేవీ కామేశ్వరమ్మకి వుండవనీ, తాననుకున్నది సాగాలిసిందేననీ ఆయనకి బాగా తెలుసు. ''ఆయన సిద్ధాంతం ఆయనది. నా సిద్ధాంతం నాది. నా పద్ధతే మార్చుకోవాలనేమిటి?'' అంటుంది నిక్కచ్చిగా. గట్టిగా కాదంటే ఎదురుతిరగదు కానీ రుసరుసలాడుతుంది. ఆ తరవాత సాధించి చంపేస్తుంది.

ఎందుకొచ్చిన రభస అనే కామేశ్వరమ్మ లాంఛనాలడుగుతున్నంతసేపూ నోరెత్తలేదు. లోపల సిగ్గుగానే వున్నా పైకి మాత్రం, 'అది ఆడవాళ్ల సమాచారం గాబట్టి ఆవిడకే వదిలేశాను. అంతే సుమా' అన్నట్టు బింకంగా మొహంపెట్టి కూర్చున్నాడు.

కాగా సాగుసుగత్తె సవరంజడతో చెంపమీద చురుక్కుమనేలా కొడుతూ మోట శృంగారం ఒలికిస్తుంటే ఏడవలేక నవ్వుతున్న సరసుడిలా — భార్య కోరే గొంతెమ్మ కోరికలు మరీ అతి అనిపించినప్పుడు మాత్రం పాలిపోయిన మందహాసాలు రువ్వారు మధ్య మధ్య

మొగుడి ఈ వాలకం పసిగట్టేసింది కామేశ్వరమ్మ. ఎక్కడెక్కడి వాయు తరంగాలూ లాక్కునే పవర్‌ఫుల్ ట్రాన్స్‌మీటర్‌లా భర్త మనసులో ఏ భావాలు మెదిలినా చదివెయ్యటం ఆవిడ ఎప్పుడో నేర్చేసుకుంది.

'నేను అడుగుతుంటేనే తను తప్పు చేసినట్టు గిజగిజలాడే ఈ మెతక మనిషి ఆ మిలటరీ మనిషిని ఏమడగ్గలడు — ఏం రాబట్టగలడు? తను తీసుకునే చొరవకి ఆ తరవాత కోపం తెచ్చుకోనీగాక చివాట్లు పెడితే పెట్టొచ్చునుగాక. తనిప్పుడు ముందడుగు వెయ్యాలిసిందే. ఈ అదునులో 'ఊ' కొట్టించకపోతే ఆ తరవాత ఇస్తాడన్న భరోసా కనబడ్డంలేదు ఈ రంగారావుగారి దగ్గర. ఆ ఖర్చు అదీ చూస్తుంటే అసలు ఆస్తంటూ మిగులుస్తాడా అన్నదికూడా సంశయమే. నోరు విప్పితే సంస్కారాలూ, నిస్వార్థ సేవా అంటున్నాడు — ఏ శరణాలయానికో మహారాజ




మీ రిఫ్రిజిరేటర్ సదా మీతోటి సుఖజీవనం సాగించగలదే నంటారా?

రిఫ్రిజిరేటర్ అంటే మీ కుటుంబ సభ్యుల్లో ఒకరన్న మాటే. దవంత శ్రద్ధ చూపారంటే అది మీకిచ్చే సేవ మంరెతో.

మీ రిఫ్రిజిరేటర్‌లో గట్టిఉక్కుతో చేసిన లోపలి గోడలు వున్నాయేమో చూసుకోండి.

మీ రిఫ్రిజిరేటర్ లోపలి భాగం ప్లాస్టిక్‌దైతే జాగ్రత్త. గోద్రెజ్ అయితే మాత్రం దిగులేలేదు ఒక్క గోద్రెజ్ రిఫ్రిజిరేటర్లోనే ఎనామెల్ స్టీలు లోపలిగోడలు వున్నాయి. ఇవి తుప్పు పట్టడం, పెచ్చులూడడం, పగుళ్లు బారడం జరగదు. ఎక్కువ కాలం మన్నుతాయి

మీయింట్లో దీపాలకాంతి తగ్గినప్పుడూ, సంగీతం స్వరం తప్పినప్పుడూ మీ రిఫ్రిజిరేటర్ గుండెకూడా దడదడలాడుతుంది.



మీ రిఫ్రిజిరేటర్ ఎంత మాత్రం వోల్టేజి రెపరెపలను తట్టుకోగలదో చూడండి చాల రిఫ్రిజిరేటర్లకు ఈ వోల్టేజి రెపరెపలను 210 నుండి 230 వోల్టుల వరకు మాత్రమే తట్టుకుంటే గోద్రెజ్ 190 నుండి 250 వోల్టుల వరకు తట్టుకోగలదు.

మీ రిఫ్రిజిరేటర్ మీకు సొమ్ము ఆదా చేసి పెట్టగలదు.

మీ రిఫ్రిజిరేటర్‌లో నిలవకు చోటు ఎక్కువ వుంటే, టోకుగా కొనడం, రానూపోనూ ఖర్చుల రవాణాలలో ఎక్కువ ఆదా చేసుకోగలరు.

గోద్రెజ్ మీకు ఎక్కువ చోటు ఇస్తుంది. ఇందులో కూరల ట్రే వెనకదాకా వుంటుంది ఫ్రీజర్ కూడా పెద్దదే చిల్లర్ కూడా బాగా పె వుంటుంది. చక్కగా డిజైను చేయబడిన తలుపు ప్యానెల్ ఎక్కువ సీసాలు పట్టేలా షెల్ఫులు కల్గివుంది. అందుకే ఇంకా ఇంకా ఎన్నో ఎన్నో ఇళ్లలో గోద్రెజ్ అడుగు పెడుతున్నదంటే ఆశ్చర్యమేముంది. దేశంలో అత్యధికంగా అమ్ముడయే ఈ రిఫ్రిజిరేటర్ ఒకసారి ఇంట్లో అడుగు పెట్టిందంటే ఆ ఇంట్లో ఇక సదా సుఖ సంతోషాలే.

మీరు మీ రిఫ్రిజిరేటరును మరియు స్వయంగా మిమ్ములను చక్కగా సంతోషంగా ఉంచుకోవాలనుకుంటే ఈకూపన్ పూర్తి చేసి పంపండి. 'గోద్రెజ్ రిఫ్రిజిరేటర్ కేర్ బుక్‌లెట్' ఉచిత కాపీ పొందండి

పోషకుడయినా ఆశ్చర్యపోనక్కరలేదు. పోనీ ఎన్నాళ్ళు వుంటాడులే అనుకోటానికీ లేదు. ఉక్కుపిడుగులా వున్నాడు. ఉన్నన్నినాళ్ళూ ఆస్తంతా అల్లబిల్లి చేసి చివరికి కూతురి చేతికి ఆ రుద్రాక్షల మాలే ఇచ్చేటట్టుగా వున్నాడు.' అనుకుని తనే మొత్తం సూత్రమంతా చేతికి తీసుకుంది. ఒకదాని తర్వాత ఒకటి తను అడగదలుచుకున్నవన్నీ చకచక అడిగేసింది.

ఈ మార్పు కేశవరావుగారు ఊహించనిది. ఇంకా తన టర్ను కోసం వేచివున్నాడాయన. కామేశ్వరమ్మ ఇంత విసిగించినదానికి పరివారంగా తనెంతో మర్యాదగా వ్యవహరించాలనుకుంటున్నాడు. కట్నం వూసెత్తకుండా తన సంస్కారం నిరూపించుకోవాలనుకున్నాడు. 'పూర్వకాలం మనుషలే తప్ప డబ్బుకోసం గడ్డి తినే మనుషులు కాదు స్మీ. పొరపాటు పడ్డాను.' అన్న చూపు రంగారావుగారి కళ్ళకు రప్పించాలనుకున్నాడు. ఇక కొడుకు సొంత ప్రాక్టీసు పె[illegible]చే మాటా ఆస్తి రాతకోతల మాటా అసలాయన మనస్సులోకే రాలేదు

అయితే ఆయన ఆలోచనలు చెల్లిందెప్పుడు ? ముందస్తుగా కామేశ్వరమ్మ లీలలు పసిగట్టిందెప్పుడు ? ఇప్పుడూ షరా మామూలే అయింది.

ఏం చేస్తాడిక. గట్టిగా అదమాయించి సొంత భార్యని పరాయిచోట పరాయి మనిషి ఎదుట ఎలా పలుచన చేస్తాడు ?

కోపాన్ని దిగమింగలేక కళ్ళురిమి చూడబోయాడు కానీ, కామేశ్వరమ్మ ఆ చూపు తప్పించుకుని గడుసుగా ఆయనకేసయినా చూడకుండా వరండాలో ఆడుకుంటూ కూతురు కనిపించేసరికి, "నువ్వెప్పుడొచ్చేవే ?" అంటూ లేచిపోయింది

చేసేది లేక, "సరేలెండి. అబ్బాయి వస్తాడు కదా. అప్పుడు మాట్లాడుదాం." అంటూ అక్కడికా టాపిక్‌ని వాయిదా వేసి ఇంకోసారికి అవకాశం కల్పించుకున్నాడు.

కామేశ్వరమ్మ వరండాలోకి వచ్చి చూసింది. నైట్ క్వీన్ గుత్తులూ, రాధా మనోహరం మొగ్గలూ కలబోసి ఆడుకుంటోంది వసంత.

దగ్గరకు వెడుతూ, "నువ్వెప్పుడొచ్చేవే ? ఆ అమ్మాయి ఏదీ ?" అన్నది మళ్ళీ.

తలెత్తి తల్లిని చూసి నవ్వింది వసంత. "మేమిందాకానే వచ్చేశం. దార్లో అన్నయ్య కనిపించేడు. నన్ను తీసుకుని వచ్చేడు" చెప్పింది.

"వాళ్ళేరీ మరి ?" కామేశ్వరమ్మ చుట్టూ కలయచూసింది; ఏ చెట్టు వెనకాల గుసగుసలాడుతున్నారోనని.

"అన్నయ్య గదిలో ఉన్నాడు. నేను తోట్లో ఈ పూలు కోసుకుందుకు వచ్చేశేను" అన్నది వసంత ముందున్న పూలపోగు చూపిస్తూ.

'ఏడవబోయేవు' అనుకుంటూ కామేశ్వరమ్మ మళ్ళీ లోపలికి వెళ్ళింది.

విషయం మార్చి మళ్ళీ మామూలు వాతావరణం తేడానికి తంటాలుపడుతున్న కేశవరావు గారిని, "విన్నారా – అబ్బాయీ వాళ్ళూ ఇందాకనే

వచ్చేశారట. నేను వాడి గదికి వెడుతున్నా – మీరూ వస్తారా ?" అని అడిగింది.

"ఊ – వస్తాలే." చిరాగ్గా చిరచిరలాడారు కేశవరావుగారు.

ఆ వెంటనే అనిపించింది. పోర్షన్ అయిపోయినా రంగుమీద మోజాతీరని పాత్రధారి రంగంమీదే తచ్చాడినట్లు తానిక్కడ అయిపోయినదానికి చింతిస్తూ వ్యర్థంగా కూర్చునే బదులు, ఇప్పటికిక సెలవు తీసుకుని మురళి అభిప్రాయం ఏమిటోకూడా వెంటనే ఖచ్చితంగా తెలుసుకోవటం ముఖ్యమని తోచి లేచేరు కేశవరావుగారు.

దారిపొడుగునా, "మనని వాడు పిలిపించింది 'పొన్లే పెద్దరికం నిలబెడదాం' అనేకానీ ఇలా రసాభాస చెయ్యమనికాదే... నే చెబితే నీ కర్థంకాదులే... పద పద... వెడుతున్నాంగా వాడే పెడతాడు నీకు గడ్డి..." అంటో భార్యని సన్నసన్నగా చివాట్లేస్తూనే వున్నారు.

కామేశ్వరమ్మకు లక్ష్యమా ! ఆయనకు స్పష్టంగా వినబడకుండా ఏమిటేమిటో తనూ గుంజాకున్నది.

వీళ్లు వెళ్లేసరికి బిందూ, మురళి గదిలో వున్న మాట నిజమేకానీ కామేశ్వరమ్మ ఆత్రపడినట్లు ఏ ప్రణయ సన్నివేశంలోనో తేలిపోతూలేరు.

"గక్కున విడువంగవలసిన జాబితాలో నిన్నూ చేర్చేశాను – పో" అన్నట్లు మొహం కండలు చెండు కొంటో బిందుని గెంటేస్తున్నట్లు చూస్తున్నాడు మురళి.

నీ లెక్కేమిటన్నట్లు నిటారుగా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నది బిందు.

గంట క్రితంవించీ వారిరువురి నడుమా చెలరేగుతున్న దుమారానికి తుది పరిణామమే ఈ పరిస్థితి.

వారి వివాదానికి కారణమయిన విషయం పట్టించుకోని మనసుకి సర్వసాధారణమే అయినా, తప్పులు ఎంచేవారి దృష్టిలో మాత్రం బ్రహ్మాండ మయిన నేరమే.

జరిగిందేమిటంటే —

మొదట మధుసూదనరావు ఎలా ఉన్నాడో ఓసారి చూచివద్దామని బయలుదేరిన బిందు క్లినిక్‌లో

35 ఏళ్లకే పదవీ విరమణా !

ఇటీవల జపానులో జరిపిన ఒక సర్వేలో పాల్గొన్న కంప్యూటరు ఉద్యోగులు, ఇంజనీర్లలో సుమారు 70 శాతం త్వరగా ఉద్యోగంనుండి తప్పుకోవాలనే కోరకను వ్యక్తం చేశారు. వీరందరి వయస్సు 26 సంవత్సరాల లోపువుంది. మరో పది సంవత్స రాలలో అంటే వీరి వయసు 35 దాటక మునుపే ఉద్యోగ విరమణ చేయాలని ఆశిస్తున్నారు. పని కష్టంగా వుండటం, ఉద్యోగ నియమాలు బాధాకరంగా వుండటం యీ అసంతృప్తికి కారణం. వీరిలో చూపు మందగిస్తున్నట్లు 42 శాతం తెలియచేశారు. వీరిలో 59 శాతం మంది నెలకు మూడు సార్లు రాత్రి షిఫ్టులలో పనిచేస్తారు. మరో 14 శాతం మంది నెలకు పదిసార్లు రాత్రి షిఫ్టులలో పని చేస్తారు. ఉద్యోగులలో 30 శాతం మంది గత 12 నెలల్లో వ్యాధుల పాలయినట్లు తెలియచేశారు. జపానులో డేటా ప్రాసెసింగ్ రంగంలో 1700 కంపెనీ లున్నాయి. అందులో 93,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

అతన్ని పలకరించి అట్నించి అటే బీచికి వెళ్లి వసంతకి సముద్రం చూపించింది. ఇంటికి తిరిగి వస్తూంటే రామకృష్ణ కనబడి విష్ చేశాడు. బస్ కోసం నిరీక్షిస్తున్నారని తెలిసి అభ్యంతరం లేకపోతే తన స్కూటర్‌మీద డ్రాప్ చేస్తాను రమ్మన్నాడు.

చీకటి పడింది. ఆ టైములో ఆ రూట్‌లో బస్సందటం కష్టం. అలాంటి సందర్భంలో ఆ ఆహ్వానాన్ని తోసివుచ్చటం తెలివితక్కువ తనమనిపించుకుంటుంది.

సందేహించడం, వెనకాడ్డం బిందు స్వభావానికే విరుద్ధం. గమ్మున వసంతతోసహా అతనివెనక ఎక్కి కూర్చున్నది బిందు.

అలా వస్తూ ఆదే దారిన ఆసుపత్రి నించి ఇంటికి వస్తున్న మురళి కళ్లబడ్డారు.

నవ్వుతూ ఏదో చెబుతున్న రామకృష్ణ; అతని వీపుకు ఆనుకున్నట్లు కూర్చున్న బిందు; హాండిల్స్ రెండూ పట్టుకుని తనే స్కూటర్ నడుపుతున్న అనుభూతిని పొందుతూ ఉత్సాహంగా ముందు వంచున్న వసంత; ఇరుకు మెదడు మురికిగా ఆలోచించడానికి ఇంతకుమించిన దృశ్యం ఏంకావాలి ?

మురళిని చూసి వసంత "అన్న... అన్న" అని అరిచేసరికి స్కూటర్ ఆపాడు రామకృష్ణ.

యుక్తాయుక్త జ్ఞానం ఆ క్షణంలో నశించింది మురళికి.

నవ్వుతూ పలకరించబోయిన బిందుని కన్నెత్తి చూడలేదు. ఏదో చెప్పబోయిన రామకృష్ణ మాటలు వినిపించుకోలేదు. ఒక్క వూపున చెల్లెల్ని లాగి తన పక్కన నించోబెట్టుకున్నాడు. దారిన పోతున్న రిక్షా ఆపి చెల్లెల్ని ఎక్కించి తనూ ఎక్కిపోయేడు.

అతని దుడుకు చర్యని స్తబ్ధురాలయి, ఆ పైన అవమానం చేశేడన్న భావంతో కోపగించి, ఆ కుసంస్కారానికి అసహ్యించుకున్నదే తప్ప అతని దురాగ్రహానికి ఏమాత్రం వెరవలేదు బిందు.

అంతేకాదు – ఆ రిక్షాకంటే ముందుగా రామకృష్ణ స్కూటరుమీదే ఇంటికి చేరుకుని, లోపలికన్నా వెళ్లకుండా మురళిని ఎదుర్కోడానికి సిద్ధంగా గేట్లోనే పచార్లుచేస్తూ వుండిపోయింది కూడా.


మురళీ, వసంత వచ్చారు. వసంతని తోటలో వూలు కోసుకొమ్మని పంపించి వీళ్లిద్దరూ గదిలో మాటల సమరానికి తలపడ్డారు.


"మీకు మేనర్స్ అంటే అర్థం తెలుసా ?" బిందు తీవ్రంగా కోప్పడే విధానంలోనే ప్రారం భించింది.

'సారీ' అనో, 'ఎక్స్క్యూజ్' అనో, చేతులు నలుపుకుంటూ కాళ్లబేరానికి వస్తుందనుకున్న మనిషి నించి వచ్చిన ఎద్దేవా ప్రశ్న అది.

మురళి అపర దూర్వాసుడే అయ్యేడు.

"ఉహు ఇప్పటివరకూ తెలీదు. ఈవేళే తెలిసింది. మగాణ్ణి బాహాటంగా కావిలించుక్కూర్చుని





వీధులంట షికార్లు తిరగటమని." వెటకారం గొంతునిండుగా ధ్వనించిందతని స్వరంలో.

తుళ్లిపడింది బిందు. 'ఛఛ... ఎంత నీచమైన అభియోగం!' జుగుప్సతో, ఆవేశంతో బిందు మొహం కందిపోయింది.

"మీరు మితిమీరి మాట్లాడుతున్నారు." తన్నితాను అదుపున పెట్టుకుంటూ అన్నది బిందు.

"హద్దుమీరి ప్రవర్తించేవారికి బుద్ధిగరపడానికి మితిమీరటం తప్పనిసరి."

"ఆ హక్కూ అవసరం మీకు లేవు."

"అవి సంక్రమించబోతున్నాయి కనకే ఈ బాధ" మురళి నిట్టూర్చాడు.

"లేదు మురళిగారూ! అవి మీ కెన్నటికీ చెందవు." బిందు అసమ్మతిగా తల తిప్పింది అడ్డంగా.

"అంటే ?" నొసలు ముడిచాడు మురళి.

"మీకు ముందే చెప్పాను. నా వ్యక్తిత్వం నాకుంది; నా ఇష్టం నాకుంది; నా అభిరుచులు నాకున్నయ్; వాట్లమీద ఎవరి అధికారాన్నీ నేను సహించనని."

"నా భార్యగా నీ ఉద్దేశాలూ, నీ అలవాట్లూ కొన్ని తప్పించుకుతీరాలని నేనూ చెప్పాను." అన్నాడు మురళి మొండితనంగా.

తిరస్కారంగా చూసింది బిందు.

"మళ్లీ మొదటికి వస్తున్నారు మురళిగారూ! సుఖసంతోషాలతోపాటు, కష్టనష్టాలలో కూడా తోడునీడగా వుంటామనీ, మంచి స్నేహితుల్లాగా సహజీవనం గడుపుతామనీ పరస్పరం వాగ్దానాలు చేసుకోవటమే వివాహ లక్ష్యం. అంతేకానీ ఆవు

కాలం కరిచాక

మెళ్లో పలుపు కట్టినట్టు వరుడు వధువు మెళ్లో తాళి కట్టి సర్వాధికారాలతో స్వాధీనం చేసుకోవటం కాదు. అభిమానమున్న ఆడపిల్లకి ఒక మగవాడికి భార్య కావటంతోనే స్వంత వ్యక్తిత్వం చంపుకోవలిసి రావటం నిజంగా దుర్భరం. భార్య అవనీ భర్త అవనీ ఎవరికుండాలిసిన స్వేచ్ఛ వారికుండాలి. అలాగని ఆ స్వేచ్ఛని విశృంఖలంగా వాడుకోవటం మాత్రమే సహించరానిది. ఇవే ఆదర్శనం సత్యానికి మూలకాలని నా ఉద్దేశ్యం.

మీరు వీటితో ఏకీభవించేటట్టుగా లేరు. పెళ్లి కాకముందునించే నామీద అధారిటీ చెలాయించాలని చూస్తున్నారయ్యే మీరు." మలకన భావం వ్యక్తం చేస్తూ అన్నది బిందు.

వెంటనే పాయింట్ పట్టుకున్న ప్లీడర్లా తీక్షణంగా ప్రశ్నించాడు మురళి. "నీవు చెప్పిన నియమాలు నువ్వే ఉల్లంఘిస్తున్నావేం మరి ? నీ చేష్టలుమటుకు విశృంఖలం కావా ? నీకు అసలు ఆడా మగా తేడా వుందా ? అంత ఫ్రీనా ? అంత ఎడ్వాన్స్డా ? అది తప్పు అని చెప్పడం తప్పవనా ?"

బిందు నిట్టూర్చింది. "మనసు నిష్కపటంగా వుంచుకోవాలి తప్ప శరీరం తగిలినంత మాత్రానే పవిత్రత మలినమవుతుందనే మూఢత్వం నాకు లేదు. మానసిక వ్యభిచారం చేసినా ఫరవాలేదు కానీ పైకి మాత్రం పమిట నిండా కప్పుకుని మడి కట్టుకున్నట్టు నటించాలి మీలాంటివాళ్లకు. నాకు నటన చేతకాదు. మీకు నా పద్ధతులు ఇమడవు. ప్చ్... లాభం లేదు. మీకూ నాకూ ఏ విధానా పొత్తు కుదరదు. మనం స్నేహితులుగా విడిపోవటమే మంచిది." తాపీగా, ఓపిగ్గా, దృఢంగా చెప్పేసింది.


మురళి మొహం వివర్ణమయింది.


అంతలోనే, 'ఆఫ్టరాల్ ఒక ఆడపిల్లతో తిరస్కారమా ?' అని పౌరుషం పొంగుకొచ్చి పరవళ్లు తొక్కింది. "నీకంటే ముందే నేనామాట చెబ్దామనుకున్నాను" అన్నాడు పెళుసుగా.

మాటలు ఆపారు.

అస్త్రాలు విడిచిపెట్టి, వైరాగ్యంలో పడినట్టు ఒకరు నిశ్చలంగానూ, దెబ్బతీసిన పగవాడిని ఎదురు దెబ్బ తీయకుండానే జగడ మాగిపోతే కసితీరక పళ్లు నూరుతున్నవాడిలా ఒకరు మింగేశేలా చూస్తూనూ మవునంగా వున్న ఈ సమయంలోనే కేశవరావుగారూ, కామేశ్వరమ్మా ఆ గదిలోకి ప్రవేశించారు.

(ఇంకా వుంది)


"మొండిఘటం"లో ఒకదృశ్యం


మీ స్నానమునందు ఒక క్రొత్తదనము నిచ్చు
సబ్బు - ప్రేమ్
క్రొత్త
సుకుమారమైన మీ చర్మ సౌందర్యమునకు ప్రేమ్.
దీని పరిమళము స్వచ్ఛమైన నురగ మీ శరీరమును
ఆహ్లాదింపజేయును
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చు సబ్బు-ప్రేమ్.
Imageads-M-1564
NEW
Prem
REFRESHING SOAP
PREM
జయలక్ష్మి
గుంటూరు వారి తయారీ
ప్రేమ్ - తాజాతనము నందించు సబ్బు.

(గత సంచిక తరువాయి)



[ఇంకా ఉంది]



బొట్టుపెట్టె

కె.కె. రఘునందన

వేకువ ఝామున భర్త దీక్షితులు గుడికి వెళ్లే సమయానికే లేచి స్నానం చేసి పావలాకాసంత కుంకుమ బొట్టు ముఖాన పెట్టుకోవడం సౌభాగ్యమ్మకు అలవాటు.

రోజూలాగే నుదుట బొట్టు పెట్టుకుందికి బొట్టుపెట్టె తెరిచింది సౌభాగ్యమ్మ.

నల్లని చెక్కపెట్టె. ఒక వైపు గొళ్లెం ఊడిపోతూ తన వయస్సు చాటుతోంది. పెట్టెలో తిలకం మరకలు, కాటుక పూతలతో చాలా అసహ్యంగా రోత కలిగిస్తోంది.

ఒక్కసారిగా తలుచుకుంటే ఎంతగానో ఆశ్చర్యం వేసింది ఆమెకు. 'తన తాతల నాటిదీ బొట్టుపెట్టె' అని దీక్షితులు చెప్పేవాడు. అందుకే క్రొత్త బొట్టు పెట్టె కొనమని భర్తను ఎన్నోసార్లు అడిగింది సౌభాగ్యమ్మ. కాని ఆమె కోరిక తీర్చలేని నిస్సహాయుడయ్యాడు దీక్షితులు.

అయినా సౌభాగ్యమ్మకు మామూలు చెక్క బొట్టుపెట్టెలు, ఇత్తడి పెట్టెలు కొనాలని లేదు. లేకపోతే ఏ నాడో తీర్చేవాడు దీక్షితులు. ఆమెకు వెండి బొట్టుపెట్టె కొనుక్కోవాలని కోరిక పుట్టింది. అది ఎన్నాళ్ల నుంచో ఆమెలో చోటు చేసుకుని క్రమక్రమంగా మనసంతా పరచుకుంది.

వెండి పెట్టె కొనుక్కోవాలన్న కోరిక పుట్టడానిక్కారణం ప్రక్కింటి కాంతమ్మ గారింట్లో ఉన్న బొట్టుపెట్టె, చూసీచూడగానే సౌభాగ్యమ్మను ఆకట్టుకుంది.

అందంగా మిల మిలా మెరుస్తూన్నా వెండి బొట్టుపెట్టె— కుంకుమలు పోసుకుందికి రెండు అరలు, తెరవగానే ఎదురుగ్గా అద్దం, చుట్టూ అద్భుతమైన డిజైన్‌తో అత్యంత ఆధునికంగా ఉంది.

తనక్కూడా అటువంటిపెట్టె కొనుక్కోవాలని అనిపించేది సౌభాగ్యమ్మకు. కాని రెండేళ్లక్రితం టీచరుగా రిటైరైన భర్త దీక్షితులు — ప్రస్తుతం రామ గుడిలో అర్చకత్వం వల్ల నెలకు తెచ్చుకుంటున్న వందరూపాయల ఆదాయం వలన తన కోరిక ఎలా తీర్చగలడని అనుకుని ఉదాసీనం వహించేది.

పోనీ పెద్దకొడుకు శేఖరానికి వ్రాస్తే!? పాపం వాడికి తనంటే ప్రేమే! మొన్న వేసంగి సెలవులకు శ్రీకాకుళం నుంచి వచ్చినప్పుడు కూడా ఒట్టి చేతులతో రాకుండా భర్తకు ఒక గ్లాస్కోపంచె, తనకు ఒక పట్టుచీరా పట్టుకొచ్చాడు.

ఉద్యోగం పెద్దదే కనుక వాడికి తన కోరిక తీర్చడం ఏపాటి? తన మాట కాదనడు.

సౌభాగ్యమ్మలో చెదురు మదురుగా ముసురు కుంటున్న ఆలోచనలు.

ఒకరోజున శేఖరానికి ఉత్తరం వ్రాసింది సౌభాగ్యమ్మ.

* * *

చిరంజీవి శేఖరానికి —

మీ అమ్మ దీవించి వ్రాయు ఉత్తరం. ఉభయకుశలోపరి. నీవు శ్రీకాకుళం వెళ్లిన తర్వాత ఉత్తరం వ్రాయలేదని నాన్న బాధపడ్డారు. వాసంతి ఎలా ఉంది? ఆ రోజున ఇక్కడి నుంచి జ్వరంతో వెళ్లింది. పాపం!! అయినా నే నిక్కడ మీకే సౌకర్యాలు చేయలేక పోయాను. అదే నా బాధ. కృష్ణమోహన్,

బొట్టు పెట్టె

సుశీల బాగున్నారా? చిట్టిగాడు సైకిల్ కొనమని అల్లరి చేస్తున్నాడా?

నేను ముఖ్యంగా ఈ ఉత్తరం దేనికి వ్రాస్తున్నానంటే — నా దొక చిన్న కోరిక. కొడుకువి కనుక నిన్ను చనువుగా అడిగే అధికారం నాకుంది. మీ నాన్నగారి పరిస్థితి నీకు తెలుసు! నాకు చాన్నాళ్ళ మంచి వెండి బొట్టుపెట్టె కొనుక్కోవాలని ఉంది. కనుక ఎలాగైనా నా కోరిక తీర్చు. అలా తీరుస్తా వనే నా నమ్మకం. వెంటనే ఏ విషయం వ్రాయి.

నీ ఉత్తరం కోసం ఎదురుచూసే
మీ అమ్మ సౌభాగ్యమ్మ

ఉత్తరం చదివిన శేఖరం ఒక్కసారి బరువుగా నిట్టూర్చాడు.

"ఏమిటండీ ఆ ఉత్తరం" వంటగది లోంచి వచ్చిన వాసంతి భర్త చేతిలోని ఉత్తరం గబుక్కున అందుకుని చదివింది.

"అయినా మీ అమ్మగారికిదేం కోరికండీ! బొట్టు పెట్టుకోడానికి ఏ పెట్టైతే నేమిటి? వెండి బొట్టుపెట్టెతో ఊళ్ళూరేగాలా? మనమే ఏదో కొంత ఎదిగామని ఈవిడగారి ఉసురు. చాదస్తం కొద్దీ యిటువంటివి కోరితే మనం బ్రతకాలా వద్దా!"

వాసంతి అత్తగార్ని ఎత్తి పొడిచింది.

తల్లిని అనరాని మాటలు అనడం శేఖరం సహించలేకపోయాడు ఒకప్పుడు తన తండ్రి తనకీ బిక్ష పెట్టకపోతే యింకా ఆ నిరుద్యోగపు టూబిలోనే యిరుక్కుని ఉండేవాడు. అప్పట్లో తల్లి ఒత్తిడి వల్ల తన తండ్రి కోటపాలెం వెళ్ళి నాయుడిని బ్రతిమాలి ఉద్యోగం వేయించాడు.

అటువంటి మాతృమూర్తి కోరిన కోరిక చాలా చిన్నది. అది తీర్చటం తన కర్తవ్యం, నైతిక బాధ్యత.

శేఖరం కోపంగా చూడటంతో చురచురా చూస్తూ లోనికి నడిచింది వాసంతి.

శేఖరానికి తల్లి కోరికను ఎలాగైనా తీర్చాలనిపించింది. సాయంత్రం బజార్లో కెళ్ళి వెండి బొట్టుపెట్టె ఖరీదు ఎంతవుతుందో కనుక్కున్నాడు. ఐదు వందలవుతుందని చెప్పాడు కొట్టువాడు.

ఆ సమయంలో శేఖరం చేతిలో చిల్లిగవ్వ

లేకపోయింది. బ్యాంకు బ్యాలన్స్ చూస్తే ఇరవై రూపాయలున్నాయి. రెండు రోజుల క్రితమే వాసంతి తండ్రికి జబ్బు చేసిందని చూడ్డానికి వెళ్లినప్పుడు—అవసరానికి ఆదుకోక పోతే బాగుండదని తన దగ్గరున్న ఐదు వందలు యిచ్చాడు.

ఈ సమస్యనెలా పరిష్కరించాలో అర్థం కాలేదు శేఖరానికి. ఇంతలో మెదడులో సుగుణాకరం మెరిసాడు. ఔను వాడు తనకి ఐదు వందలు బాకీ. ఎలాగైనా వాడిని అడిగి తీసుకుని తల్లి కోరిక తీర్చాలి.

శేఖరం అదృష్టం కొద్దీ బజార్లోనే సుగుణాకరం కనిపించి — "ఏంవోయ్! ఇందాకా యింటికి వొస్తే ఎక్కడికో దయ చేసావని మీ శ్రీమతిగారు చెపితే నీకు యిమ్మని చెప్పి ఐదు వందలూ యిచ్చేసాను. ఏమిటి విశేషాలు ?" అని చెప్పాడు.

శేఖరం మనస్సు గాలిలో దూది పింజలా తేలిపోసాగింది. భగవంతుడు కరుణించి తనకు తల్లికోర్కె తీర్చే భాగ్యం కలిగించాడు.

శేఖరం మరింక మాట్లాడే స్థితిలోలేడు. వెంటనే వస్తానని చెప్పి యింటికి దారి తీశాడు.

ఆ సమయంలో వాసంతి — ప్రక్కింటి అండాళ్లమ్మతో కబుర్లు చెబుతోంది.

"ఇంకొక్క గంట ఆలస్యమైందంటే నాకు సూట్ అయిన ఈ బూటాన్ చీర మిస్ అయిపోయేది వదినగారూ!" అంటోంది వాసంతి.

"నిజానికి ఈ చీరలో మీరు జయసుధలా ఉంటారంటే అతిశయోక్తి కాదు వాసంతి గారూ! ఉండండి పిండి రుబ్బాలింకా!"

శేఖరం రావటం గమనించి గబగబా వెళ్లిపోయింది అండాళ్లమ్మ.

శేఖరానికి వాసంతి చేసిన నిర్వాకం అర్థమైంది. తను తల్లికి ఎక్కడ డబ్బు పెట్టి బొట్టుపెట్టె కొనేస్తాడోనని వెంటనే తన అనుమతైనా లేకుండా చీర కొనేసుకుంది.

అదే విషయాన్ని సూటిగా ప్రశ్నిస్తే వాసంతి ముఖం మాడ్చుకుంది.

"అయినా మీకు నా మీదెప్పుడు అభిమానం ఉందిలెండి. ఏనాడైనా పెళ్లాం బాగు కోరారా? ఏమైనానా?? తల్లిగారికంటే నేను చులకనైపోయాను. అయినా ఈ ముదనష్టపు దానికా చీరలెందుకులెండి. నెల రోజులనుంచీ షావుకారు మంచి చీరలున్నాయని కబురు పెడ్తూంటే యివాళ తీరికా, డబ్బూ కుదిరాయి కనుక వెళ్లి కొనుక్కున్నాను. అన్నీ మీ దృష్టిలో నేరమే!" అంది ఏడుపుముఖం పెట్టి.

ఆ మాటలు శేఖరంలో మరింత అగ్గి పుట్టించాయి. భార్యతో తగవు పడితే చుట్టు ప్రక్కల వాళ్ల దృష్టిలో చులకన అయి పోతామన్న యింగిత జ్ఞానంతో ఉదాసీనం వహించాడు.

వెంటనే వీధిలోకెళ్లి అప్పుకోసం ప్రయత్నించాడు. కానీ లాభం లేక పోయింది.

ఆ రాత్రి ఒక నిశ్చయానికొచ్చాడు. ఇంకొన్నాళ్లాగితే తనకి అరియర్స్ రెండు వేల దాకా అందుతాయి. అప్పుడు తప్పకుండా కొనవచ్చు.

మర్నాడు తల్లికి తన యిబ్బందుల్ని వ్రాస్తూ యింకొన్నాళ్లలో ఎలాగైనా సరే బొట్టుపెట్టె కొని తెస్తానని వ్రాశాడు.

* * *

పాల పొంగుమీద చన్నీటి చిలకరింపులా శేఖరం ఉత్తరం సౌభాగ్యమ్మను నిరాశ పరచింది.

వెంటనే తనకు డబ్బు పంపించడమో, లేక బొట్టుపెట్టె కొని తీసుకుని రావడమో జరుగుతుందని ఎన్నెన్నో ఊహించింది ఆమె. కాని కొడుకు జవాబుతో తలక్రిందులైంది.

అసలు తనలా ఊహించడమే తప్పేమో!?

'ఎంత చెట్టుకి అంత గాలి' అన్నట్టు శేఖరానికి జీతం ఎక్కువే అయినా వాడి సమస్యలు వాడికున్నాయి. ఆ పట్నంలో అద్దె కొంపలో ఏ అగచాట్లు పడుతున్నాడో ఏమో!! వాడికీ పిల్లలూ, పెళ్లాం ఉన్నారు. ఏనాడైనా పట్నంలో పట్టుమని పదిరోజులైనా తను లేదు. తనకెలా తెలుస్తాయి వాడి యిబ్బందులు??

సౌభాగ్యమ్మ ఆలోచనలలోంచి తేరుకుని గుడినుంచి వచ్చిన భర్తకు విషయం చెప్పింది.

"అయినా నీది పిచ్చి కోరికే! వాళ్లని అడగట మేమిటి? ఏదో ఒకటి వాడుతున్నావు కదా!" అన్నాడు దీక్షితులు.

పేలవంగా నవ్వింది సౌభాగ్యమ్మ.

ఔను తనది పిచ్చి కోరికే! కాని తన మనసు మారుమూలల్లోంచి అదే కోరిక. రాత్రి కలలో సైతం ధగధగాయమానంగా ప్రకాశిస్తూ తనకు అందని దూరంలో ఉండి ఊరిస్తూ ఒక బొట్టు పెట్టె కనిపిస్తోంది.

ఆ రాత్రి పిచ్చిపిచ్చి ఊహలతో మెల్లగా నిద్రలోకి జారుకుంది సౌభాగ్యమ్మ.


* * *

సౌభాగ్యమ్మలో అంకురించిన కోరిక మర్రి వూడలా బలంగా ఆమెలో నాటుకుపోయింది. శేఖరం తాత్కాలికంగా ఆమెను నిరాశపరచినా మరింత ఆశ అల్లుకుపోయింది ఆమెలో.

ఇంక మిగిలింది చిన్న కొడుకు సుధాకరం! వాడు తన కోరిక తీర్చగలడేమో!

చిన్నప్పట్నించీ వాడ్ని గారాబంగా పెంచింది తను.

వాడు చదువుకునే రోజుల్లో నైతే చాటుగా శేఖరానికి తెలీకుండా పదో, పరకో చేతిలో పెట్టేది.



బొట్టుపెట్టె

చిన్నతనంలో తను చూపించిన ప్రేమ గుర్తుంచుకున్నట్లైతే సుధాకరం తన కోరిక తప్పకుండా తీరుస్తాడు.

ఆ రోజే సుధాకరానికి ఉత్తరం వ్రాసింది సౌభాగ్యమ్మ.

* * *

"అయినా మన పరిస్థితులు అమ్మకు తెలీవా ? అన్నయ్యదే వెయ్యిరూపాయల జీతం. దాని ముందు నాదేపాటి ? కటింగ్స్ అన్నీ పోను చేతి కందేది ఐదు వొందలే! నాకు మాత్రం ఎలా సాధ్యపడ్తుంది? అయినా బొట్టుపెట్టె వెండిదే ఉండాలా ? యింకా నయం బంగారంది కొనమని వ్రాయలేదు !! ముసలితనం వస్తే చాదస్తం కూడా పుట్టు కొస్తుంది" అని తల్లి ఉత్తరాన్ని విసుగ్గా మడుస్తూ జేబులో పెట్టుకున్నాడు సుధాకరం.

"ఈ మాట ఎవరైనా వింటే నవ్విపోతా రండీ! ఎవరిదండీ చాదస్తం ? పదిమాసాలు మోసి కని, ప్రేమతో పెంచి ఇంతవాడ్నిచేసిన కన్నతల్లి కోరిక తీర్చటం మీ కర్తవ్యం కాదా ? ఇంకా నయం 'నెల కింత పంపు'అని కరాఖండీగా వ్రాసే గయ్యాళి తల్లికి పుట్టలేదు మీరు !! మొన్న వేసంగి సెలవుల్లో అత్తగారు చూపించిన అభిమానం నిజంగా ఎప్పటికీ మరచిపోలేను. చచ్చిపోయిన నా కన్నతల్లిని మరపించింది" అంది రమణి భర్తను నిలదీస్తూ.

కాని సుధాకరానికి రమణి మాటలు రుచించలేదు. అసలు సుధాకరం పైసా పైసా వెనకేసుకునే మనిషి. తల్లైనా, తండ్రైనా ఒక్కటే !


"అంత బెంగ పెట్టుకోకపోతే. సమస్య తీరే ఉపాయం ఆలోచించండి. లేకపోతే బాగుండదు" అంది రమణి.

ఆ రోజంతా సుధాకరానికి మనసు మనసులో లేదు. తల్లి కోరిక తనపై పడుతున్న పెనుభూతంలా అనిపించ సాగింది. ఆమె కోరిక తీర్చాలని అతనికి ఏ కోశానా లేదు.

తల్లి కోసం ఐదు వందలు ఖర్చుచేసే బదులు—బ్యాంకులో వేసుకుంటే మూడేళ్ల కల్లా చాలా వడ్డీ వస్తుంది.

సుధాకరం ఆలోచనలన్నీ అలాగే పోగాయి.

రైతుల పాలిటి కల్పతరువు
రామగుండం యూరియా





ఆంధ్రప్రదేశ్‌లో
తయారు చేయబడుతున్న
యూరియా,
రామగుండం యూరియా,
అన్ని పంటలకు, అన్ని కాలములకు
అనువైన ఎరువు
వాడండి
రామగుండం యూరియా.

ది ఫెర్టిలైజర్ కార్పొరేషన్
ఆఫ్ ఇండియా లి.
అమ్మకపు విభాగము
6-2-30/C, లకిడి కా పూల్, హైదరాబాదు-500 004

బొట్టు పెట్టె

మర్నాడు రమణితో చెప్పకుండా తల్లికి ఒక ఉత్తరం వ్రాసి పడేసాడు సుధాకరం.

*   *   *

ఉత్తరం చదివి బావురుమంది సౌభాగ్యమ్మ.

సుధాకరం అంత కటువుగా వ్రాస్తాడని కలలోకూడా ఊహించలేదామె. "ఏమండీ! చూడండీ వీడు ఎంతటి కృతఘ్నుడో! నేనీ పల్లెటూర్లో కూర్చుని తింటూ గొంతెమ్మ కోరికలు కోరుతున్నానట. తీర్చడానికి అక్కడెవరూ లేరని వ్రాసాడు. మీ రన్నట్లు నాది పిచ్చి కోరికేనండీ! ఇకపై ఎవ్వరినీ అడగనండీ! ప్రమాణ పూర్తిగా!" కళ్లొత్తుకుంటూ మనసులో రగుల్తున్న ఆవేదనతో అంది సౌభాగ్యమ్మ భర్త దీక్షితులుతో.

దీక్షితులు మనసు ఆర్ద్రతతో నిండి పోయింది. చినుకుల్లాంటి రెండు కన్నీటి బొట్లు కళ్ల నుంచి స్రవించాయి.

జాలి పడవలసిన కన్న కొడుకులు కటువుగా ప్రవర్తించడానికి కారణం తన అసమర్థత! బలహీనత.

భార్య కోరిక తీర్చలేని బ్రతుకు ఎందుకు?

ఒక్కసారి బ్రతుకు ఏహ్యమనిపించింది దీక్షితులుకి. తను భార్య కోరిన బొట్టుపెట్టె కొనిస్తే ఆమె కంట నీరు పెట్టేది కాదు.

దీక్షితులి మనసు నిండా భార్య కోరిక ఎలాగైనా తీర్చాలన్న కఠోర దీక్ష, ఆవేశం నిండిపోయినాయి.

*   *   *

తన కోరిక ఏ కొడుకూ తీర్చలేదన్న విషయం జ్ఞప్తికొచ్చినప్పుడల్లా కృంగిపోయేది సౌభాగ్యమ్మ. అప్పుడప్పుడు శేఖరం నుంచి ఉత్తరాలు వచ్చినా తన కోరికను కొన్నాళ్లలో తీరుస్తానని వాయిదా వేస్తూ వచ్చాడు.

కాల ప్రవాహంలో ఐదు నెలలు కరిగి పోయాయి.

దీక్షితులు రోజా పన్నెండు గంటలకల్లా గుడి మూసి 'రామ తీర్థం' లో రామాయణ కాలక్షేపం చెప్పటానికి వెళ్తున్నట్లు సౌభాగ్యమ్మకు చెప్పి వెళ్లి ఏ సాయంత్రానికో వచ్చేవాడు.

అలా గడుస్తున్న రోజుల్లో ఒక రోజు—

సౌభాగ్యమ్మ భాగవతం చదువుకుంటోంది.

ఆటువంటి సమయంలో ఒకాయన గబగబా వచ్చి—"మీరేనా సౌభాగ్యమ్మ" అని అడిగాడు.

ఎందుకో అర్థం కాలేదు ఆమెకు. ఔనంది.

"అమ్మా! దీక్షితులుగారు మీకేం అవుతారు?" ప్రశ్నించాడు అతను.

"భర్త."

"అమ్మా! మీ భర్తగారు స్పృహతప్పి పడిపోయారు. ప్రస్తుతం మహారాజా ఆసుపత్రిలో ఉన్నారు. వెంటనే బయల్దేరండి" అంటూ గాబరాగా చెప్పి సౌభాగ్యమ్మను జట్కాలో తీసుకెళ్లాడు.

కళ్లవెంట జలపాతాల్లా కన్నీళ్లు కారుతూంటే— అనేకమైన ఆలోచనలతో— భారమైన గుండెతోను ఉగ్గబట్టుకుని— విజయనగరం చేరుకుంది సౌభాగ్యమ్మ.

* * *

బెడ్‌మీద కట్టెలా అచేతనంగా పడివున్న దీక్షితుల్ని చూసి బావురుమంది సౌభాగ్యమ్మ.

"ఏమండీ ఏమిటి జరిగింది? ఈయనకేం ప్రమాదం లేదుకదా!" వచ్చీ రాగానే ప్రశ్నలు కురిపిస్తూంటే, ప్రక్కనున్న ఒకవ్యక్తి యిలా చెప్పాడు—

"అమ్మా! ఈ బాబు మాతోటే పని చేస్తూ మూడు నెల్లయింది. నెల్లిమర్ల దగ్గర రాళ్లుకొట్టే పనమ్మా! గొప్పింటి వారిలా ఉన్నారని మీకెందుకని ప్రశ్నిస్తే తన భార్య కోరికను ఎలాగైనా తీర్చాలని— అది తీర్చడానికి అయిదు వందలు కావాలని— ఆ డబ్బు కూడేదాకా తాను శ్రమించక తప్పదని చెప్పారు. ఈ రోజు తను కొనవలసిన దానికి డబ్బు కూడిందని చెప్పి మాతోపాటే టౌన్లోకొచ్చి గంటస్థంభం దగ్గిరున్న నగలషాపులో ఈ పెట్టె కొని వస్తూ దారిలో పడి పోయారు. యింతలో మేం చూసి ఆసుపత్రిలో చేర్పించి— మీకు కబురు పంపాం."

ఆ వ్యక్తి తన దగ్గరుంచిన పెట్టె తీసి సౌభాగ్యమ్మ చేతుల్లో పెట్టాడు.

అది వెండి బొట్టు పెట్టె! తను ఇన్నాళ్ళుగా కోరుకుంటున్నది. తనిన్నాళ్లు కొడుకులను వేధించినది దీని కోసమే! తన కోరిక తన దైవాన్ని సమస్యల సుడిగుండంలో తోస్తుందని ఊహించలేదు. బొట్టుపెట్టె భయంకరమైన సర్పంలా కనిపిస్తోంది ఆమెకు.

ఇంతలో డాక్టరు వచ్చి— "అమ్మా! ఈయన శక్తికి మించిన పని చేయడం మూలంగా మెదడులోని నరాలు దెబ్బతిన్నాయి. నాకు సాధ్యమైనంతవరకూ ప్రయత్నించాను. కాని యింక లాభం లేదు. మీరు ఎవరెవరికి టెలిగ్రాంలు యిచ్చుకోవాలో యివ్వండి. లేదా నాకు అడ్రసులు చెపితే నేనే యిస్తాను" చెప్పాడు.

ఫౌంటెన్లోంచి ఒక్కసారి నీళ్లు చిమ్మి నట్టు కనుల్లోంచి నీరుబికింది. హృదయం నిండా వరదలా ఆవేదన. చురకత్తిలాంటి దుఃఖం గుండెను ముక్కలు ముక్కలు చేస్తోంది.

చేతిలో బొట్టుపెట్టె విహ్వలంగా నవ్వుతున్నట్టనిపించింది. తన కోరిక తన పాలిట శాపంలా పరిణమించింది.

అంత ఏడుపులోనూ వణుకుతున్న కంఠంతో ఎగపట్టి కొడుకులు అడ్రసులు చెప్పి, డబ్బు యిచ్చింది.

భర్తను హాస్పిటల్లో ఉంచటం మంచిది కాదని— ఏ క్షణాన ప్రాణం పోతుందో చెప్ప లేమని డాక్టర్ అనడంతో— సౌభాగ్యమ్మ టాక్సీలో దీక్షితుల్ని తీసుకుపోయింది.

మరో టెస్ట్‌ట్యూబ్ బేబి !

పశ్చిమ జర్మనీలో మొట్టమొదటి టెస్ట్‌ట్యూబ్ బేబి ఏప్రిల్ 16న జన్మించింది. ఆసుపత్రి అధికారులు వెంటనే ఈ విషయాన్ని బయటకు రానివ్వలేదు. ఇటీవలే ఆసుపత్రి డైరక్టరు ప్రొఫెసరు కార్ల్ గూంతర్ ఓబర్ పాత్రికేయుల సమావేశంలో దీనిని వెల్లడించారు. ఈ బేబీ పుట్టినపుడు 4.15 కిలోల బరువున్నది. బిడ్డ బరువు ఎక్కువగా వుండటంతో ప్రమాదమేమీ జరుగకుండా వుండాలనే ఉద్దేశ్యంతో సిజేరియన్ చేశారు. ఈ బేబీకి ఆలివర్ అని నామకరణం చేశారు.

టెలిగ్రాఫ్ వాళ్లకు భగవంతుడు ఏం చురుకు పుట్టించాడో కాని అనుకున్నకన్నా ముందే టెలిగ్రాంలు అందడంతో శేఖరం, సుధాకరం పెళ్లాం పిల్లల్తో పరుగున వచ్చారు.

అప్పటికే దీక్షితులి ప్రాణాలు అనంత దూరం సాగిపోయాయి. ఇల్లంతా విషాద నాదాలతో ప్రతిధ్వనించింది. కన్నీటి కడలి ప్రవహించింది.

భర్త శవం ప్రక్కన కూర్చుని ఉన్న సౌభాగ్యమ్మ కొడుకుల్ని చూసి ఆవేదనతో— "ఒరే! ఎందుకురా ఇంక ఈ ఏడుపులు. ఒకప్పుడు నేను కోరిన కోరిక మీరు తీర్చి ఉంటే ఈనాడు మనింటి దీపం ఆరిపోయి వుండేది కాదురా! ఒరే మీ నాన్న దేముడ్రా! నాకు తెలీకుండా రెక్కలుముక్కలు చేసుకుని ఒక్కో రక్తం ముక్కతో ఒక్కో పైసా కూడపెట్టి నా కోరిక తీర్చి తను బలైపోయ్యార్రా! ఇన్నాళ్లు ఏ బొట్టు పెట్టైతే నేను కోరుకున్నానో అది అడుగు పెట్టి నాబొట్టు చెరిపేసిందిరా! ఒకప్పుడైతే వెండి బొట్టుపెట్టె తెరిచి ఆనందంతో నుదుట కుంకుమ దిద్దుకునేదాన్ని. కాని ఆ అర్హత నాకింక లేదు. నా కోరిక నన్ను కాల నాగులా వెంబడించి కాటేసింది. అయినా తప్పంతా నాది. అందుకే భగవంతుడు నాకీ శిక్ష విధించాడు. నాకంతే కావాలిరా... అంతే కావాలి." పిచ్చిగా అరుస్తూ తల బాదుకుంది సౌభాగ్యమ్మ.

తల బాదుకుంటున్న తల్లిని ఊరడించి— "అమ్మా! మేం నీ పట్ల ఎంత క్రూరంగా ప్రవర్తించామో అర్థమైందమ్మా! మేం ఏ కోరికను తీర్చకుండా స్వార్థం చూసుకున్నా మమ్మా! ఈ అపరాధం క్షమింపరానిదే అయినా మమ్మల్ని క్షమించమ్మా! అంతవరకూ మాకు శాంతి ఉండదమ్మా!" అంటూ చిన్న పిల్లల్లా కాళ్లపై పడి ఏడవసాగారు శేఖరం, సుధాకరం.

సౌభాగ్యమ్మ — "అంతా నా తల రాతరా! మీరు చేసేదేముంది ?" అంటూ కొడుకులను చెరొక వైపుకు తీసుకుంది.

వాసంతి, రమణి ఆ దృశ్యం చూస్తూ కంట తడి పెట్టకుండా వుండలేక పోయారు.



30-7-1982 శుక్రవారం మొదలు 5-8-1982 గురువారం వరకు

★మేషం:—గ్రహ గతిలోని మార్పులు, రాజకీయ రంగంలో మీకు అనుకూల ప్రదాలు. ఆరోగ్యానికి, హాయికి, ఆనందానికి, కించిత్తు ధన లబ్ధికి అనుకూల వారం. స్త్రీలకు:—ఉన్నతోద్యోగ సంపాదనకు, ఉన్న ఉద్యోగంలో ఉన్నత స్థితి, వృత్తిలో పెంపుకు అనుకూల వారం.

★వృషభం:—దాయాదివర్గం మూలాన చికాకులు ఏర్పడుతాయి. వియ్యానికిపోతే, కయ్యం ఎదురైనట్లుంటుంది. ప్రతి రంగంలో గ్రహించిమెలగండి. రాజకీయంగానూతనావకాశాలుంటాయి. చేజిక్కించుకోండి. వ్యవసాయపు పనులలో కొందరు నిమగ్నులు కానున్నారు. స్త్రీలకు : విలాస వస్తు సేకరణ, విందు వినోదావకాశాలుటాయి.

★మిథునం:—కావలసినన్ని అవకాశాలు, కావలసినంతగా హితుల ఆదరణ, అనుకోకుండా ధనలబ్ధి, చాలకాలంగా కనిపించని మిత్ర బృంద సందర్శనానికి అవకాశం గల వారం. స్త్రీలకు: సుఖ శాంతులకు, గృహానందానికి కొరతలేని వారం. అందవలసినపైకం సమయానికి అందగలదు.

★కర్కాటకం : మీ సామర్థ్యంప్రకాశింపగలవారం. తోడి వారి సహాయం లభించే వారం. శుభ కార్యాలోచనలకు దోహదం చేసే వారం. రాజకీయంగా ప్రయత్నించటానికి అవకాశం గలవారం. స్త్రీలకు: నూతనోద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన విషయాలు తెలిసికొనే అవకాశం గల వారం.

★సింహం:—మీ చాతుర్యానికి, మీ నిబ్బరానికీ యిది పరీక్షా సమయం. ఎంత శాంతంగా ఉంటే అంత మేలు. వ్యాపారంలో, సాంఘిక వ్యవహారాలలో మీకు లాభదాయకవారవే· స్త్రీలకు : సుఖ శాంతులకు, ధన రాబడికి మేలైన వారం.

★కన్య—వారం వారం ఒకేలాగ అనుకోరాదు. గత కొన్ని వారాలకన్నా, మిన్నగా, నలుగురలో ఎన్నికనందనున్నారు. కొందరు కంటి బాధకుగురి కాగలరు. కొందరకు ప్రయాణం చెప్పవచ్చు. స్త్రీలకు:—ధన లబ్ధి, ఉత్సాహం, కుటుంబానందానికి అవకాశం గల వారం.

★తుల:—అతి సులభంగానెరవేరుతుంది అని అనుకొన్న వ్యవహారంలో ఆటంకాలు రాగలవు. కొందరి చేత ఒత్తిడి కూడ అనుభవించవలసి రావచ్చు. చేతికి అందవలసిన ద్రవ్యం సమయానికి అంది రాదు. స్త్రీలకు: పనుల వత్తిడి, చికాకు, అనారోగ్యతలు గల వారం.

★వృశ్చికం:—వారమంతాఏదో పోగొట్టుకొన్నట్లు, ఏదో తప్పు చేసినట్లుగా బాధ పడుతారు. ఇదివరకు ప్రారంభించిన వ్యాపారంలో అభివృద్ధి కనిపిస్తుంది. స్త్రీలకు : బంధు విరోధం, ఉదోగంలో చికాకులు, కొని తెచ్చికొన్న లాగు అవుతుంది. ఇందుకుతోడు ఆరోగ్యబంగం కూడా చెప్పవచ్చు.


★ధనుస్సు:—రాజకీయంగాఎత్తుకు పై యెత్తు వేసే వారికి, కార్యసాధన నిమిత్తమై ప్రయాణించే వారికి, భూ సంపాదనా ప్రయత్నంలో నిమగ్నులయిన వారికి యిది సుకరమైన వారం. స్త్రీలకు : అనవసరమైన గొడవలు, ప్రయాణాల్లో కొందరకు ప్రమాదా లుంటాయి.

★మకరం:—అన్ని విధాలా మేలైన వారం· సాంఘికంగా, రాజకీయంగా, వ్యావహారికంగా మీకు ఏదో మేలు చేకూర గల వారం. అమూల్యములైనవస్తు సేకరణ చేయగలరు. స్త్రీలకు : నూతన విషయ సేకరణకు, నూతన మిత్ర సందర్శనానికి, నూతనోద్యోగ ప్రాప్తికి అనుకూల వారం.

★కుంభం:—సమయానికి ధనం చేతకందే అవకాశం ఉన్నది. దూర బంధువులు యింటికి రావటం, వారికై ఖర్చు చేయవలసి రావటం గమనించగలరు. స్త్రీలకు :ధనాదాయంలో అభివృద్ధి, భూ తగాదా ఉంటే సులువుగా పరిష్కరింపబడగలదు. స్త్రీలకు : వృధా కాలక్షేపం, చిక్కిన అవకాశాలు జారిపోవటం సంభవం.

★మీనం:—రాజకీయంగా బాగుండేవారం. క్రయ విక్రయాలలో లాభ సంపాదనకు అమవైవ వారం. ఒకానొక వ్యవహారంలో మిత్ర సహాయం లభించగలదు. స్త్రీలకు : ఉత్తరాల మూలాన ప్రముఖమైన విషయాలు తెలిసికొంటారు. శ్రమించి ఏదో లాభం గడింపనున్నారు. ఉత్తమ ఫలదాయక వారమే.

—విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి*



అమ్మ

కంచుమర్తి వేంకటేశ్వరరావు



త్యాగరమ్మ గారింటికి వెళ్లి వస్తున్న మాణిక్యమ్మ కాలిజోడు మధ్యలో తెగి పోయింది. మాణిక్యమ్మకు ఎలా వయస్సయి పోయిందో జోడుకూడా ముక్కలు ముక్కలుగా తెగి జీర్ణావస్థలో ఉంది.

తెగిన జోడును పారెయ్యలేక, కుట్టించ డానికి కొంగున చిల్లరపైసలు లేక పదిలంగా చేత్తో పట్టుకుని వచ్చింది మాణిక్యమ్మ ఇంటికి.

గుమ్మంలోకి అడుగు పెట్టగానే లోపలి నుండి వచ్చిన కోడలు కమల కయ్‌మంది.

"ఆ దిక్కుమాలిన జోడును పారెయ్యకుండా చేత్తో మరీ తీసుకొచ్చారు. కొడుకు కనీసం జోడైనా కొనడని నలుగురికీ తెలియాలి కాబోలు."

కోడలి మాటలు కొత్త కాదు మాణిక్యమ్మకు.

అందుకనే కోడలుతో వాదించకుండా ఏడుస్తున్న చిన్న మనవడిని ఎత్తుకుంది.

మాణిక్యమ్మ భర్త మాధవరావు సంవత్సరం క్రితం గుండెపోటుతో మరణించాడు. అంతకు ముందు రోజున భర్తతో బజారు కెళ్లిన మాణిక్యమ్మ కోడలుకు గాజులు, మనవళ్లకు బట్టలు కొన్నది.

"మాణిక్యం ... నీ జోళ్లు మరీ పాతబడి పోయాయి" అని జోళ్ల షాపుకు తీసుకెళ్లాడు మాధవరావు.

"నా కెందుకండీ కొత్త జోళ్లు."

మాధవరావు పట్టుపట్టి కొన్నాడు.

అందుకే ఆ జోళ్లంటె మాణిక్యమ్మకు ప్రాణం. ఆ జోళ్లను చూచినప్పుడల్లా చనిపోయిన భర్త గుర్తుకొచ్చి కన్నీళ్లు వచ్చేవి మాణిక్యమ్మకు.

ఆ జోళ్లను భద్రంగా ఒక మూల ఉంచి ఎక్కడికన్నా వెళ్లితే వేసుకునేది. ఆరునెలల తర్వాత ఒక జోడు కొంచెం తెగితే కొడుకు దగ్గర పావలా తీసుకుని కుట్టించుకుంది. ఒక్కడనుండి మొదలయ్యాయి జోళ్లకు అప్పుడప్పుడు అతుకులు పడడం.

ఒకరోజు కమల బజారుకెళ్లి పిల్లలకు బట్టలు, జోళ్లు కొనుక్కొని వచ్చింది.

ఆ రాత్రి కొడుకు సత్యం అన్న మాటలు చిన్నగా వినిపించాయి.

"అమ్మ జోళ్లు తెగిపోయాయి. తీసుకు రాక పోయావా"

తన మీద ఆ మాత్రం ప్రేమ ఉన్నందుకు పొంగిపోయింది.

"ఈ వయస్సులో మీ అమ్మకు షోకులు కావాల్సివచ్చాయా ... ఇంట్లో కూర్చున్న ఆవిడకెందుకు జోళ్లు."

కోడలు సమాధానం కొంత బాధనిపించింది మాణిక్యమ్మకు.

కొడుకు మాటలు మరి వినిపించలేదు.

కోడలు చేస్తున్న ఆధిపత్యాన్ని గాని, విసిరే విసుర్లను గాని పెద్దగా పట్టించుకునేది కాదు మాణిక్యమ్మ.

ఆ అమాయకత్వమే మరింత బలాన్నిచ్చేది కమలకు.

జి. జయలక్ష్మీదేవి



జననం: 7-9-41 ★ మరణం: 10-7-81

నీ ఆదరాభిమానములను ఎప్పటికీ మరచిపోలేని
భర్త : జి. సుబ్రహ్మణ్యం
కుమారుడు : జి. శ్రీనివాస్
దుర్గ్ (మ.ప్ర)

అమ్మ

పాతబడిన జోళ్ళతోనే సరిపెట్టుకుని వస్తోంది.

మళ్ళీ ఈ రోజు ఒక జోడు తెగిపోయింది.

మరి కుట్టించడానికి పనికిరాదు.

అదీగాక భర్త ముచ్చట పడి కొన్నజోళ్ళు కనుక పారెయ్యడానికి మనస్సంగీకరించడం లేదు.

పదిలంగా ఒక దగ్గర ఉంచిందా జోళ్ళను.

జోళ్ళు లేకుండానే నడవడం అలవాటయింది మాణిక్యమ్మకు.

* * *

"కమలా ... వరండాలో నా జోళ్ళు ఎక్కడా కనిపించడం లేదు. వెధవది రెండు నెలలయింది కొని, అప్పుడే తెగిపోయింది నిన్న. అలా ఆఫీసు కెళ్ళేటప్పుడు కుట్టించాలనుకుని అరగంట ముందే బయలుదేరుతున్నాను. చూడు... చూడు ... పిల్లలు వాటితో ఆడి ఎక్కడ పెట్టేసారో కనబడితే కాగితం చుట్టి బేగ్‌లో పెట్టివ్వు."

ఆఫీసుకు బయలుదేరుతున్న సత్యం వరండాలో జోళ్ళు కనబడక పోయేసరికి గంతులేయడం ప్రారంభించాడు.

కమల గదంతా వెదికింది.

జోళ్ళు కనిపించలేదు.

"అబ్బబ్బ...పెట్టిన చోట ఉంచరు కదా వస్తువుల్ని. పిల్లలెక్కడ పెట్టేసారో. బడి నుండి వాళ్ళొస్తే గాని తెలియదు ఎక్కడున్నాయో."

విసుక్కుంటూ బయటి కెళుతున్న సత్యం ఆగిపోయాడు.

మాణిక్యమ్మ చేతో్త జోళ్ళను పట్టుకుని వచ్చింది.

"ఒరేయ్...ఉదయం చూసానురా ... నీ జోడు తెగిపోయి ఉంది. సమయానికి పిల్లలు కూడా లేరు. జోళ్ళు లేకుండా ఆఫీసుకెలా వెళతావు? వెళ్ళేలోపల వచ్చేయచ్చనుకుని జోళ్ళను బజారుకు తీసుకెళ్ళి కుట్టించానురా." అని మాణిక్యమ్మ చేతిలోని జోళ్ళను కొడుకు కాళ్ళదగ్గర ఉంచింది.

> **తేడా**
>
> నీలో లేని అందాన్ని
> చూపమంటున్నావు అద్దాన్ని.
> అదెలాగూ చూపదు.
> నీవెలాగైనా దాన్ని
> బద్దలుకొట్టక మానవు.
> నీకూ అద్దానికీ ఎంత తేడా!
>
> **పెదబొబ్బలు**
>
> బుజ్జగించి
> నీ చేత బహూపరాక్కాని
> అనిపించుకున్నవారే
> బొజ్జలు పెంచుకుని
> నీవు విమర్శిస్తే
> పెదబొబ్బలు పెడతారు!
>
> **ప్రగతి**
>
> వెళ్ళాల్సిన దూరం
> ఎంతనేది కాదు ప్రశ్న.
> మనం వెళుతున్న
> వేగం ఎంతన్నదే సమస్య.
>
> — పరిగి రాధాకృష్ణ

అమ్మ ముఖం చూడలేక తలొంచుకున్న సత్యానికి అమ్మ కాలి నుండి రక్తం కారుతుండడం కనబడింది.

కంగారు పడ్డాడు సత్యం.

"అమ్మా...ఆ రక్తమేమిటి ?"

"రోడ్డుమీద ఎవడో ఆకతాయి వెధవ గాజుపెంకు పడేసినట్లుంది, చూడకుండా దాని మీద కాలేసాను. గుచ్చుకుందంతే. పెంకు వచ్చేసిందిలే కంగారు పడకు."

అని లోపలకు వెళ్ళిపోయింది మాణిక్యమ్మ.

సిగ్గుతో కుంచించుకు పోయిన సత్యం అమ తెచ్చిన జోళ్ళలో కాళ్ళు పెడుతుంటే చిన్నగా వణికాయి.

అమ్మ గుండెల పైన పాదాలు పెడుతున్నట్లనిపించింది.


అంతే ...

గబ గబ బయటకు వెళ్ళాడు.

ఆఫీసుకు కాదు ...

జోళ్ళ షాపుకు ...

అమ్మకు జోళ్ళు కొనడానికి. ★



సెబాష్ రామూ మేచ్‌ని గెలిపించావు—చొక్కా మురికైతే ఏంపోయిందని!
"నా చొక్కాదే గెలుపు
—మళ్ళీ ఎంత తెల్లబడిందో!"
హై పవర్ సర్ఫ్
అమిత తెల్లగా ఉతుకుతుంది...అమిత తెల్లగా, కనువిందుగా!
సెబాష్‌సర్ఫ్' అమ్మకి యిందులో పాలుంది—
నిజానికి మురికిని తీసిపారేసే ఛాంపియన్
హై పవర్ సర్ఫ్ అమ్మకి తోడు. సర్ఫ్‌లో, మరింత
చురుకుగా పనిచేసే పదార్థాలుండటం వల్ల,
అది మురికినంతటినీ తీసేసి అమిత తెల్లగా
ఉతుకుతుంది. ఇంతచేసినా మరి సర్ఫ్
మీ బట్టల్ని శ్రద్ధగా చూసుకుంటుంది,
మీ చేతుల్ని సున్నితంగా చూసుకుంటుంది.
ఏ గృహిణికైనా అరగండి— ఉండటానికైతే
వందలకొద్దీ పౌడర్లున్నాయిగాని తను నమ్మేది
ఒక్క సర్ఫ్ మాత్రమేనని.
High Power
Surf
washes whitest
and it shows!
తెల్ల బట్టలకి సెబాష్ తెలుపు; రంగు బట్టలకి సెబాష్ గెలుపు
LINTAS:SU.253.2316 TL
హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

ఏదోదారి

భానుమూర్తి



ఆఫీసు పని మీద సికింద్రాబాద్ బయలుదేరాను. స్టేషన్ చేరుకునేసరికి ఏడయింది. అప్పుడే గుంటూరు నుంచి వచ్చి ఆగింది గోల్కొండ ఎక్స్‌ప్రెస్. ఇంకా ఎలా లేదన్నా బయలుదేరేందుకు పావుగంటయినా పడుతుంది. దినపత్రిక తీసుకుని చూస్తూ నుంచున్నా. పేపర్ చూడటంతో పాటు, అప్పుడప్పుడు ప్లాట్‌ఫాం మీదకు దృష్టిని సారిస్తున్నా, చాల సందడిగా వుంది స్టేషన్. విజయవాడ ఎప్పుడూ యింతే. అందునా పుష్కరాల హడావుడి, స్టేషన్ ఈనుతోందా అన్నట్లుగా వున్నారు జనం. మెట్ల మీది నుండి క్రిందకు దిగివచ్చే వాళ్లను చూస్తున్నాను. అందులో ఒకమ్మాయి తొందర తొందరగా మెట్లు దిగివస్తూ కనిపించింది. సరిగ్గా నేను నుంచున్న బోగీ దగ్గర కొచ్చి ఆగింది. చేతిలో వైరుతో అల్లిన బాగ్. దానిలో వున్న పర్స్ నుండి టికెట్ బయటకు తీసి చూసుకుంది. మళ్ళీ దాన్ని పర్స్‌లో పెట్టి, పర్స్ బాగ్‌లో పడేసింది ...

సిగ్నల్ యిచ్చారు, ట్రెయిన్ బయలుదేరేందుకు సిద్ధంగా వుంది. పేపర్ మడిచి జనాన్ని తోసుకుంటూ వెళ్ళి నా సీట్లో కూర్చున్నాను. రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్స్ కూడా జనరల్ కంపార్ట్‌మెంట్స్‌లా తయారయ్యాయి. అంతకు ముందు నేను చూసిన ఆ అమ్మాయి విండో ప్రక్క సీట్లోకి వచ్చి కూర్చుంది. పద్దెనిమిదేళ్లుంటాయేమో. కళ్లల్లో నుంచి ఆకర్షణ వుంది. పల్లెటూరు పడుచయినా, పట్నంలో మసలే వ్యక్తిలా బిహేవ్ చేయాలన్న ఆరాటం కన్పిస్తోంది. బాగ్ పక్కన పెట్టుకుంది. చూడబోతే ఆమెతో ఎవరూ వస్తున్నట్లు లేదు. విండో గ్లాస్ పైకెత్తి బయటకు చూస్తూ కూర్చుంది. పేపర్‌లో నుంచి ఆమెను గమనిస్తూ వుండిపోయాను. ట్రెయిన్ డోర్నకల్ దాటాక కాఫీకి ఆర్డరిచ్చాను. ట్రెయిన్‌లో సర్వ్ చేసే కాఫీ బాగా లేకున్నా, అందరితో పాటు నాకూ తాగాలనిపించింది. ఆమె కూడ కాఫీకి ఆర్డరిచ్చింది. కాఫీ తాగి రూపాయి నోటిచ్చి చిల్లర తీసుకున్నాను.

ఆమె కప్పు కింద పెట్టి డబ్బులిచ్చేందుకు బ్యాగ్ నుండి పర్స్ తీయబోయింది. పర్స్ కనుపించలేదు. ఆమె షాక్ తిన్నది. కంగారుగా బ్యాగంతా వెతికింది. ఒకటికి రెండుసార్లు మళ్లీ కలయ జూసింది. నాతో పాటు అక్కడ కూర్చున్న వాళ్లందరూ ఇది గమనిస్తూనే వున్నారు. ఆమె ముఖంలో కంగారుతో పాటు, భయం చోటు చేసుకుంది...

"ఏమ్మా ఏమయింది" అడిగాడొకాయన.

"పర్స్ కనిపించటంలేదండి" హీన స్వరంతో అన్నది.

"ఎక్కడ పెట్టావ్" మరొకతను.

"బాగ్‌లో పైనే పెట్టాను."

"ఇంకేం, ఎక్కేముందు ఎవరో కొట్టేసుంటారు."

"అయినా పర్స్ పైన పెట్టుకుంటారా" తలొక మాట.

"జాగ్రత్తగా బ్యాగంతా చూడండి" అన్నాను నేనూ కలుగజేసుకుంటూ.

దాంట్లో వున్న బట్టలు ప్రక్కన పెట్టి, అన్నీ దులిపి చూసింది. కనుపించలేదు.

ఇది విని, ప్రక్క వరుసలో కూర్చున్న వాళ్ళు కూడ అక్కడకు వచ్చి చేరారు.

"ఏమయింది, ఏమయింది"

"పర్స్ పోయిందిట"

"ఎవరిది?"

"అదిగో ఆ అమ్మాయిది"

అందరూ ఆమె వంక చూశారు.

"ట్రెయిన్ ఎక్కేముందు త్రోవలో యేమయినా పడిందేమో చూడమనండి" అందులో ఒకాయన అన్నాడు.

ఆ అమ్మాయి లేచి అంతా చూసి వచ్చింది. ఎక్కడాలేదు. సీటు దగ్గరకొచ్చి అలాగే నిలుచుండి పోయింది.

"అసలు పర్స్ బ్యాగ్‌లోనే పెట్టావా?"

"అవును. ఎక్కేముందు కూడ వుంది" అంది.

"పర్స్‌లో ఎంతుండేమిటి?"

"యాభై రూపాయలు" దిగాలుగా చెప్పింది.

"టికెట్ కూడ అందులోనే వుంది" మళ్ళీ ఆమే అంది.

"అయ్యో!"

అల్చిప్పల్లాంటి ఆ కళ్ళల్లో కన్నీళ్ళు చోటు చేసుకున్నాయ్; క్రింద పడేందుకు సిద్ధంగా వున్న వాటిని, ఆమె కర్చీఫ్‌తో అద్దుకుంది. అంతవరకూ మిల మిలా మెరుస్తున్న ఆ కళ్ళు అలా కావటం బాధని పించింది. దీనంగా వున్న ఆమె ముఖం చూస్తే జాలి పుట్టుకొచ్చింది ... కాఫీ డబ్బుల కోసం వచ్చినతను పరిస్థితి తెలుసుకుని, కప్పు తీసుకుని వెళ్ళిపోయాడు.

"నుంచునే వున్నావ్, కూర్చో" అన్నాదొకామె.

ఆ అమ్మాయి కూర్చుంది.

"ఎక్కడిదాక వెళ్ళాలి మీరు" అడిగాను.

"హైద్రాబాద్"

"ఎక్కడ్నుంచి వస్తున్నారు" ఎవరో అడిగారు.

చెప్పింది.

"నీతో ఎవరూ రావటంలేదా అమ్మాయ్" ఓ తాతగారు అడిగారు.

"లేదు ఒక్కదాన్నే ..." భయంగా చూస్తూ అంది.

"ఇదే మొదటిసారా హైద్రాబాద్ వెళ్ళటం"

"ఇంతకు ముందొక సారి చూసా" తలొంచుకుని చెప్పింది.

"స్టేషన్‌కు ఎవరయినా వస్తున్నారా"

"లేదు...అన్నయ్య దగ్గరకు వెళుతున్నా. ఇంటి అడ్రెస్ తెలుసు" అంది.

"టికెట్ కూడ పోయింది పాపం - టి.సి. వస్తే ఎలాగ" అన్నారెవరో.

ఆమె భయంగా, దిగులుగా తలొంచుకుని, కిందకు చూస్తూ కూర్చుంది. 'ఎంత పని జరిగిపోయింది' అన్న విచారం ఆమెలో కన్పిస్తోంది –

ఇంతలో నా కుడి ప్రక్కన కూర్చున్నతను లేచాడు. మనిషి తెల్లటి ధోవతి కట్టు

చెర వడిలింది...

కొండలు పగలేసినా
గుండెలు బలి చేసినా
కాదు కాదు యీ సారాజ్యం
వీవు కోరే సమ సమాజం
లంచగొండులు పీఠమెక్కి
వంచనల సూత్రాలు మెక్కి
బీద బిక్కని అణగ్రదొక్కి
గాలిమేడల కట్టా ప్రభుత్వంలో
పోయిన నీ ప్రాణమంత విజం
రాదు రాదు నవ సమాజం
ఫాసిస్టు ప్రభుత్వపు విషకౌగిలిలో
కమిలిపోయి కరిగిపోయిన రాజూ,
నీ చెర వడిలింది...
మా చెర మిగిలింది...

– రమణశ్రీ

కున్నాడు; తెల్లటి లాల్చీ, పైన కండువా, పెద్దమనిషిలా, వున్నవాడిలా వున్నాడు. లాల్చీ జేబునుంచి పది రూపాయల నోటు తీసి, "ఇది నీ చేతి ఖర్చులకి వుంచమ్మాయ్" అంటూ అందివ్వబోయాడు. ఆమె తీసుకో లేదు బిడియపడుతోంది అటువంటి పరిస్థితి వచ్చినందుకు కుంచించుకుపోతోంది.

"ఫరవాలేదు ఉంచమ్మాయ్" అన్నా డాయన మళ్ళీ.

పక్కన ఎవరో "తీసుకోమ్మా" అన్నారు.

తననుండి తీసుకునేందుకు ఫీలవుతున్న దేమోనని, ఆమె కెదురుగా కూర్చున్నామె కిచ్చి, ఆ పది రూపాయల నోటు ఆ అమ్మాయి కివ్వమని చెప్పాడు. ఆమె అది తీసుకుని ఆ అమ్మాయి చేతిలో పెడుతూ; "ఉంచమ్మాయ్" అంది. చేతిలో వుంచిన నోటు చూస్తూ అలాగే కూర్చుంది ఆమె. ఆమె పరిస్థితి నాకూ జాలి గొలిపింది.

"మీరేం ఆదుర్దా పడకండి. టి. టి ఇ. నాకు తెలిసినవాడే. హైద్రాబాద్ వెళ్ళేవరకూ మీకేం బాధలేదు" అన్నాను

ఆమె కళ్ళెత్తి నా వేపు చూసింది.

"ఇది కూడా వుంచండి" అంటూ ఓ అయిదు రూపాయల నోటు తీసి ఆమె కెదురుగా కూర్చున్నామెద్వారా ఆ అమ్మాయికి యిప్పించాను. అక్కడున్న వారిలో ఇది చూస్తున్న కొందరు తమకు తోచింది ఆ అమ్మాయి చేతిలో పెట్టారు. అంతా కలిపి నలభై రూపాయల దాక యిచ్చి వుండవచ్చు. డబ్బు చూసుకున్న తరువాత ఆ అమ్మాయి కొద్దిగా తేరుకున్నట్లు కనిపించింది. "పోనీలే పాపం" అనుకున్నాను.

"స్టేషను నుండి ఒక్కదానివి వెళ్ళ గలవా" ఓ ముసలాయన అడిగాడు.

"వెళతాను" అన్నట్టుగా తలూపింది.

నాకు సికింద్రాబాద్‌లో అర్జెంటు ఆఫీసు పని వుండిపోయింది. అదీగాక టైమ్ కూడ లేదు. మళ్ళీ నేను తిరిగి రాత్రికే విజయవాడ చేరుకోవాల్సి వుంది లేకుంటే హైద్రాబాద్ వరకూ ఆ అమ్మాయితో వెళదామనే అనుకున్నా. టి. టి. ఇ. కు ఆమె విషయం చెప్పి వుంచాను. ట్రెయిన్ సికింద్రాబాద్ చేరుకునేసరికి రెండయింది. దిగిపోతున్నపుడు వస్తానన్నట్టుగా ఆమెవేపు చూశాను. తలూపుతూ మరోసారి చూసింది—కృతజ్ఞతా భావంతో.

ఇదో దారి

అది జరిగిన నెల రోజుల కనుకుంటాను— బంధువుల్లో ఒకరి వివాహానికి నెల్లూరు వెళ్ళాల్సి వచ్చింది. నాతోపాటు నా కొలీగ్ నాయుడు కూడా నెల్లూరు వస్తున్నాడు. అతనికి అక్కడేదో పర్సనల్ వర్క్ వుందట. మంచి కంపెనీ యిస్తాడు... మాటల్లోనే నెల్లూరు వచ్చేసింది. ఇద్దరం ట్రెయిన్ దిగి ప్లాట్‌ఫాం మీద నడుస్తున్నాం. మా పక్క బోగీలో ఏదో గలాటా జరుగుతున్నట్టుంది. కొందరు ఒకచోట గుమిగూడి వున్నారు. 'అదేంటో చూద్దాం పద' అన్నాడు నాయుడు. నేనూ అతనితో కదిలాను... ఎవరిదో అమ్మాయిది పర్సు పోయిందట... ఆ అమ్మాయి మద్రాసు వెడుతోంది. పర్సులో టికెట్‌తోపాటు డెబ్బై రూపాయల దాకా వున్నాయట! జనాన్ని త్రోసుకుని ముందుకు వెళ్ళాను...

"ఆల్చిప్పల్లాంటి ఆ కళ్ళల్లో కన్నీళ్ళు చోటు చేసుకున్నాయ్..."

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను.

ఆ రోజు నేను సికింద్రాబాద్ వెళుతూ చూసిన అమ్మాయే!

నా కళ్ళు నన్ను మోసం చెయ్యలేవు.

ఆమె కళ్ళెత్తి పైకి చూసింది.

ఆ కళ్ళల్లో ఎటువంటి తొట్రుపాటులేదు.

"అతనెవరో పాపం పది రూపాయలిచ్చి ఆదుకున్నాడు" అన్నారెవరో.

ఆటువేపు చూసాను.

విచిత్రం!

తెల్లటి ధోవతి, తెల్లటి లాల్చీ, పైన కండువా!

పెద్దమనిషిలా, ఉన్నవాడిలా వున్నాడు— అతనే!!...

ట్రెయిన్ కదలటంతో హడావుడిగా క్రిందికి దిగి వచ్చేశాను...

నడుస్తూ దారిలో నాయుడికి నా అనుభవం చెప్పాను.

అంతా విని నాయుడు; "ఇలాంటి వాళ్ళుండబట్టే, నిజంగా సఫరయ్యే వాళ్ళకు కూడ మనలాంటివాళ్ళు సహాయం చేసేందుకు సందేహిస్తున్నారు. నిజంగా సఫరయ్యేవాళ్ళు అవుతూనే వున్నారు. దేశమే ఇలా వుంది" అన్నాడు.

హైదరాబాదు నోట్‌బుక్

పోతన వత్సరం సమాప్తి—

నన్నయ వత్సరం ఆరబ్ధి :

జూన్ 26, 27 లలో రవీంద్రభారతి, జూబిలీ హాలులలో జరిగిన పోతన పంచశతజయంతి సమాప్త్యుత్సవం రెండవనాటి సమావేశంలో ముఖ్య మంత్రి శ్రీ భవనం వెంకట్రామ్ ప్రసంగిస్తూ 1982 జులై ఒకటవ తేదీ నుంచి సంవత్సరం పాటు నన్నయ సంవత్సరంగా పాటించడానికి నిర్ణయించామన్నారు. తెలుగు సాహిత్యానికి అంకితులైన పోతన, శ్రీనాథ, నన్నయ, వేమనల వంటి మహనీయులను మరువరాదని ఆయన అన్నారు. మొదటి రోజు సమావేశానికి ముఖ్య అతిథిగా ఉన్న కేంద్ర మంత్రి శ్రీ శివశంకర్ ప్రసంగిస్తూ పోతన తెలుగు వారందరి వాడని, ఒంటిమిట్టలో పుట్టాడా, బమ్మెరలో పుట్టాడా అనే విచికిత్స నవసరమని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి తమ ప్రసంగంలో ప్రాచీన కవులను సంస్మరించుకొనడం అవసరమని, ఇలాటి కార్యక్రమాన్ని ముందు కూడ కొనసాగించాలని అన్నారు. కేంద్ర మంత్రి శ్రీ సంజీవరావు ప్రసంగిస్తూ తెలుగు మహాకవులకు, సాహితీవేత్తలకు చరిత్రలో సముచిత స్థానం కల్పించడంలేదని, ఈ విషయంలోమనం తమిళుల నుంచి చాల నేర్చుకోవాలని, తమిళులు తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి విగ్రహాన్ని ఢిల్లీలో ప్రతిష్ఠించనున్నారని అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖా మంత్రి శ్రీ పి. కృష్ణంరాజు స్వాగతం చెప్పారు. 26 వ తేదీ రాత్రి డాక్టర్ వెంపటి చినసత్యం దర్శకత్వంలో శ్రీకృష్ణ పారిజాతం నృత్య నాటకం ప్రదర్శించారు. 27 వ తేదీన జూబిలీహాలులో శ్రీ దేవులపల్లి రామానుజరావు అధ్యక్షతన పోతన భాగవతంపై జరిగిన గోష్ఠిలో డాక్టర్ ఇలపావులూరి పాండురంగారావు మున్నగు పలువురు ప్రసంగించారు. 27వ తేదిరాత్రి సురభి నాటక కళా సంఘం కృష్ణలీలలు నాటకం ప్రదర్శించింది. జులై నుంచి నన్నయ సంవత్సరంగా పరిగణించాలని నిర్ణయించినందుకుముఖ్యమంత్రిని ప్రశంసించక తప్పదు. ఈ సందర్భంలో ఒక చిన్న సలహా. ఈ ఉత్సవాలు వాసార్య దోరణిలో జరిగేవి కావు కనుక లాభనష్టాలు లేని ప్రాతిపదిక మీద నన్నయ భారతాన్ని రూపాయి ధర పెట్టి ప్రచురించి ప్రజాసామాన్యానికి అందిస్తేబాగుంటుంది. ఉత్సవాలు చేయడం ఇదివరకు చెప్పిన విషయాలే ఏకరువు పెడుతూ ఉన్న వ్యాసాలతో ప్రత్యేక సంచికలు వేయడం, వాటిలో తెలుగంటే ఏమో తెలీనివారితో "నేను నన్నయను చదువలేదు. అయినా ఆయన గొప్ప కవి" అనే దోరణిలో సందేశాలు వినిపడం, పాడిందే పాడరా వంటివారితో ఉపన్యాసాలిప్పించడం కన్నా, నన్నయ భారతాన్ని ప్రజాసామాన్యానికి రూపాయి ధరతో అందివ్వడం మేలు. ఉత్సవానికి ఖర్చు పెట్టే లక్షలలో కొన్ని లక్షలు ముద్రణకు కేటాయిస్తే చాలు. ఆనందా ప్రెస్ వారివంటి సంస్థ ప్రతిని ఫోటోస్టాట్ పద్ధతిని ముద్రిస్తే రూపాయి ధర గిట్టుబాటవుతుంది. ఇంటింటా ఒక నన్నయ భారత ప్రతి ఉంటుంది. కోటి ప్రతులు సులభంగా అమ్ముడుపోతాయి. కవుల సాహిత్యాన్ని అందివ్వక ఉత్సవాలు జరిపితే తమకు ఇష్టమయినవారికి ఉపన్యాసాలతోను, సన్మానాలతోను ప్రత్యేక సంచికతోను ఎంతో కొంత ముట్టజెప్పడానికే ఈ పథకాలనే అపఖ్యాతి కల్గుతుంది. విదేశీయులు తమ కవుల సంస్మరణ సభలను ఈ విధంగానే చేశారు. సంవత్సరం చివరన నన్నయ భారతాన్ని బాగా చదివిన, ఆకళించుకున్న పల్లెటూరి పెద్దలను పదిమందిని సన్మానిస్తే బంగారానికి తావి అబ్బినట్లు.

భూమి దురాక్రమణం నిషేధిస్తూ ఆర్డినెన్స్:

ఆంధ్రప్రదేశ్ భూమి దురాక్రమణ నిషేధం ఆర్డినెన్సు జూన్ 30వ తేదీన జారీ అయింది. రెండు నెలలుగా జరుగుతున్న భూమి దురాక్రమణ ఫిర్యాదుల ఫలితమే ఇదని పాఠకులకు తెలుసు. ఈ ఆర్డినెన్సు కింద ఎలాటి భూమి దురాక్రమణ అయినా, శిక్షార్హమైన నేరం, రెండేళ్ల కారాగార శిక్ష, అయిదు వేల రూపాయల జుల్మానా విధించవచ్చు. ఈ ఆర్డినెన్సు ప్రకారం భూమి దురాక్రమణల విచారణకు ట్రిబ్యునల్స్ నియమిస్తారు. అవి విచారణ జరిపి ఆరు నెలలో ఉత్తర్వులు జారీ చేస్తారు.

రాష్ట్రపతికి వీడ్కోలు :

రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి సతీసమేతంగా జూన్ 7వ తేదీన హైదరాబాదుకు విచ్చేసి మూడు వారాలపాటు బొలారంలోని రాష్ట్రపతి నిలయంలో బసచేసి జూన్ 28వ తేదీన కొత్త ఢిల్లీకి తిరిగి వెళ్లారు. ఆయన రాష్ట్రపతి నిలయంలో ఉంటూ తిరుపతి, శ్రీశైలం, షిర్డీ మున్నగు క్షేత్రాలను దర్శించి వచ్చారు. తాను సంతృప్తిగా పదవినుంచి జులై 25న విరమిస్తున్నానని, పార్టీలకు అతీతంగా ఉంటూ ప్రజాసేవ చేయదలిచానని ఆయన ఒక గోష్ఠిలో తెలిపారు. జూన్ 28న బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతికి రాష్ట్రగవర్నరు, ముఖ్యమంత్రి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ వెందేకంటి వెంకటసుబ్బయ్య, పలువురు అధికారులు, ప్రముఖులు వీడ్కోలు చెప్పారు.

ఉపశ్రుతి :

ఏం సార్, బమ్మెర పోతన్న సంవత్సరం తర్వాత నన్నయ సంవత్సరమంటున్నది ప్రభుత్వం?— అనడిగారు ఒక జిజ్ఞాసువు. ముందు వచ్చిన చెవుల కన్నా తర్వాత వచ్చిన కొమ్ములు వాడి అంటే ఇదేగా — అన్నారు ఒక శ్రోత.

విజ్ఞప్తి

9—7—82 నాటి ఆంధ్ర సచిత్ర వార పత్రిక హైదరాబాద్ నోట్ బుక్ ఉపశ్రుతి చివరి వాక్యం "భూమి దురాక్రమణదారునే వైస్ చాన్సలర్ చేద్దూరా ఏ బెడదా ఉండదు—అన్నారు అబ్బూరి వరద" అని చదువుకోగోరినాము.

—తిరుమల రామచంద్ర



ఇటీవల శ్రీ త్యాగరాయ గానసభ, హైదరాబాదులో "సరిగమ ఆర్ట్స్" ఆధ్వర్యంలో జరిగిన 'రాగ రథం' కావ్యావిష్కరణోత్సవంలో కార్యకర్త శ్రీ వడ్డెపల్లి కృష్ణ కావ్యగానం చేస్తున్న దృశ్యం. శ్రీ డి. ఎస్. మూర్తి, డా. ఇరివెంటి కృష్ణమూర్తి, ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం (స్వీకర్త), డా. దాశరథి, డా జి. వి. సుబ్రహ్మణ్యం గార్లని చిత్రంలో చూడవచ్చు.

అవీ... ఇవీ... అన్నీ...

క్రోక్విల్ అవార్డుల పోటీ-1982

తెలుగు వ్యంగ్య చిత్రకారులను ప్రోత్సహించేందుకు మూడవ రాష్ట్ర స్థాయి కార్టూన్ల పోటీని ఆంధ్రప్రదేశ్ క్రోక్విల్ అకాడమీ నిర్వహిస్తోంది. 'ఉత్పాదక సంవత్సరం' అనే ప్రధానాంశంపై జరిగే ఈ పోటీతో బాటు కొత్త కార్టూన్లకు, అచ్చయిన కార్టూన్లకు కూడా పోటీ వుంటుంది. పోటీకి వచ్చిన ఎంట్రీలలో తెలుగు వాతావరణాన్ని పొందు పరుస్తూ బొమ్మల్లోనూ, వ్యాఖ్యల్లోనూ చక్కటి హాస్యాన్ని స్ఫురింపజేసే వ్యంగ్య చిత్రానికి కీ. శే. తలిసెట్టి రామారావు స్వర్ణ పతకాన్ని, అత్యుత్తమంగా వున్న వ్యాఖ్యరహిత వ్యంగ చిత్రానికి కీ. శే. శివలెంక శంభుప్రసాద్ స్వర్ణపతాకాన్ని ప్రవేశపెట్టడం, విజేతలకు లాంఛన వేతనం అంద జేయడం ఈ పోటీకి కొత్త ఆకర్షణలుగా వుంటాయి. ఈ పోటీ గడువు 31-7-82 తో ముగుస్తుంది. పోటీ పూర్తి వివరాలకు స్వంత చిరునామా, 0 50 పైసల స్టాంపు గల 9×4 అం. ల కవరును కార్యదర్శి, ఆం. ప్ర. క్రోక్విల్ అకాడమీ, 2-2-1109/5 బి/4, బాగ్ అంబర్ పేట, హైదరాబాదు – 500 013 పేర పంపి పొందవచ్చును.

'చేతన' అభినందన సభ

గుంటూరులోని 'చేతన' సాహితీ సాంస్కృతిక సంస్థవారు ఇటీవల వర్ధమాన కవి శ్రీ అన్నపురెడ్డి విజయ భాస్కరరెడ్డి అభినందన, సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు శ్రీ జె. బాపురెడ్డి అధ్యక్షత వహించగా జిల్లా కలెక్టరు శ్రీ టి. గోపాలరావు సభను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ సి. నారాయణరెడ్డి విచ్చేశారు.

శ్రీయుతులు అమరేంద్ర, కరుణశ్రీ, పేరాల భరత శర్మ, పొన్నెకంటి హనుమంతరావు, సినీ నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు సన్మానితుని ప్రతిభని ప్రస్తుతిస్తూ ప్రసంగించారు. 'చేతన' సంస్థవారు సన్మానితుని దుశ్శాలువతో సత్కరించగా, అభిమానులు పదివేల రూపాయల పర్సు కవికి బహూకరించారు.

బండ్లమూడి మాట


పద్యకావ్యం(ద్వితీయ భాగం.) రచన: శ్రీ బండ్లమూడి సత్యనారాయణ. 32 పేజీలు. వెల: రెండు రూపాయలు. ప్రతులకు: ఇందుమతీ ప్రచురణలు, నరసింహారావుపేట, ఏలూరు—534006.

బతుకు పోరు

నవల రచన: శ్రీ బి. ఎస్. రాములు. 112 పేజీలు. వెల: 5 రూ. లు. ప్రతులకు: సృజన, హనుమకొండ, వరంగల్—506001 లేక పీస్ బుక్ సెంటర్, 4—6—421, సుల్తాన్ బజార్, హైదరాబాదు—500001.

శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద

సంగ్రహ సమీక్ష. రచన: శ్రీ కొత్త వెంకటేశ్వరరావు. 34 పేజీలు. వెల: ఒక రూపాయి. ప్రతులకు: సేవా సాహితి, సంగం జాగర్లమూడి—522213, తెనాలి తాలూకా, గుంటూరు జిల్లా.



ప్రముఖ పారిశ్రామిక వేత్త, రాజాలక్ష్మి ఫౌండేషన్ వ్యవస్థాపక మేనేజింగ్ ట్రస్టీ శ్రీ పి. వి. రమణయ్య రాజా 1982—83 సంవత్సరానికి హిందుస్థాన్ వాణిజ్య సంఘం (మదరాసు) అధ్యక్షులుగా ఎన్నికైనారు.

ఏలూరు కళాశాలల విద్యార్థుల కవితా సంకలనం జయభేరి

సంకలనకర్త శ్రీ బండ్లమూడి సత్యనారాయణ. 62 పేజీలు. వెల: 8 రూ. లు. ప్రతులకు: ఇందుమతీ ప్రచురణలు, నరసింహారావుపేట, ఏలూరు—534006.

తిరుపతి వెంకన్న

సమర్పణ: స్వామి కృష్ణదాస్ జీ. భాగవత సేవా సమాజ ప్రచురణ—9 గా వెలువడిన 160 పేజీలు గల ఈ పుస్తకంలో తిరుపతి పుణ్య క్షేత్ర మహాత్మ్యాన్ని తెలిపే అనేక ఆసక్తికరమైన విషయాలున్నాయి. వెల 6 రూ. లు. ప్రతులకు: తిరుమల తిరుపతి దేవస్థానంవారి గ్రంథ విక్రయశాలలు.

మధుజ్వాల

కవితా సంపుటి. రచన: శ్రీమతి జ్యోతిరాణి. 150 పేజీలు. వెల:పది రూపాయలు. ప్రతులకు: కిన్నెర పబ్లికేషన్స్, 2—2—647/153, సెంట్రల్ ఎక్సైజుకాలనీ, హైదరాబాదు—13 లేదా రచయిత్రి పేర, కేరాఫ్ శ్రీ ఎ. రవీంద్ర, 1—7—281, బాకారాం, హైదరాబాదు—600048.

లయ

కవితా సంకలనం: పాయట్రీ పోరం ప్రచురించిన 60 పేజీల ఈ పుస్తకంలో శ్రీయుతులు జింబో, వజ్ఝల శివకుమార్, పి. ఎస్. రవీంద్ర, వారాల ఆనంద్, అలిసెట్టి ప్రభాకర్ల కవితలు ఉన్నాయి. వెల: మూడు రూపాయలు. ప్రతులకు: కళా నికేతన్, 9—1—18, వేములవాడ—505302.


నాలుగు పుస్తకాలు

1. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ, విశ్వ విద్యాలయము యొక్క సంక్షిప్త పరిచయము. 74 పేజీలు—వెల: రూపాయి.
2. సంస్కారముల పరివర్తనము వ్యవహారముల శుద్ధి. 64 పేజీలు. వెల: రు. 1—25.
3. సహజ రాజయోగము—కర్మ యోగము మరియు నిర్వికల్ప సమాధి 40 పేజీలు. వెల: రూపాయి.
4. ఈశ్వరానుభూతికి మార్గము ఒకటా లేక అనేకమా? ముక్తి జీవన్ముక్తి ప్రాప్తి కొరకు నిజమైన మార్గ మేది? 40 పేజీలు. వెల: రూపాయి.

పై నాలుగు పుస్తకాల ప్రతులకు: ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయము, హెడ్ ఆఫీసు: పాండవ భవన్, మవుంట్ ఆబు (రాజస్థాన్) లేక బ్రాంచి ఆఫీసు: 11/185 శివాయివీధి, మదనపల్లి—517326.

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna.


ఈ రెండిటినీ ఇస్తుంది గోల్డ్-
కమ్మదనం మరియు సంతృప్తి
EXPORT QUALITY
CHARMINAR
GOLD
FILTER
గోల్డ్
దీనికి సాటి మరొకటి లేదు.


"సాంప్రదాయ సిద్ధమయిన
భారతీయ ఔషధాలకి
ప్రత్యేకమయిన శక్తివుంది.
ఉదాహరణకి,
అమృతాంజన్."
ప్రకృతిలో లభించే అత్యంత
శక్తివంతమయిన పది మూల
ఔషధాలతో అమృతాంజన్ తయారు
చేయబడుతోంది. అంటే అమృతాంజన్
చాలా శక్తివంతమయినది.
అందుచేత అమృతాంజన్
తలనొప్పులకు, జలుబులకు,
వంటినొప్పులకు, బెణుకులకు
శీఘ్రంగానూ, నిశ్చయంగానూ
ఉపశమనం కలిగిస్తుంది.
అంతేకాదు అమృతాంజన్
సురక్షితమయిన బాధా నివారిణి.
అమృతాంజన్:
80 సంవత్సరాలకు పైబడిన
నమ్మకమైన దివ్య
ఔషధము
AMRUTANJAN
Pain Balm
AM-2148
అమృతాంజన్
తలనొప్పులకు .జలుబులకు.
వంటినొప్పులకు.బెణుకులకు